సృజన



ఆధునిక సాహిత్య
వేదిక

మే/ జూన్ 82
127/ 128

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

127/ 28 మాస పత్రిక మే/జూన్ **1982**

కవరు ఫోటోలో : 1) ఆసుపత్రిలో చెరబండరాజు

2) అరెస్టులో గద్దర్

నిర్వహణ :

సాహితీ మిత్రులు

సంవత్సర చందా రు. 20

ఈ సంచిక రు.3

విరసం మహాసభలు

విప్లవ రచయితల సంఘం తన తొమ్మిదవ రాష్ట్ర మహాసభలను జూన్ 4, 5, 6 తేదీల్లో మాచెర్లలో జరుపుకుంటున్నది. చరిత్రాత్మకమైన పలనాటి యుద్ధం, కన్నెగంటి హనుమంతు పుల్లరి పోరాటం జరిగిన పలనాడులో విరసం తన మహాసభలు జరుపుకుంటున్నది. శ్రీనాథుని చాటువుల్లో రాసినట్లు జొన్నన్నం, జొన్నగటుక తినే పరిస్థితుల్లో మార్పు రావచ్చు, కాని "పరమేశుడు" గంగను విడిచినా, నాగార్జున సాగర్ తలాపున వున్నా ఈ ప్రాంతాల్లో మంచినీటి కటకట అలాగేవుంది. పలనాటి యుద్ధమో, కాటమరాజు కథో ప్రాచీనశౌర్యాన్ని గుర్తుచేసి, వర్తమాన భయంకర పరిస్థితుల్ని మరుగుపరచలేక పోతున్నాయి. నిన్నటిదాకా శిశువుకు దక్కని స్తన్యంగా సముద్రంపాలైన జలాలు ఇప్పటికీ సముద్రం పాలుకానిచోటకూడ కష్టజీవులపాలు మాత్రం కావటం లేదు. నందికొండ నుంచి నాగార్జున సాగర్‌ను ఆవిష్కరించి

మా నెత్తురు కంకరగా
ప్రాజెక్టులు గట్టినం
మా చెమటలు ఏరులుగా
పంటలు పండించినం

గింజెపడిదిరోగంజెపడివిరో - అని అడిగినందుకు చెరబండరాజు పదేళ్ళుగా నిర్బంధాన్ని, ఎనిమిదేళ్ళుగా నిరుద్యోగాన్నీ, అనారోగ్యాన్నీ అనుభవించాల్సి వస్తున్నది. తన అమాయకమైన మనసు మీదికి వచ్చిన అనుభవాలను, చేదుసత్యాలను, తన అవగాహనలోకి వచ్చిన చైతన్యాన్ని ప్రజలకు పాటలుగా, మాటలుగా ప్రచారంచేస్తే ఈ రాజ్యాంగమే కాదు, మానవ సమాజ పరిణామక్రమంలో ఒకనైసర్గికమైన హక్కుగా వచ్చిన భావప్రకటనా స్వేచ్ఛను, సంఘం పెట్టుకునే హక్కును, జీవించే హక్కును ఆయన స్పృహతో, బాధ్యతతో అమలుచేస్తే - మొదలు ఆయన కదలికను, తర్వాత ఆయన పాటను, మాటను తనసంఘంలో తాను మసలుకునే అవకాశాన్ని పరోక్షంగానైనా రద్దు చేసింది ఈ ప్రభుత్వం. ఆయనకు భయంకరమైన జబ్బు ప్రభుత్వం తెచ్చిందని కాదు. ఆయన భావప్రకటనా స్వేచ్ఛపై, తన భావాలు ప్రకటిస్తూ దేశంలో ఎక్కడైనాసరే తిరిగే స్వేచ్ఛపై దాడులు, సోదాలు, అరెస్టులు, కేసులు వంటి నిర్బంధాలను అమలుచేసి ఒక బుద్ధిజీవి ఆలోచనలకు, అందువల్ల

ఆరోగ్యాన్ని కలిచివేసేలా చేసిన ఈ ప్రభుత్వం ఆయన అనారోగ్యానికి బాధ్యత వహించాల్సి వుంటుంది. ఆసుపత్రిలో మాట, చూపు, చలనం, స్పృహలేని స్థితిలో కూడ ఆయన సికిందరాబాదు కుట్రకేసులో ముద్దాయి. ఈ దేశంలో మనుషులు మనుషులుగా జీవించే వ్యవస్థ అంతరించింది. దోపిడిదార్లు-వాళ్ళ చేతుల్లోని పాలక వర్గం మనుషుల్ని నేరస్తులుగా, రోగులుగా, దేశద్రోహులుగా చిత్రించి మానవతా విలువల మీద భయం నీడలను పరచి బెదరగొడుతున్నారు. తిరగబడితే ప్రాణాలతో చెలగాటాలాడుతున్నారు. ప్రాణానికుండే విలువ ప్రాణంతో గుర్తింపబడటం లేదు. ప్రజల జీవితపు గనిలో ప్రవేశించి, అక్కడున్న వైవిధ్యాన్ని, ఆ లోయల్లోని వెలుగు నీడలను, ఆ వెలుగునీడలు ప్రసరించే పల్లవిని, బాణీని పట్టుకొని మట్టినే చేతుల్లోకి తీసుకొని తనపాటతో ప్రాణంపోస్తున్నగద్దర్, "మట్టిబుక్క నెత్తురు కక్కుతూ"నైనా పోరాటపు నెత్తుటి పాటల్ని గురించి రాస్తూ, కాలికి గజ్జె కట్టుకొని దేశమంతా తిరుగుతూ ప్రజారాజకీయాల్ని ప్రచారంచేస్తూవుంటేకూడా ఈప్రభుత్వం కన్నెర్రచేసింది. కళల్లో అరవైనాలుగుమంది ఆస్థాన విద్వాంసులను నియమించుకున్న ప్రభుత్వం ఆస్థానాలు, అకాడమీలు, విశ్వవిద్యాలయాలు, రేడియోలు, పత్రికలు యింకా రకరకాల ప్రచారసాధనాల ద్వారా పాలకవర్గాల రాజకీయాలను ప్రచారం చేస్తున్న మేధావులకు, కళాకారులకు, రచయితలకు ప్రజాధనం కొల్లగొట్టి బహుమానాలు, సన్మానాలు చేస్తున్న ప్రభుత్వం ఎవడబ్బ సొమ్మని ఈ దుబారా అని అడుగుతూనే, మళ్ళీ తాము ఒక్కొక్క చెమటచుక్క కూడబెట్టి పోగుచేసిన ఖర్చుతో ప్రజలే గద్దర్ లాంటి ప్రజాకళాకారుల ప్రదర్శనలు ఏర్పాటుచేస్తే ఈ ప్రభుత్వం అడ్డు పడుతున్నది.

ఏప్రిల్ 9న నిజామాబాద్‌లో జననాట్యమండలి, రాడికల్ విద్యార్థి సంఘం తమప్రేగులపై ప్రపంచ ప్రజల విప్లవ ఆకాంక్షలు మీటుదామనే తీవ్రమైన తపనతో ఏర్పాటుచేసిన జననాట్యమండలి కార్యక్రమాన్ని మొదట అనుమతించి, తర్వాత లాఠీచార్జీ చేసి పోలీసులు చెదరగొట్టారు. గద్దర్‌ను, తోటి కళాకారులను, ప్రదర్శన ఏర్పాటు చేసిన కార్యకర్తలను అరెస్టుచేసి ఇరవైనాలుగు గంటలకు పైగా పోలీసు స్టేషనులో పెట్టడమే కాదు, కేసు బనాయించారు. గద్దర్ ఏ ఒక్కని ఆనందం కోసమో తన కంఠనాళాలు చిట్లగా పాటలు పాడటంలేదు.

కళాపూర్ణోదయం కావ్యంలో తుంబురుని పాట విష్ణువు, లక్ష్మి వినటంకోసం వేత్రహస్తులు (పోలీసులు) సభనంతా చెదరగొట్టిన ఘట్టం ఒకటుంది. పోలీసులు

పాశవిక (శాడిస్ట్) ఆనందాన్ని పొందటం మన సంస్కృతిలో కొత్తకాదు. కాని "మీసా కింద నాసా కింద నిన్ను నన్ను పెట్టినారు" అని ఈ పాలకవర్గాలు పోలీసుల కిస్తున్న తప్పుడు శిక్షణనుంచి, వర్గేతర చైతన్యం నుంచి వాళ్ళను మేల్కొలపటానికి, వాళ్ళ యిల్లేదో వాళ్ళకు తెలియచెప్పటానికి, వాళ్ళ వేర్లెక్కడ వున్నాయో వాళ్ళకెత్తి చూపటానికి గద్దర్ ఎలుగెత్తి పాడితే పాలకవర్గాల కాళ్ళకిందినుంచి మట్టి తొలిచినట్లయింది.

ఒక దశాబ్దంగా నిజామాబాదు జిల్లాలో ప్రజాసాహిత్యోద్యమంలోనూ, ప్రజాస్వామిక, పౌరహక్కుల ఉద్యమంలోనూ ముందు నిలచి, దారిద్ర్యాన్ని, ఇతరఇబ్బందులను లెక్కపెట్టకుండా దృఢంగా మునుసాగుతున్న సి. హెచ్. మధు ఇంటిపై ఏప్రిల్ 18న పోలీసులు దాడి చేసారు. ఆయన జిల్లా పౌరహక్కులసంఘం కార్యదర్శి. జన సంస్కృతి అధ్యక్షుడు. విరసం సభ్యుడు. ప్రముఖ రచయిత. ప్రముఖ తెలుగు పత్రికలన్నిటిలో ఆయన కథలు, కవితలు ప్రచురింపబడడం మాత్రమే కాదు బహుమానాలు కూడ అందుకున్నాడు. పోలీసులు ఆయన ఇంటిపై దాడి చేసి పుస్తకాలు ఎత్తుక పోవడమే కాకుండా ఆయన భార్యను రెండు గంటల పాటు ప్రశ్నించి అరెస్టు చేస్తామని కూడ బెదిరించారు. ఎందుకు? ఆయన ప్రజల పక్షం వహించి రాస్తున్నందుకు మాట్లాడుతున్నందుకు.

ప్రజలపై, ప్రజాస్వామిక ఉద్యమాలపై, ప్రజారచయితలపై వర్గద్వేషంతో చేసే దాడులను ప్రజాస్వామ్యవాదులే కాదు, పార్లమెంటులోనూ, ఈచట్టాల్లోనూ విశ్వాసంవున్న ఉదారవాదులుకూడా చూస్తూఊరుకుంటే, ఖండించకపోతే ఆప్రమాదం ఎంత దూరం వస్తుందో చెప్పడానికి (మరోచిక) నవలా నిషేధం మంచి ఉదాహరణ. ఈ నిషేధ ఆయుధం అధికార వర్గాల్లోనే సీతాదేవిగారి ఉద్యోగానికి ఇబ్బందులు కలిగించడానికి వాడుకున్నట్లు కనిపిస్తుంది. నిర్బంధం, నిషేధం లాంటి ఆయుధాలను వర్గవివక్షతతో వాడినపుడు ప్రశ్నించకపోతే వ్యక్తిగత ప్రయోజనాలు, కక్షలు తీర్చుకోడానికి తాను తప్ప యితరులు సుఖంగా వుండటానికి వీల్లేని పద్ధతిలో దుర్వినియోగం చెయ్యటానికి, ఫాసిస్టు స్వభావానికి తల్పం వదలినవాళ్ళమవుతాం.

ఇటువంటి పరిస్థితుల్లో విప్లవ రచయితల సంఘం తన తొమ్మిదవ రాష్ట్రమహాసభ జరుపుకుంటున్నది. ఒక వైపు విప్లవోద్యమంపై, దానివెలుగు వెన్నెల అయిన

సాంస్కృతికోద్యమంపై ప్రభుత్వం ప్రత్యక్షదాడికి పూనుకొంటున్నది. మరొక వైపు సంస్కరణవాదం, కుహనా విప్లవవాదం, అనుభూతి వాదం, శిల్పవాదం, సిద్ధాంత వ్యతిరేకత, సంఘవ్యతిరేకత వంటి విలోను విశృంఖల వాదాలతో సాహిత్యరంగంలో రాళ్ళు రువ్వటానికి, బురద చల్లడానికి ప్రయత్నాలు ముమ్మరమవుతున్నాయి.

ఇవన్నీ నిస్సంశయంగా విప్లవోద్యమం బలపడుతుందనటానికి నక్సల్‌బరీ లాగే విరసం కూడ ఒక ప్రభావంగా తెలుగు సాహిత్యోద్యమంలో అగ్నిచరిత్రను సృష్టించిందనటానికి నిదర్శనమే. శుద్ధకళావాదులు, స్వచ్ఛమైనఅనుభూతి వాదులు కూడా విప్లవ సాహిత్యంగురించి రాజకీయాలగురించి కూడా వ్యతిరేకంగా అనుభూతిచెందక తప్పనిస్థితిని భారతీయ సామాజిక జీవితంలో ఎజెండామీదికి నక్సల్‌బరీ తెచ్చింది. అదేనిన్న శ్రీకాకుళంలోను, నేడు ఆదిలాబాద్, కరీంనగర్ రైతాంగ పోరాటంలోను మేధావులను కళాకారులను నిలువనీని ఆలోచనకు గురి చేస్తున్నది. ఈ ఆలోచనలను శత్రువు పసికట్టి దోపిడీ స్వభావం కల భావవాదపు ఆయుధాలతో విజృంభిస్తున్నాడు. విప్లవోద్యమ విజయం అంతిమ లక్ష్యంగా గల విప్లవకారులు, సాహిత్య సాంస్కృతిక, కళారంగాల్లో పనిచేస్తున్నవాళ్ళు ప్రజల్ని సమీకరించి చైతన్య ఐక్యత సాధించి పోరాటానికి సన్నద్ధం చేయటానికి తాము ముందుగా ఐక్యం కావలసివుంది.

విరసం తొమ్మిదవ మహాసభలు మౌలికంగా ప్రజల పక్షం వహించి ఆలోచించే సాంస్కృతిక కార్యకర్తలందరినీ ఐక్యంచేసే ప్రయత్నంలో ఒక్క అడుగు వేసినా అది ముందడుగే. అట్లే దేశవ్యాప్తంగా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో వున్న నూతన ప్రజాస్వామిక దృక్పథంకలవాళ్ళనందరినీ పరస్పరం తెలుసుకునే అవకాశం కల్పించే ప్రయత్నం చేసినా అది ఒక మంచి ప్రారంభమే అవుతుంది. ఈ మహాసభలు ఈ దిశలో ఆలోచిస్తాయని ఆశిద్దాం.

సంపాదకుడు

21-5-82.

మేడే ప్రత్యేకం

పుస్తక పరిచయం

భారత కార్మిక ఉద్యమ చరిత్ర (1830-1947)

కె. బాలగోపాల్

[Working class of India, History of emergence and movement, 1830-1970 by Sukomal Sen]

మొదట పుస్తకం శీర్షిక గురించి రెండు మాటలు చెప్పాలి. 1830—1970 అని శీర్షికలో వుందిగాని, పుస్తకం మాత్రం 1947 తో ఆగిపోయింది. తరువాతి చరిత్ర గురించి చాలా క్లుప్తంగా ఒక అధ్యాయంలో మాత్రం చెప్పి వదిలేసారు రచయిత. రెండవది, పుస్తకంలో కార్మికోద్యమ చరిత్ర ఎంతవుందో, జాతీయఉద్యమ చరిత్రగూడ అంతవుంది. ఇది కొంతవరకు సుగుణమే—ఎందుకంటే అన్ని రాజకీయ పార్టీలుగూడ 1947 కు పూర్వం కార్మిక ఉద్యమాన్ని జాతీయ ఉద్యమంలో భాగం గానే చూసాయి. అయితే చాలా సందర్భాలలో రచయిత కార్మిక ఉద్యమంతో సంబంధంలేని విషయాలలోకి వివరాలలోకి, పోవడం జరిగింది. బహుశా కాంగ్రెస్ రాజకీయాల గురించి తన అభిప్రాయాల్ని చెప్పక వదిలేయడానికి సుకోమల్ సేన్‌కు మనసొప్పలేదు కాబోలు.

I

పూర్వరంగం

కార్మికులు అంటే పెట్టుబడిదారీ దోపిడీకి గురయ్యే శ్రామికులు. పాశ్చాత్య దేశాలలోలాగ మన దేశంలో పెట్టుబడిదారీ దోపిడీ సహజంగా పుట్టలేదు. అంటే భూస్వామ్య వ్యవస్థను నాశనంచేసి ముందుకు రావడం జరగలేదు. తద్భిన్నంగా, ఇక్కడికి పెట్టుబడిదారీ దోపిడీ ఇంగ్లండునుండి దిగుమతి అయింది.

భారతదేశం బ్రిటన్‌కు వలసగా మారిన క్రమంలో రెండు దశలున్నాయి. మొదటి దశలో, అప్పటికింకా పారిశ్రామిక విప్లవాన్ని సాధించని బ్రిటన్‌కు ఆ విప్లవాన్ని సాధించడానికి అవసరమయిన పెట్టుబడిని సమకూర్చి పెట్టడం భారతదేశపు చారిత్రక కర్తవ్యమయింది. దీనికి సాధనం ఈస్ట్ ఇండియా కంపెనీ. 1757 నుండి 1812 వరకు భారతదేశపు వాణిజ్యం మీద గుత్తాధిపత్యం వహించిన 'కంపెనీ', ఆ గుత్తాధిపత్యం వల్ల వచ్చిన లాభాలే కాకుండ, రాజుల నుండి, సంస్థానాధీశుల నుండి, వ్యాపార పన్నులు విధించే హక్కును చేజిక్కించుకునీ, వడ్డీ వ్యాపారం చేసీ, సేక

క్రమంలో, పుట్టింది భారత కార్మికవర్గం. అయితే దాని పుట్టుకలోనే కొన్ని అవలక్షణాలున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ భూస్వామ్య వ్యవస్థను నాశనంచేసే క్రమంలో, ఆ భూస్వామ్య సమాజపు వృత్తిపనివారి (artisans) వర్గాన్నిగూడ నాశనం చేస్తుంది. కమ్మరీ, వడ్రంగీ, మేదరీ తమ జీవనాన్ని కోల్పోతారు. వాళ్ళ స్థానంలో ఫ్యాక్టరీలు వస్తాయి. అయితే పాశ్చాత్య దేశాలలో తమ జీవనాన్ని కోల్పోయిన వృత్తి పనివాళ్ళు, తమ స్థానాన్ని ఆక్రమించుకున్న ఫ్యాక్టరీలలోనే కార్మికులుగా స్థిరపడ్డారు. అంటే అక్కడి కార్మికవర్గానికి మొదటి నుండి గూడ పారిశ్రామిక ఉత్పత్తిదారుల లక్షణాలున్నాయి. దీనివల్ల వాళ్ళకు కార్మికవర్గ చైతన్యం త్వరలోనే అలవడింది.

వలస సంబంధాల రూపంలో పెట్టుబడిదారీ సంబంధాలు ప్రవేశించిన మన దేశంలో ఇట్లా జరగలేదు. బ్రిటిష్ ప్రభుత్వం ఒక ప్రక్క బ్రిటిష్ వస్త్రాలను విరివిగా మన దేశానికి ఎగుమతిచేస్తూ, ఇక్కడినుండి సాంప్రదాయకంగా ఎగుమతయిన వస్తువులమీద మాత్రం విపరీతమయిన పన్ను విధించిన కారణాన ఇక్కడి వృత్తిపని వాళ్ళు క్రమంగా తమ జీవనాన్ని కోల్పోయారు. అయితే వాళ్ళ స్థానాన ఫ్యాక్టరీలు ఏర్పడడం చాలా మందకొడిగా సాగిన కారణాన, వాళ్ళంతా గ్రామాలకు వెళ్ళి అక్కడి పీడిత రైతాంగంలో భాగమయ్యారు. గనులలోను, తేయాకు తోటలలోను, జనపనార మిల్లులలోను పనిచేసే కార్మికులు ఈ పీడిత రైతాంగం నుండి వచ్చినవారే గాని వృత్తి పనివాళ్ళ వర్గం నుండి వచ్చినవారు కారు. దీనివల్ల భారతదేశ కార్మిక వర్గపు చైతన్యం చాలా వెనుకబడి వుండడం జరిగిందని, ఆ వర్గానికి పారిశ్రామిక పూర్వరంగం లేకపోవడం వలన, భూమిమీదే ఎక్కువ మమకారం ఉండడం వలన, ఎప్పటికయినా రెండెకరాల భూమి సంపాదించుకుని గ్రామానికి తిరిగిపోదామన్న దృక్పథమే బలంగా ఉండడం వలన,కార్మికోద్యమానికి ఆ వర్గం సంఘటితం కావడం కష్టమయిందని, గుర్తించిన వారిలో ఎం. ఎన్. రాయ్ ఒకడు. ఈ గ్రామీణ పూర్వ రంగం కార్మికోద్యమంలో సంస్కరణ వాదానికి మార్గం సుగమం చేస్తుందని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ తన ఆరవ సమావేశంలో (1928లో) సిద్ధాంతీకరించింది.

ఈ లోపాన్ని పెట్టుబడిదార్లు తమ లాభాలకోసం సహజంగానే వాడుకున్నారు. కార్మికులు సంఘటితం కాలేకపోవడం, దోచుకునేవాడిని 'దొర'గా పరిగణించి వర్గ కసికి బదులు ప్రభుభక్తిని ప్రదర్శించే భూస్వామ్య సమాజతత్వం, వాళ్ళకు చాలా అనుకూల మయినాయి. ఫలితంగా, కార్మికుల జీవన పరిస్థితులు, పని పరిస్థితులు ఎంత అన్యాయంగా తయారయ్యాయంటే, గ్రామీణ-ప్రాంతాలలో జమీందారీ దోపిడీ

ఎంత దారిద్ర్యాన్ని సృష్టించినా గ్రామాలను వదలి గనులలోకి తేయాకు తోటలలోకి జనపనార మిల్లులలోకి వెళ్ళడానికి పేద రైతాంగం వెనకాడింది. దానివల్ల, దారిద్ర్యం తాండవమాడే ఈ దేశంలో పారిశ్రామిక కార్మికులకు కొరత ఏర్పడే వికృత పరిస్థితి ఉద్భవించింది. మొదటి ప్రపంచ యుద్ధం వరకు ఈ కొరత కొనసాగింది. బీహార్ నుండి, తూర్పు బెంగాల్ నుండి దారిద్ర్యంవల్ల వలస వెళ్ళినవాళ్ళు పారిశ్రామిక కేంద్రంగా రూపొందుతున్న కలకత్తాలో కార్మికుల కొరత ఉన్నప్పటికీ, కలకత్తా నగరానికంటే పశ్చిమ బెంగాల్ గ్రామీణ ప్రాంతాలకే ఎక్కువగా వెళ్ళారు. 1901 సంవత్సరానికి సంబంధించి ఒక రచయిత వేసిన అంచనా ప్రకారం ముజఫర్‌పూర్ జిల్లా నుండి వలస వెళ్ళిన 67,000 మందిలో కేవలం 20,000 మాత్రమే కలకత్తా నగరానికి వెళ్ళారు.

'ఈ విపరీత పరిస్థితిని గురించి ప్రభుత్వం విచారణ జరపాలి' అని పెట్టుబడిదార్ల సంఘాలు (Chambers of Commerce) ఘోష పెట్టాయిగాని, ఆ పెట్టుబడిదార్ల విపరీతపు దోపిడీయే దీనికి అసలు కారణం. ప్రభుత్వమే నియమించిన ఫ్యాక్టరీ కార్మికుల కమిషన్ రిపోర్టు ప్రకారం, పనికాలం సాధారణంగా సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉండేది. ఫ్యాక్టరీకిగాని కరెంటు ఉంటే (ఆ రోజులలో కరెంటు చాలా కొత్త విషయం అని గుర్తుంచుకోవాలి) సూర్యాస్తమయం తర్వాత గూడ పనిచేయాలి. బొంబాయిలోని కరెంటుగల 85 మిల్లులలోకి 60 మిల్లులలో పనికాలం 13 నుండి 15 గంటలు. అహమ్మదాబాద్‌లో 14 గంటలు, బ్రోచ్‌లోను, ఢిల్లీలోను 13½ నుండి 14½ గంటలు, ఆగ్రాలో నయితే 15 గంటల పైబడిగూడ వుండేది. బట్టల మిల్లుల పరిస్థితి ఇట్లాగుంటే, కలకత్తాలోని జనపనార మిల్లులలో పనికాలం 16 గంటలు ఉండేది. అంటే, వైద్యుల సలహా పాటించి ఆనాడు కార్మికులు 8 గంటలు నిద్రతీసే వారనుకుంటే, వారు మెలకువగా ఉన్న కాలమంతా పని చేయాలన్నమాట.

ఇది గూడ కొంత 'భారీ' పరిమాణంగల పరిశ్రమలలోని పరిస్థితి. చిన్నచిన్న ఫ్యాక్టరీలలోని పరిస్థితి—రచయిత భాషలో-నరకప్రాయం. రైస్ మిల్లులలోను పిండి మిల్లులలోను ముద్రణాలయాలలోను 20 నుండి 22 గంటలు పనిచేసే సందర్భాలు గూడ లేకపోలేదని ఏ కమ్యూనిస్టులోకాదు, ప్రభుత్వపు కమిషనే అధికారికంగా చెప్పింది. అంతేకాదు, వాడియా అనే ఒక మిల్లు యజమాని, తన ఫ్యాక్టరీలో ఇంజను

పొద్దున 4 గంటలకు పని ప్రారంభిస్తుందని, రాత్రి తొమ్మిది గంటల వరకు నడుస్తుందని, ఈ సమయమంతాగూడ ఆ కార్మికులే పనిచేస్తారని, అన్నాడు. అమానుషత్వానికి పరాకాష్ఠగా, "పని ఎక్కువగా ఉండే నెలలలో-అంటే మార్చి ఏప్రిల్ నెలలలో-ఫ్యాక్టరీ రాత్రింబగళ్ళు పనిచేస్తుంది. సాయంత్రం ఒక్క అరగంట మాత్రం విరామం ఉంటుంది. కార్మికులు ఇట్లా రాత్రింబగళ్ళు, కేవలం అరగంట విశ్రాంతితో 8 రోజులపాటు పనిచేస్తారు. 8 రోజుల తరువాత ఇక వాళ్ళు పని చేయలేరు కాబట్టి వాళ్ళను తొలగించి, మరొక 8 రోజులపాటు వేరొక కార్మిక బృందాన్ని నియమిస్తాను.... ఇది నా ఒక్కడి అలవాటుకాదు, అందరూ అవలంబించే పద్ధతే.... ఈ విపరీతమయిన పనికాలంవల్ల కార్మికులు చనిపోవడంగూడ అసాధారణం కాదు" అన్నాడు.

1908 నాటి ఫ్యాక్టరీ కార్మిక కమిషన్ రిపోర్టు ప్రకారం, దేశంలోని అన్ని ఫ్యాక్టరీలలోని కార్మికులలో 30 నుండి 40 శాతం వరకు 5 నుండి 7 సంవత్సరాల వయసున్న పసిపిల్లలు. బెంగాలులోని ఒక జనపనార మిల్లునుగురించి చెపుతూ ఆ రిపోర్టు, అక్కడి కార్మికులు మిల్లుకు మూడు నాలుగు మైళ్ళ దూరంలో ఉంటారని, పొద్దున 3 గంటలప్పుడు ఫ్యాక్టరీ సైరన్‌మోత విని 7 సంవత్సరాలలోపున్న పసిపిల్లలు, పాలు తాగే పిల్లలను ఎత్తుకుని స్త్రీలు, చలి అనక, చీకటనక, మూడుమైళ్లు నడిచి ఫ్యాక్టరీలో రోజంతా పనిచేసి మళ్ళీ రాత్రయిన తరువాత అంతదూరమూ నడిచి తిరిగి వస్తారన్నది. మొట్టమొదటి కార్మిక నాయకులలో ఒకడయిన చమన్‌లాల్ అన్నట్టు, బానిసత్వం చూడాలంటే ఏ అబిసీనియాకో లైబీరియాకో పోనక్కరలేదు, ఆనాటి భారతదేశం గర్భంలోనే వుంది.

పని పరిస్థితులు ఇట్లా వుంటే, వేతనాలగురించి రచయిత ఒక చక్కటిమాట చెప్పాడు. పరిశ్రమలలో కార్మికులకు ఇచ్చే వేతనాలకు ప్రమాణం పారిశ్రామిక రంగంలోని ఉత్పాదకతకాదు, రైతాంగానికిలభించే దినసరి ఆదాయం. అదే పాశ్చాత్య దేశాలలో నయితే, పారిశ్రామిక వేతనం పారిశ్రామిక ఉత్పాదకతను అనుసరించి వుండి, వ్యావసాయిక వేతనాలకు ప్రమాణాన్ని నెలకొల్పింది. రచయిత మాటల్లో "వేతనాల నిర్ణయంలోని ఈ తలక్రిందులు వ్యవహారం భారతదేశంవంటి వలసదేశాల కార్మికుల జీవనపరిస్థితులలోని వైపరీత్యాలలో ఒకటి."

ఎంతోకొంత ఆధునికమయిన పరిశ్రమలలోని కార్మికుల పరిస్థితి ఇట్లాగుంటే,

తేయాకు తోటలలోని శ్రామికుల పరిస్థితి, కాంట్రాక్టర్ల చేతికి చిక్కి దూరదేశాలకు తరలించబడ్డ శ్రామికుల పరిస్థితి, మరింత దుర్భరం. 18వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీకి చైనా నుండి ఎగుమతి అయ్యే తేయాకు మీద గుత్తాధిపత్యం ఉండేది. 1833లో ఆ గుత్తాధిపత్యం కోల్పోవడంతో భారతదేశంలో తేయాకు పండించి బ్రిటన్‌కు ఎగుమతి చేయడం మొదలు పెట్టారు. 1869 నాటికి తేయాకు పరిశ్రమ బలంగా నాటుకుంది. తేయాకు తోటలు ఎక్కువగా అస్సాంలో ఉండడం చేత, అస్సాంలో జనసాంద్రత తక్కువ కావడం, భూమిలేని నిరుపేదలు ఎక్కువగా లేక పోవడం చేత, తేయాకు తోటలకు శ్రామికులను దారిద్ర్యానికి నిలయమయిన బెంగాల్, బీహార్, ఒరిస్సా ప్రాంతాల నుండి కాంట్రాక్టర్లు తరలించుకు వెళ్ళేవారు. మొత్తం కుటుంబాలకు కుటుంబాలే మూడు సంవత్సరాల కాంట్రాక్టు మీద దూర ప్రాంతాల నుండి అస్సాం తోటలకు వెళ్ళేవారు. నెలజీతం మనిషికి 2 నుండి 5 రూపాయలవరకు ఉండేది. కాంట్రాక్టు పూర్తికాకుండా పారిపోవడం చట్టరీత్యా నేరం కావడం చేత, అట్లా పారిపోవడానికి ప్రయత్నించిన వాళ్ళను అక్కడికక్కడే శిక్షించే హక్కు యజమాన్లకు ఉండడం చేత, కార్మికులు దాదాపుగా బానిసలని చెప్పవచ్చు. తోటల యజమాన్లు (ఎక్కువగా బ్రిటిష్ వాళ్ళు) పెళ్ళికాని కూలీలకంటె పెళ్ళయిన వాళ్ళను నియమించడం లాభదాయకమని భావించడం చేత, కాంట్రాక్టర్లు తమ చేతికి చిక్కిన నిర్భాగ్యులను భార్యా భర్తలుగా జీవించమని బలవంత పెట్టేవారట.

బానిస జీవితాన్ని సహించలేక పారిపోకుండా చూడడం కోసం తోటల చుట్టూ కంచెలు, అన్ని మూలలా చౌకీదార్లు, పారిపోయిన కూలీనిపట్టి ఇచ్చిన వారికి 5 రూపాయలు పారితోషికం – అన్ని ఏర్పాట్లూ చేయబడ్డాయి. పారిపోయే యత్నం చేసి పట్టుబడ్డ వాళ్ళను చెట్టుకు కట్టి కొట్టేవారు.

చట్టం ఎప్పుడూ పాలక వర్గాల అవసరాల్ని సంరక్షించడానికే చేయబడుతుంది. అయితే వలసలలో ఈ స్వభావం మరింత స్పష్టంగా కనబడుతుంది. పాశ్చాత్య దేశాలలో మొట్టమొదటి పారిశ్రామిక చట్టాలు, కార్మికుల ఉద్యమాల ఫలితంగా పుట్టి, కార్మికులకు ఎంతోకొంత రక్షణ నిచ్చాయి. భారతదేశంలో మాత్రం తద్విరుద్ధంగా, మొదటి ఫ్యాక్టరీ చట్టం పరిశ్రమ యజమాన్లయిన బ్రిటిష్ పెట్టుబడిదార్లకు శాశ్వతమయిన శ్రామిక బలగాన్ని సమకూర్చడం కోసం చేయబడింది. (The Assam Plantation Labour Immigration Act, Madras Planters Labour Act) మొదలయినవి తేయాకు తోటల కూలీలకు సంరక్షణ ఈయక పోగా, వాళ్ళ

కాంట్రాక్టు పూర్తి కాకుండా పారిపోతే అది నేరమని శిక్షార్హమని,తీర్మానించాయి. 1860లో జారీ చేసిన Employers and Workers (Disputes) Act యజమానులకు కార్మికులను నిర్బంధించే హక్కు, జుర్మానాలు విధించే హక్కు, ఇచ్చింది.

II

తొలిపోరాటాలు

అమానుషమయిన ఈ దోపిడీకివ్యతిరేకంగా కార్మికులు తిరగబడక ముందే కొందరు సహృదయులయిన వ్యక్తులు తమ తమ పరిమితులలో నిరసన తెలిపారు. సోరాబ్జీ షాపుర్జీ బెంగాలీ అనే అతను చిన్న పిల్లలను పనిలోకి తీసుకునే అలవాటును చట్ట విరుద్ధంగా ప్రకటించమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తూ ఒక బిల్లును గూడ తయారుచేసి అందజేసాడు. కాని దానివల్ల ఫలం దక్కలేదు.

వ్యక్తుల కంటే ఎక్కువగా సోంప్రకాశ్, బొంబాయి గెజెట్, ఢాకాప్రకాశ్, అమృత బజార్ పత్రిక వంటి పత్రికలు కార్మికుల దుర్భరమయిన జీవిత పరిస్థితులను ప్రజల దృష్టికి తెచ్చాయి. ముఖ్యంగా అస్సాం తేయాకు తోటలలోని కూలీల పరిస్థితుల గురించి, మన దేశం నుండి మారిషియస్, బ్రిటిష్ గయానా, ట్రినిడాడ్, వంటి ఇతర బ్రిటిష్ వలసలలోని చెరకు తోటలలో పనిచేయడానికి దాదాపుగా బానిసలుగా కాంట్రాక్టర్ల చేత తోలుకు పోబడ్డ కూలీల దయనీయమయిన పరిస్థితి గురించి ఈ పత్రికలు ఆందోళన జరిపాయి.

అయితే ఈ సహృదయుల ఆందోళన సాధించలేని సంస్కరణలను బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు భారత దేశంలోని పెట్టుబడిదార్లకు (వీళ్ళలో భారతీయులూ ఉన్నారు, ఇంగ్లీష్ వాళ్ళూ ఉన్నారు) ఉన్న వైరుధ్యం సాధించింది. విపరీతమయిన దోపిడీ చేసే అవకాశం గల భారత దేశపు పెట్టుబడిదార్లతో పోటీ పడడం కష్టమయిపోయిన బ్రిటన్‌లోని పెట్టుబడిదార్లకు హఠాత్తుగా మానవత్వం జ్ఞాపకం వచ్చి, ఈ 'అమానుషమయిన పద్ధతులను' నిలపవలసిందిగా బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరగా, బ్రిటిష్ ప్రభుత్వం 1881లో మొదటి ఫ్యాక్టరీ చట్టాన్ని ప్రవేశపెట్టి, తద్వారా 7 సంవత్సరాలలోపు వయస్సుగల పిల్లలను పనిలోనికి తీసుకోగూడదని, 7 నుండి 12 సంవత్సరాల మధ్య వయస్సు గల వాళ్ళచేత రోజుకు 9 గంటల కంటె ఎక్కువ పని చేయించ గూడదని, ఇత్యాది నిర్బంధాలు పెట్టింది. అయితే ఈ చట్టం 100 మంది

కంటే ఎక్కువ కార్మికులుగల ఫ్యాక్టరీలకు మాత్రమే వర్తించడం చేత దాదాపుగా నిష్ఫలమయింది. 1908 సంవత్సరంలో నియమించబడ్డ ఫ్యాక్టరీ కార్మిక కమీషన్‌కు చిన్న పిల్లల నియామకం దేశ వ్యాప్తంగా కనిపించింది.

తేయాకు తోటల కూలీలకు ఈ మాత్రం గూడ దక్కలేదు. కలకత్తా నుండి ప్రచురితమయ్యే పత్రికల గొడవపడలేక ప్రభుత్వం చివరికి 1921లో ఒక కమిషన్‌ను తేయాకుతోటల కూలీల పరిస్థితులను విచారించడానికి నియమించింది. అయితే ఆ కమిషన్‌లోని 8 మంది సభ్యులలో ఇద్దరు ప్రభుత్వాధికారులు, 5 గురు తేయాకు తోటల యజమాన్లు ! ఆ కమిషన్ ఒక్క కూలీతో గూడ మాట్లాడకుండ తన పని ముగించిందంటే ఆశ్చర్యపడనక్కరలేదు.

చివరికి జంతువుల కంటే హీనమయిన ఈ జీవితాన్ని భరించలేక 1921లో 8 వేల మంది తేయాకు తోటల కూలీలు అస్సాం వదిలిపెట్టి ఉత్తర ప్రదేశ్ నుండి మదరాస్ వరకు సుమార ప్రాంతాలలో వున్న తమ ఇళ్ళకు బయలుదేరారు. అయితే, దోచుకోవడానికి శ్రామికులు లేకపోతే దోపిడీ జరగదని, పెట్టుబడి బలవదని, గుర్తించిన ప్రభుత్వం వాళ్ళను పోనియదల్చుకోలేదు. దగ్గరిలోని కరీంగంజ్ రైల్వేస్టేషన్ అధికార్లకు ఆ కూలీలకు టికెట్లు అమ్మకూడదని ఆదేశం ఇచ్చింది. కలకత్తా నగరం మేయర్ కల్పించుకుని వాళ్ళకు టిక్కెట్లు ఇప్పించగా, తరువాత స్టేషన్ దగ్గర అక్రమంగా వాళ్ళను నిర్బంధించారు. స్టేషన్ ప్లాట్‌ఫారం మీద నిద్రపోతున్న మూడువేల మందిని గూర్ఖాసైనికులు తుపాకులతో పొడిచి, కొందరినయితే చంపి నదిలోకి గూడ పారేసారు.

ఇది 1921 నాటి సంగతి. అంతకు చాలా కాలం ముందే, 19వ శతాబ్దపు రెండవ భాగంలోనే, అక్కడక్కడా చిల్లర సమ్మెలు చేయడం మొదలు పెట్టారు కార్మికులు. వాళ్ళకు యూనియన్లు లేవుగాని, పైన చెప్పిన సహృదయుల వంటి వాళ్ళు నెలకొల్పిన కార్మిక సంక్షేమ సంఘాలు వాళ్ళ తరపున వకాల్తా పుచ్చుకుని, ఆ సహృదయుల వర్గ స్వభావానికి అనుగుణంగా, చాలా సవినయంతో అర్జీలు పెట్టుకున్నాయి. ఈ రకంగా ఏర్పడ్డ "సంఘాల"లో చెప్పుకోదగినవి బ్రహ్మ సమాజం వారు నెలకొల్పిన Working Men's Mission, శశిపాద బెనర్జీ నెలకొల్పిన Baranagar Institute, బొంబాయిలో లోఖండే అధ్యక్షుడిగా స్థాపించిన Bombay Mill-hands Association. వీటిలో ఈ సంస్థకే కొద్దోగొప్పో కార్మిక

సంఘం స్వభావం ఉండేది. మిగిలినవి కేవలం కార్మికులకు విద్య నేర్పడం కోసమో, సంఘ సంస్కరణ కార్యక్రమాలు నడపడం కోసమో ఏర్పడ్డాయి.

భారతదేశ కార్మికుల మొట్ట మొదటి సమ్మెగా చెప్పదగ్గది 1862 ఏప్రిల్-మే నెలలలో జరిగింది. అప్పుడప్పుడే కొత్తగా ఏర్పడ్డ రైల్వేల కార్మికులు హౌరా స్టేషన్ దగ్గర 8 గంటల పని దినం కోసం సమ్మె చేసారు. ఈ సమ్మెలాగే ఆ తొలి రోజులలో వచ్చిన సమ్మెలన్నీ గూడ వేతనానికీ పని కాలానికీ సంబంధించినవి. 1880 తరవాత సమ్మెలు వేగం పుంజుకున్నాయి. 1882 నుండి 1890 మధ్య బొంబాయి, మద్రాసులలోని ఫాక్టరీలలో 25 చెప్పుకోదగ్గ సమ్మెలు జరిగాయి. అయితే బొంబాయి కలెక్టరు అన్నట్టు ఈ సమ్మెలేవీ గూడ రెండు మూడు రోజుల కంటే ఎక్కువ కాలం నడవలేదు. అంతే కాకుండా ఇవి సంఘటిత పోరాటాలు కావు. కేవలం ఒక్క మిల్లుకో లేక ఒక్క మిల్లులోని ఒక డిపార్టుమెంటుకో పరిమితమయినవి. అంటే, సమస్య ఎవరిదో వారు మాత్రమే సమ్మె చేసారు తప్ప కార్మిక చైతన్యంతో అందరూకలిసి పోరాటం చేయలేదు. వీటన్నింటిలోకీ చెప్పుకోదగ్గ సమ్మె బడ్జిబడ్జిలోని జనపనార మిల్లులో జరిగింది. ఆరు వారాల పాటు సాగిన ఈ సమ్మె వల్ల కంపెనీకి 80,000 రూపాయలు నష్టం వచ్చిందని కంపెనీ డైరెక్టరు వాపోయాడు. సమ్మెకు కారణం, సూపర్‌వైజర్ల దౌర్జన్యం. ఈ సూపర్‌వైజర్లు ఆధునిక ఫాక్టరీలలోలాగ కేవలం కంపెనీ ఉద్యోగులు మాత్రమే కాక, కూలీలను సేకరించి తెచ్చే కాంట్రాక్టర్లు గూడ కావడం చేత (వీళ్ళను సర్దార్‌లనీ, మిస్త్రీలనీ అంటారు), పని కాలం, వేతనాలతోబాటు, వీళ్ళ పీడన గూడ తొలినాటి సమ్మెలకు, పోరాటాలకు ఒక ముఖ్యమయిన కారణం.

ఈ శతాబ్ద ఆరంభంతో కార్మిక ఉద్యమంలో చెప్పుకోదగ్గ మార్పు వచ్చింది. ఒకపక్క కార్మికులలో వర్గ చైతన్యం కొంత పెరిగింది. సంఘటితంగా పోరాటాలు నడిపే అలవాటు పెరిగింది; వేరొకపక్క, 1905 నాటి బెంగాల్ విభజన నుండి పుట్టిన స్వదేశీ ఉద్యమం కాంగ్రెస్ పార్టీ నాయకత్వాన్ని సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మిత వాదుల చేతుల నుండి బాలగంగాధర తిలక్, లాలా లజ్‌పత్‌రాయ్ వంటి (అధికార చరిత్రకారుల దృష్టికి "అతివాదులు" గా కనబడే) నాయకుల చేతులలోనికి నెట్టడం వల్ల, జాతీయ ఉద్యమానికీ కార్మికోద్యమానికీ కొంత సంబంధం ఏర్పడింది. 1905లో కలకత్తాలోని ప్రభుత్వ ముద్రణాలయం కార్మికులు సెలవు రోజులలోపనిచేసి

సందుకుబత్తా ఇవ్వాలని డిమాండుచేసి ఒక నెల రోజులు సమ్మె చేసినప్పుడు, స్థానిక స్వదేశీఉద్యమనాయకులు బాహాటంగా సమర్థించారు.ఈసమ్మెఫలితంగా ఏర్పడ్డది,భారత దేశ కార్మిక సంఘాలలో మొట్టమొదట వాటిలో ఒకటయిన బెంగాల్ ప్రెస్ వర్కర్స్ యూనియన్. దాదాపుగా అదే సమయంలో ఏర్పడ్డ మరొక యూనియన్, తూర్పు ఇండియా రైల్వే కార్మికుల సంఘం(1906లో). అన్ని నిజమయిన కార్మిక సంఘాల లాగే ఈ సంఘం గూడ పోరాటం నుండే ఏర్పడింది. వేతనం పెంచాలని, పని పరి స్థితులు మెరుగు పరచాలని, తెల్లవాళ్ళు—నల్లవాళ్ళు అనే జాతి విభేదం తొలగించాలని హౌరా, అసన్‌సోల్, బర్ద్వాన్ స్టేషన్ల కార్మికులు చేసిన సమ్మె ఈ సంఘం ఏర్పా టుకు దారి తీసింది. ఆనాటి స్వదేశీ ఉద్యమ నాయకులయిన చిత్తరంజన్ దాస్, బిపన్ చంద్రపాల్ సమ్మెకారుల సభలలో ప్రసంగించారు. ఆతరువాత బట్టలమిల్లులలోను, జనప నార మిల్లులలోను బొగ్గు గనులలోను జరిగిన సమ్మెలను గూడ ఈ జాతీయ నాయ కులు బలపరిచారు, కొన్ని సందర్భాలలో క్రియాశీలకంగా వాటికి తోడ్పడ్డారు గూడ.

అయితే ఈ "జాతీయ నాయకులు" వాస్తవానికి అప్పుడప్పుడే బలపడుతున్న భారతీయ పెట్టుబడిదార్ల ప్రతినిధులేనన్న విషయం వాళ్ళ ఆచరణలో బయట పడింది. వాళ్ళు సమ్మెలను బలపరిచింది బ్రిటిష్ యాజమాన్యం గల సంస్థలలో మాత్రమే. భారతీయ బూర్జువా వర్గం యాజమాన్యంలోని సంస్థలలో కార్మికులు సమ్మె చేసి నప్పుడు మాత్రంవీళ్ళు సమర్థించడానికిగాని సహకరించడానికి గాని ముందుకు రాలేదు. అంతేకాకుండా ఈబూర్జువా వర్గానికి ఆనాటినుండి ఈనాటి వరకూ భూస్వామ్య వ్యవస్థతో ఉన్నసాంకర్య సంబంధాన్ని నిరూపిస్తూ బాలగంగాధర తిలక్, హిందూమతంలోని కుల వ్యవస్థ వృత్తి విభజన మీద ఆధారపడ్డది కాబట్టి అది కార్మిక సంఘాల ఏర్పాటుకు పనికొస్తుందని అన్నాడు.

బొంబాయిలోను మదరాసులోనుగూడ ఈ కాలంలో చాలా సమ్మెలు జరిగాయి. 1905లో మన దేశానికి కరెంటు రావడంతో, పరిశ్రమల యజమానులు పనికాలం పెంచి చీకటిపడ్డ తరువాత గూడ పని చేయించడం మొదలుపెట్టారు. దీనికి నిరసనగా చాలా సమ్మెలు జరిగాయి.

1908లో తిలక్‌ను 'దేశద్రోహ' నేరానికి విచారించినప్పుడు భారత కార్మిక వర్గపు మొదటి రాజకీయ సమ్మె జరిగింది. ఆ బూటకపువిచారణకు నిరసనగా 20,000 మంది నూలుమిల్లుల కార్మికులు సమ్మెచేసి బొంబాయి నగర పారిశ్రామిక ప్రాంతాలు

తిరిగి ఇతర కార్మికులచేత గూడ సమ్మె చేయించారు. తరువాతిరోజు ఓడ రేవు కార్మికులు, ఇతర చిన్నచిన్న సంస్థల కార్మికులు, వారితో చేరడంతో సమ్మెకారుల సంఖ్య 65,000కు పెరిగింది. జూలై 22న తిలక్‌పైన విచారణ ముగిసి శిక్షవేసారు. 22న బొంబాయి నగరం కార్మికులు, చిన్నచిన్న వ్యాపారస్తులు సంపూర్ణంగా సమ్మె నిర్వహించారు. ఆ తరువాతిరోజునుండి పోలీసు లాఠీలను తుపాకీలను ఎదుర్కొని పోరాడారు. మొత్తం బొంబాయి నగర ప్రజానీకంలో, కేవలం పారిశ్రామిక పెట్టుబడి దార్లు మాత్రమే ఈ మహత్తరమయిన సమ్మెతో సహకరించలేదు. తిలక్‌పై విధించిన ఆరు సంవత్సరాల శిక్షను నిరసిస్తూ ఆరురోజులపాటు సార్వత్రిక సమ్మె జరపాలని నిర్ణయించుకున్న బొంబాయి నగర కార్మికులు తమ నిర్ణయాన్ని నిలబెట్టుకున్నారు గాని ఆ క్రమంలో 200 మంది తమ ప్రాణాలు కోల్పోయారు. ఈ మహత్తరమయిన సామ్రాజ్యవాద వ్యతిరేకచర్యను బూర్జువా చరిత్రకారులు గుర్తించదల్చుకోలేదు గాని, లెనిన్ అనాడే గుర్తించి "ఇక బ్రిటిష్ రాజ్యానికి పతనం తప్పదు" అన్నారు.

III

సంఘటిత పోరాటాలు

1914 నాటికి భారత కార్మికవర్గం తన బాల్యాన్ని విడిచిపెట్టిందని చెప్పవచ్చు. అనాటికి దేశంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ వ్యవస్థగూడ బలపడింది. 1900 నాటికి ఉన్నవి 1360 కంపెనీలు, ఆ కంపెనీల పెట్టుబడి 36 కోట్లు కాగా, 1914 నాటికి కంపెనీల సంఖ్య 2553కు, వాటి పెట్టుబడి 72కోట్లకు పెరిగింది. 1914లో ప్రారంభమయిన మొదటి ప్రపంచయుద్ధం ఈ పరిణామాన్ని మరింత త్వరిత పరిచింది. యుద్ధ కాలంలో సహజంగా పెరిగే డిమాండును ఆధారం చేసుకుని, యుద్ధం చివరికి అంటే 1919 నాటికి దేశంలోని కంపెనీల సంఖ్య 2789కి, వాటి పెట్టుబడి 106 కోట్లకు, పెరిగాయి. దీనితోబాటు పారిశ్రామిక కార్మికుల సంఖ్యగూడ పెరిగింది. 1919నాటికి ఈ సంఖ్య 13.6 లక్షలు. అందులో 66 శాతం రైల్వేలలోను, వస్త్ర పరిశ్రమలోను జనపనార పరిశ్రమలలోను ఉన్నారు. వీళ్ళు కాకుండా బొగ్గుగనులలో మరొక 2లక్షల మంది ఉన్నారంటే, మొదటి ప్రపంచయుద్ధం చివరకు గూడ 1850లలో ఏ పరిశ్రమలయితే ముఖ్యంగా ఉండేవో అవే ముఖ్యంగా ఉంటూ వచ్చాయని తెలుస్తుంది. వలస పాలనలో సహజంగా జరిగే ఆర్థిక వక్రీకరణకిది ఒక సంకేతం.

ఒకపక్క కార్మికుల సంఖ్య పెరుగుతూండగా వేరొకపక్క బ్రిటిష్‌ప్రభుత్వం

యుద్ధ ప్రయోజనాల దృష్ట్యా పెట్టుబడిదార్లమీద ఏ నిర్బంధాలూ పెట్టకుండ అపరిమితంగా దోపిడీ చేసుకోనివ్వడంవల్ల, యుద్ధకాలపు ధరల పెరుగుదలవల్ల, కార్మిక ఉద్యమం ఒక కొత్తమలుపు తిరిగి మునుపెన్నడూ లేనంత సంఘటిత రూపాన్ని తీసుకుంది. పెట్టుబడిదార్ల లాభాలు విపరీతంగా పెరిగాయి. వస్త్ర పరిశ్రమలో 260 శాతం వరకు, జనపనార మిల్లులలో 200 శాతం లాభాలు చేసుకున్నారు. కార్మికుల వేతనాలను మాత్రం ధరల పెరుగుదల తినేస్తోందని బ్రిటిష్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ సహితం ఒప్పుకోక తప్పలేదు. ఉదాహరణకు మదరాస్‌లో ధరలు 1914 నుండి 1919కి 75 శాతం పెరగగా, వస్త్ర పరిశ్రమ కార్మికుల వేతనాలు 42 శాతం మాత్రం పెరిగాయి. కలకత్తాలో 1914నుండి 1920కి ధరల పెరుగుదల 100 శాతమయితే జనపనార కార్మికుల వేతనాలు పెరిగింది 40 శాతం మాత్రమే.

ఈ పరిస్థితులు అపూర్వమయిన సంఘటిత పోరాటాలకు దారితీసాయి. మదరాస్‌లో ఒక్క 1920లోనే 62 సమ్మెలు జరిగాయి. బెంగాల్‌లోనయితే ఆ సంవత్సరం చివరి ఆరునెలలలోనే 110 సమ్మెలు జరిగాయి. ఎప్పటిలాగే రైల్వేకార్మికులు వస్త్ర పరిశ్రమ కార్మికులతోను, జనపనార మిల్లుల కార్మికులతోను సమంగా పోరాటాలు చేసారు. రచయిత మాటలలో "సమ్మె పారిశ్రామిక జీవితంలో భాగమయిపోయింది." అన్నిటికంటె చెప్పుకోదగ్గ సమ్మె, బొంబాయిలో 2 లక్షల కార్మికులు 1929 జనవరి 2నుండి ఫిబ్రవరి 3 వరకు నెలరోజులపాటు నడిపిన సమ్మె.

ఈ పోరాటాలనుండి కార్మిక సంఘాలు పుట్టాయి. మదరాస్‌లో బి.పి.వాడియా నాయకత్వాన మదరాస్ కార్మిక సంఘం (Madras Labour Union) నెలకొల్పబడింది. గతంలో కార్మికుల పక్షం వహించిన ఉదార హృదయుల్లాగే వాడియాగూడ సంస్కరణవాది, పోరాటాలకంటె నివేదికలమీద ఎక్కువ నమ్మకం గలవాడు, యుద్ధ కాలంలో సమ్మెలు చేయగూడదని, అది 'మన' సైనికులకు ఇబ్బంది కలిగిస్తుందని, 'మన' రాజుకు ద్రోహమని నమ్మిన సామ్రాజ్యవాదపు నమ్మినబంటు.

అయితే ప్రభావరీత్యా వాడియాకంటె ముఖ్యమయిన వ్యక్తి గాంధీ. ఈయన 1918లో అహమ్మదాబాద్‌లో అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం(Ahmedabad Textile Labour Association) అనే సంస్థను స్థాపించాడు. గాంధీ దృక్పథంలో, పెట్టుబడిదారు, కార్మికుడు తల్లీ బిడ్డలవంటివారు. వాళ్ళమధ్య ఏ తేడాలువచ్చినా సంప్రదింపులను ఆశ్రయించాలేగాని సమ్మెలను కాదు. చివరికి ఈ తల్లీ-బిడ్డల' సంబంధం

ఎంతవరకు పోయిందంటే అహమ్మదాబాద్ వస్త్ర కార్మికసంఘం కార్యనిర్వాహక పదవులకు పోటీచేసే హక్కు కంపెనీ యజమాన్లకు ఇవ్వడమే కాకుండ, మునిసిపల్ ఎన్నికలలో ఒక కంపెనీ యజమానిని కార్మికుల అభ్యర్థిగా ఎన్నుకున్నారు గూడ! రచయిత మాటల్లో, "ఈ ప్రశస్తమయిన నమూనాను దేశవ్యాప్తంగా నెలకొల్పాలని గాంధీ ఆశించాడు!" అహమ్మదాబాద్ కార్మికులు చాలాకాలంపాటు ఈ తిరోగామి దృక్పథం ప్రభావంనుండి కోలుకోలేదు.

అయితే గాంధీకి ఇష్టమున్నా లేకపోయినా, కార్మికసంఘాలు దేశ వ్యాప్తంగా ఏర్పడి పోరాటాలు సాగించాయి.1920 నాటికి దేశంలో 120 యూనియన్లున్నాయని, వాటి సభ్యత్వ సంఖ్య 2.5 లక్షలనీ అంచనా. అదే సంవత్సరంలో అఖిల భారత కార్మిక సంఘాలసభ(ఎ.ఐ.టి.యు.సి.) ఏర్పడింది. దీని నాయకత్వం కేవలం బూర్జువా జాతీయ నాయకుల చేతిలోనేకాదు, సాక్షాత్తు పెట్టుబడిదార్ల చేతిలో ఉందనే చెప్ప వచ్చు. ప్రారంభ సమావేశంలో వేదికను నిజంగానే అలంకరించిన వారు రచయిత మాటలలో, "కొందరు కోటీశ్వరులు, కొందరు కాంగ్రెస్ నాయకులు, మరికొందరు కార్మిక ఉద్యమంతో ఏ సంబంధం లేనివారు", లాల్‌జీ నారాయణ్‌జీ, లల్లూభాయి సమాల్‌దాస్, లల్లూభాయి జవేరీ మొదలయిన ఫక్తు గుజరాతీసేఠ్ నామధేయాలుగల వాళ్ళంతా సమావేశానికి పెద్దలుగా హాజరయ్యారు. మియా మహమ్మద్ హాజీ జాన్ మహమ్మద్ ఛోటానీ అనే ఒక సింధీ బడా కలప వ్యాపారి ఎ.ఐ.టి.యు.సి. కి 500 రూపాయలు విరాళం ఇచ్చాడట గూడ.

ఇంతయినా గాంధీ మాత్రం హాజరు కావడానికి గాని, తన చేతిలో వున్న అహమ్మదాబాద్ వస్త్ర కార్మికుల సంఘాన్ని ఎ.ఐ.టియు.సి.లో విలీనం చేయడానికి గాని, సమ్మతించలేదు. చాలా ముందుచూపుగల గాంధీకి, కార్మికులు బూర్జువా నాయకత్వంలో సహితం సంఘటితం కావడం ఇష్టం లేదు. పైగా బూర్జువా ప్రభావం, సంస్కరణవాదం, ఎంతబలంగా వున్నా, సంస్థ నాయకులయిన లాజ్‌పతిరాయ్, బాప్టిస్టా చమన్‌లాల్‌లు ఎంత అస్పష్టంగా సయినా సరే కార్మికవర్గ దృక్పథాన్ని, పెట్టుబడిదారీ వ్యతిరేకతను, పోరాట పక్షపాతాన్ని, వెలిబుచ్చకపోలేదు. అది గాంధీ 'తల్లీ-బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకం కావడంతో అటువంటి సంస్థతో సంపర్కం పెట్టుకోవడం ఆ 'మహాత్ముడికి' ఇష్టం లేకపోయింది.

1921లో జరిగిన రెండవ ఎ.ఐ.టి.యు.సి. సమావేశంనాటికి సేఠ్‌జీల ప్రభా

వం కొంత తగ్గి గాంధీవాదుల ప్రాపకం సంస్థమీద పెరిగింది. ఆహ్వాన కమిటీకి ఒక బొగ్గుగని యజమాని అధ్యక్షత వహించిన మాట వాస్తవమేగాని, సభలో ఎక్కువగా కనపడ్డవి గాంధీ టోపీలు, ఖద్దరు లాల్చీలు. అప్పటికి కాంగ్రెస్ పార్టీ 'స్వరాజ్యం' తన ఆశయంగా ప్రకటించుకున్నది కాబట్టి, ఎ.ఐ.టి.యు.సి గూడ ఆ ఆశయాన్ని అంగీకరించింది. దాన్ని వివరిస్తూ తీర్మానాన్ని ప్రవేశపెట్టిన చమన్‌లాల్, "స్వరాజ్యం కార్లలో తిరిగేవాళ్ళకు, గవర్నర్ బంగళాల్లో విందులకు హాజరయ్యేవాళ్ళకు కాదు, తమ శ్రమతో ధనికుల సంపదను సృష్టించే లక్షలాది మనుష్యులకు" అన్నాడు. అయినా గాంధీ మాత్రం హాజరూ కాలేదు, సందేశమూ పంపలేదు.

1930 లలో పెట్టుబడిదారీ దేశాలలో సంభవించిన ఆర్థిక మాంద్యపు ఛాయలు వలసదేశాలమీద అంతకు ముందేపడ్డాయి. భారతదేశంలో ఆర్థికమాంద్యం 1922లోనే మొదలయింది. ఆ సంవత్సరం నుండి పారిశ్రామిక కార్మికులసంఖ్య చాలా నెమ్మదిగా పెరగడం గాని, లేదా క్షీణించడం గాని జరిగింది. 1922 నుండి 1927 వరకు దేశ జనాభాలో పెరుగుదల 2 కోట్లు కాగా, అతి ముఖ్య పారిశ్రామిక రంగాలయిన వస్త్ర పరిశ్రమ, జనపనార పరిశ్రమ, బొగ్గుగనులలో మొత్తం కార్మికుల సంఖ్యలో పెరుగుదల 7 వేలు మాత్రమే. దీనివల్ల అధికమయిన నిరుద్యోగం ఒక పక్కనుండగా, సంక్షోభకాలంలో మార్కెట్‌కోసం బ్రిటిష్ పెట్టుబడిదార్లు, భారతీయ పెట్టుబడిదార్లు, అప్పుడప్పుడే ఎదుగుతున్న జపాని పెట్టుబడిదార్లు, పరస్పరం ఓడించుకోలేక కార్మికుల మీద పడ్డారు. ముఖ్యంగా ప్రభుత్వ మద్దతుగల బ్రిటిష్ పెట్టుబడిదార్లతో పోటీపడలేని భారతీయులు కార్మికులపై దోపిడీని అత్యంతంగా పెంచారు.

ఇవన్నీ కలిసి మళ్ళీ తీవ్రమయిన పోరాటానికి దారి తీసాయి. 1921–30ల మధ్యకాలంలో సంవత్సరానికి సగటున 185 సమ్మెలు జరిగాయి. సంవత్సరానికి సగటున 3,4 లక్షలమంది కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. జంషెడ్‌పూర్ కార్మికులు కక్ష సాధింపు చర్యలకు వ్యతిరేకంగా సమ్మెచేస్తే, సూరత్ కార్మికులు బోనస్ కోసం సమ్మెచేసారు. చివరికి అహమ్మదాబాద్ కార్మికులు గూడ గాంధీ సిద్ధాంతాలను పక్కకు పెట్టి 53మిల్లులకు చెందిన 43,000మంది రెండునెలలపాటు సమ్మెచేసారు. కారణం : వాళ్ళ జీతాలలో 20 శాతం కోతపెట్టాలనే యజమానుల నిర్ణయం. బొంబాయిలో యజమానులు బోనస్ నిలిపివేయగా, 1.6 లక్షలమంది రెండునెలలపాటు సమ్మెచేసారు. ఈ సమ్మెలకు విదేశాల కార్మికసంఘాలనుండి, ముఖ్యంగా రష్యానుండి, ఆర్థిక సహాయం లభించింది. అన్ని సమ్మెలలోను, కార్మికులు తమ

యూనియన్లద్వారా సమ్మె నడపడం, కాంగ్రెస్ నాయకులు, ఎ.ఐ.టి.యు.సి. నాయకులు, మొదటినుండి సంప్రదింపులకోసం ప్రయత్నించడం కనబడుతుంది.

1926-29 కాలంలో సమ్మెలు, పోరాటాలు, మరీ తీవ్రరూపం దాల్చాయి. సామ్రాజ్యవాదం తన దేశంలోని కార్మికులపట్ల మర్యాదగానే వుంటూ వలసలలోని కార్మికులను మాత్రం విపరీతంగా దోచుకుంటుందనడానికి నిదర్శనంగా ప్రభుత్వం భారత కార్మికసంఘాలచట్టం, 1926ను ప్రవేశపెట్టింది. బ్రిటన్‌లో కార్మికులమీదలేని ఎన్నో ఆంక్షలు ఈ చట్టం ద్వారా భారతదేశ కార్మికులమీద పెట్టబడ్డాయి. కార్మిక సంఘాల చర్యలపై రకరకాల నిబంధనలు, అవి తమ నిధులను రాజకీయ ప్రయోజనాలకు వాడకూడదనే ఆంక్ష., విధించబడ్డాయి. దీని ఉద్దేశ్యం, కార్మికులను జాతీయోద్యమం నుండి దూరంగా ఉంచడమే. ఈ చట్టంతోబాటు, ఒక రైల్వేకమిటీ, 75000 మంది కార్మికులను పనినుండి తొలగించమని సలహా ఈయడంతో దేశవ్యాప్తంగా అన్ని పరిశ్రమలలోను పోరాటాలు కట్టలు తెంచుకుని వచ్చాయి. ఒక్క 1928 సంవత్సరంలోనే, 35 లక్షల పనిదినాలు నష్టమయ్యాయని అంచనా. ఈ సమ్మెలలో చెప్పుకోదగ్గవి ఖరగ్‌పూర్‌లో రైల్వే కార్మికుల సమ్మె, దాని ననుసరించి దేశవ్యాప్తంగా రైల్వేలలో వచ్చిన సమ్మెలు. ఎప్పటిలాగే ఖరగ్‌పూర్ సమ్మెగూడ నాయకుల అభీష్టానికి వ్యతిరేకంగానే సాగింది. కార్మికుల తెగింపును సహించలేని ఖరగ్‌పూర్ కార్మికసంఘం అధ్యక్షుడు వి. వి. గిరి బహిరంగసభలోనే వాళ్ళ పోరాట పద్ధతులను ఎదిరించాడు. అయినా కార్మికులు పోరాటం ఆపకపోయేసరికి తన నాయకత్వాన్ని సంరక్షించుకోవడం కోసం దిగిరాక తప్పలేదు.

ఈ కాలంలోనే 1928లోను, 1929లోను బొంబాయిలోని వస్త్రపరిశ్రమ కార్మికులు రెండుసార్లు సార్వత్రిక సమ్మెలు నిర్వహించారు. కార్మికుల తొలగింపుకు (retrenchment) వ్యతిరేకంగా జరిగిన మొదటి సమ్మె ఫలితంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో గిర్నీకాంగార్ యూనియన్ అనే పోరాటశీలంగల వస్త్రపరిశ్రమ కార్మికుల సంఘం పుట్టింది. ఆరునెలలపాటు నడిచిన ఈ సమ్మెలో కార్మికులు 250 లక్షల రూపాయల వేతనాన్ని కోల్పోయారు. 1929లో జరిగిన రెండవ సార్వత్రిక సమ్మె, యజమానుల కక్ష సాధింపుచర్యలకు వ్యతిరేకంగా జరిగింది. 32 మిల్లులకు చెందిన లక్షమంది కార్మికులు నెలరోజులపాటు నడిపిన ఈ సమ్మెలో 80 లక్షల పని దినాల నష్టం జరిగింది. సమ్మె నాయకులు రణదివె, దేశ్పాండెలను అరెస్టు చేసినప్పుడు

కార్మికులు నిరసన ప్రదర్శన జరపగా వాళ్ళమీద కాల్పులు గూడ జరిగాయి. బెంగాలులో జనపనార కార్మికులుగూడ పనికాలం పొడిగింపుకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మె నిర్వహించారు.

17

చీలిక, పునస్సంఘటన

గాంధీకి మొదటినుండి గూడా ఎ.ఐ.టి.యు.సి వంటి కేంద్రకార్మిక సంస్థలంటే ఇష్టంలేదు. అయినా తాను అన్ని విషయాలలోను అవలంబించిన ఎత్తుగడే ఈ విషయంలోను అవలంబించాడు. తాను ఎ.ఐ.టి.యు.సి నుండి దూరంగావుంటూ తన అనుచరులను మాత్రం సంస్థలో పాల్గొననిచ్చాడు, నాయకత్వం గూడా నిర్వహించనిచ్చాడు. ఆనాటి బూర్జువా రాజకీయనాయకులు 'సోషలిస్టు' ముసుగు తగిలించుకోవడం ఇంకా అలవర్చుకోలేదు. కాబట్టి, దీని ఫలితంగా సంస్థకు కేవలం బూర్జువా దృక్పథమే కాదు, ఫక్తు బూర్జువా మార్గదర్శకత్వం కూడ లభించింది. ఉదాహరణకు, ఢిల్లీలో 1927 లో జరిగిన ఏడవ ఎ.ఐ.టి.యు.సి సభకు హాజరయిన పెద్దలలో సాక్షాత్తు జి.డి. బిర్లా ఒకడు.

అయితే ఎ.ఐ.టి.యు.సి.లో కమ్యూనిస్టులు,సోషలిస్టులు,చాలామంది ఉండబట్టి ఈ పరిస్థితి సంక్షోభానికి దారి తీసింది. సంస్థకు వర్గపోరాట దృక్పథముండాలా సంస్కరణవాద దృక్పథముండాలా అన్నది అసలు వివాదమయితే, చీలికకు దారితీసిన సమీప వివాదం అంతర్జాతీయ విలీనానికి (affliation) సంబంధించింది. కాంగ్రెస్‌లోని బూర్జువా నాయకులు సంస్థను ప్రపంచ సంస్కరణవాద కార్మిక సంఘాల కేంద్రమయిన అంతర్జాతీయ కార్మిక సంఘాల సమాఖ్య (International Federation of Trade Unions) తో సంబంధాలు పెట్టుకోవాలనిచూస్తే, కమ్యూనిస్టులు, కాంగ్రెస్‌లోని సోషలిస్టు భావాలు గలవాళ్ళు, మాస్కోకు చెందిన Red International Labour Union (లేక Protintern) తో విలీనం కావాలని కోరారు. దేశ స్వాతంత్ర్యానికి సంబంధించిగూడ, బూర్జువా నాయకులు 1929దాకా సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని తమ లక్ష్యంగా ప్రకటించకపోగా, వామపక్షశక్తులు మాత్రం స్పష్టమయిన సామ్రాజ్యవాద వ్యతిరేక దృక్పథాన్ని ప్రదర్శించాయి. వీళ్ల ప్రభావం కార్మికులమీద, ఎ.ఐ.టి.యు.సి లో పెరిగిపోతుండటం చూసి శివరావు వంటి సంస్కరణవాద కార్మిక నాయకులు "సమ్మె మంత్రం పఠించే వ్యక్తులను సంస్థనుండి ఏరేయాల్సిన అవసర ముంద"ని బాహాటంగా అన్నాడు. బ్రిటిష్ పాలకులు గూడా భయపడి సమ్మెను

దాదాపుగా చట్ట విరుద్ధం చేసి, వివాద పరిష్కారానికి నిర్బంధ చర్చలను ప్రవేశ పెట్టి, రాజకీయ లక్ష్యాలతోగాని, కార్మిక ప్రయోజనాలకోసం గాని సార్వత్రిక సమ్మెలు చేయడాన్ని నిషేధించే Trade Disputes Act, 1928ని ప్రవేశ పెట్టారు. అక్కడితో ఆగకుండ కొంత మంది ఎ.ఐ.టి.యు.సిలోని కమ్యూనిస్టులను, ఆనాటి వామపక్ష శక్తుల సంఘటన అయిన కార్మిక కర్షక పార్టీ (Workers and Peasants Party) నాయకులను మీరట్ కుట్రకేసులో ఇరికించారు.

ఈ నేపథ్యంలో 1929 లో జరిగిన నాగపూర్ సభలో ఎ.ఐ.టి.యు.సి లోని మొదటి చీలిక జరిగింది. వి. వి. గిరి, శివరావు, ఎన్. ఎం. జోషి, చమన్‌లాల్, మొదలయినవాళ్లుఎ.ఐ.టి.యు.సినుండి విడిపోయి Indian Trade Union Federation ఏర్పరచారు. తెగేదాక లాగే ధైర్యం వామపక్ష శక్తులకు ఇచ్చింది, బొంబాయి వస్త్రపరిశ్రమ కార్మికుల గిర్నీకాంగార్ యూనియన్. ఈ సంఘం 1928-29 నాటి సమ్మెలవల్ల బలపడి కమ్యూనిస్టులకు బొంబాయి నగర కార్మికులలో చాలా పరపతిని సంపాదించి పెట్టింది.

ఆసక్తికరమైన విషయ మేమంటే ఈ చీలిక సమయంలో జవహర్‌లాల్ నెహ్రూ వామపక్షంలో ఉండడమేకాక, వి. వి. గిరి వంటి వ్యక్తుల ఆరోపణకు తానే వామపక్షం తరఫున వకాల్తా పుచ్చుకొని సమాధానంగూడా చెప్పాడు. ఆయన మాటల్లో "మేము వర్గపోరాటం నేర్పుతున్నామని, వర్గాలమధ్య అంతరాన్ని పెంచుతున్నామని మాపై ఆరోపణ. కాని అంతరాన్ని సృష్టించింది పెట్టుబడిదారీ విధానం, మేముకాదు. మామీద ఆరోపణలు వేయడం గుడ్డితనం, మూర్ఖత్వం. వర్గ విభేదాలను, అసంతృప్తిని సృష్టించేది కమ్యునిస్టులా లేక తమ పద్ధతులద్వారా అత్యధిక భాగం మానవాళిని వేతన బానిసలుగా మార్చుతున్న పెట్టుబడి దారులు, సామ్రాజ్యవాదులూనా? వర్గ పోరాటాన్ని సృష్టించింది మేముకాదు, పెట్టుబడిదారీ విధానం. పెట్టుబడిదారీ విధానం ఉన్నంతకాలం అది ఉంటుంది. సుఖంగా ఉన్నవాళ్ళకు శాంతి వాక్యాలు పలకడం సులభమే గాని అటువంటి సదాశయాలు మామీదున్న పీడనను తొలగించవు. మమ్మల్ని దోచుకుని పైకి ఎగబాకి ఇప్పుడు అక్కడి నుండి మీరు ఉపన్యాసాలు దంచుతున్నారు. వర్గ పోరాటం గతంలో ఉంది. ఇవ్వాళా ఉంది. మూలకారణాల్ని తొలగిస్తేనే శాంతి లభిస్తుంది." (స్వేచ్ఛానువాదం) ఈ మాటలలో చాలా గందరగోళం ఉంది గాని వాటిలోని వేడి మాత్రం గమనార్హం. తర్వాతి కాలంలో నెహ్రూ ఎంత చల్లబడ్డాడో

ఆలోచిస్తే ఆశ్చర్యం కలగకమానదు తొలినాటి వేడి తెచ్చి పెట్టుకున్నదేమోనన్న అనుమానం రాక మానదు.

ఈచీలిక జరిగింది ఎ.ఐ.టి.యు.సి పదవ సమావేశంలో.11వ సమావేశం 1931 లో కలకత్తాలో జరిగింది. అప్పుడు రెండవసారి చీలిక జరిగి నెహ్రూ, సుభాష్, వంటి కాంగ్రెస్ వాదులు వెళ్ళిపోగా, కమ్యూనిస్టులు మాత్రం All India Red Trade Union Congress (AIRTUC)ని ఏర్పరిచారు. దీని నాయకులు ఎస్. వి. దేశ్పాండే, ఎస్. జి. సర్దేశాయి, తదితరులు.

అయితే సరిగ్గా ఇదే సమయంలో, అంటే 1929 తరువాత పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభం వచ్చి, కార్మికులను తీవ్రమయిన దోపిడీకి గురిచేసింది. అటువంటి సమయంలో కార్మిక సంఘాలు అనైక్యంగా ఉండడం సమస్యను మరింత తీవ్రతరం చేసింది.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభంవల్ల భారతదేశంలో ఫ్యాక్టరీల మూసివేత, కార్మికుల తొలగింపు, జీతాలలో కోతలు మొదలయినాయి. సంక్షోభంలో బ్రిటిష్ పాలకులు సహజంగానే తమ బ్రిటిష్ పెట్టుబడిదార్ల అవసరాలను సంరక్షించడం మొదలుపెట్టారు. Imperial Preference పేరిట ఇనుము, ఉక్కు, వస్త్ర పరిశ్రమలలో బ్రిటిష్ పెట్టుబడిదార్లకు పక్షపాతం చూపించడం మొదలుపెట్టారు. దీనితో భారతీయ పెట్టుబడిదార్లు గత్యంతరం లేక కార్మికులపై దోపిడీని, పనినుండి తొలగింపును ఎక్కువచేసారు. 1934 సంవత్సరంలో బొంబాయిలోని బట్టలమిల్లులలో 50 శాతం మూతపడి 61,000 మంది కార్మికులు నిరుద్యోగులయ్యారు. 1921 నుండి మొదలుపెట్టిన వేతనాలకోత ఫలితంగా మరొక 42 మిల్లులలో వేతనాలు 1926 తో పోలిస్తే 1934 లో 20 శాతం తక్కువ ఉన్నాయి. బొంబాయి మిల్లు యజమాన్లను ఆదర్శంగా తీసుకుని అహమ్మదాబాద్‌లో 20 శాతం, షోలాపోర్‌లో 12½ శాతం, మదరాస్‌లో 15 శాతం, నాగపూర్‌లో 20 శాతం, అకోలాలో 25 శాతం తగ్గించారు.

బెంగాలులోని జనపనార మిల్లులలోనూ ఇదే పరిస్థితి. 1929–34 ల మధ్య 83,000 మంది నిరుద్యోగులయ్యారు. ఆ తరువాత రెండు షిఫ్టుల స్థానాన ఒకే షిఫ్టు ప్రవేశపెట్టి మరొక 25 శాతం కార్మికులను పనినుండి తొలగించారు. జీతాలు గూడ కోసారు. స్పిన్నర్‌ల నెలసరివేతనం రు. 7 నుండి 6కు, వీవర్ల వేతనం రు. 12 నుండి

9కి పడిపోయాయి. రైల్వేలలోనయితే 1931 నుండి 1932 లోపల (ఒక్క సంవత్సరంలో) 50,000 మందిని పనినుండి తొలగించారు. అలాగే ఇనుము—ఉక్కు కర్మాగారాలలోను, మునిసిపాలిటీలోను, తపాలా శాఖలోను, ఓడ రేవుల లోను, జీతాలు కోత పెట్టడం, పనినుండి తొలగించడం నిత్యకృత్యాలయినాయి.

ఈ పరిస్థితిలో కార్మికులు తమ మనుగడ కోసం పోరాటాలు చేయక తప్ప లేదు. అప్పటికి కేంద్ర కార్మిక సంస్థలు ఒకటి కాక మూడయినప్పటికీ, సమ్మె పోరాటాలు మాత్రం ఉధృతంగా సాగాయి. 1931 నుండి 1936 వరకు సంవత్స రానికి సగటున 150 సమ్మెలు జరిగాయి. 1931, 32, 33 సంవత్సరాలలో 20 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. 1934 లో నయితే 47 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. పరిస్థితి ఎంత తీవ్రమయిందంటే గాంధీకి ప్రీతిపాత్రమయిన అహమ్మదాబాద్ వస్త్ర కార్మిక సంఘం గూడ ఆయనగారి 'తల్లీ-బిడ్డల' సిద్ధాంతానికి వ్యతిరేకంగా 25 శాతం వేతనం తగ్గింపుకు వ్యతిరేకంగా సమ్మె చేయడానికి సిద్ధ పడ్డారు, గాంధీ భయపడి తన మిత్రులయిన గుజరాతీ పెట్టుబడిదార్లను సంరక్షించ డంకోసం చర్చలకు దిగి, 6 శాతం మాత్రం జీతం తగ్గించేటట్టు, కొంతమంది కార్మికులను పనినుండి తొలగించేటట్టు ఒప్పందం చేసుకున్నాడు. అన్యాయమయిన ఈ ఒప్పందాన్ని కార్మికులు సంతోషంగా స్వీకరిస్తారని తన ఆశ అనీ, కార్మికుల అవసరాలు పెట్టుబడిదార్ల అవసరాలు ముడిపడి ఉన్నట్లు వాళ్ళు గుర్తించాలనీ ఉచిత విద్యాబోధన గూడ చేసాడు.

అయితే కార్మిక సంఘాల అనైక్యత కార్మికుల పోరాటాన్ని దెబ్బతీసింది. ఈ విషయం బొంబాయి కార్మికుల సమ్మెలో స్పష్టంగా బయటపడింది. గిర్నీ కాంగార్ యూనియన్ రెండుగా చీలి, ఒక పక్క కమ్యూనిస్టులు సమ్మె కోసం ఏర్పాట్లు, ప్రచారం చేస్తుండగా, వేరొక పక్క సంస్కరణవాద నాయకులు చర్చల తోను సంప్రదింపులతోను పోరాటాన్ని ఆపాలని ప్రయత్నం చేయడంతో కార్మికులు తీవ్రంగా దెబ్బతిన్నారు.

ఈ పరిస్థితిలో కార్మిక నాయకులంతా ఐక్యతకోసం కృషిచేసారు. 1935 నాటికి AIRTUC మళ్ళీ AITUC లో చేరింది. అయితే వి. వి. గిరి, శివరావుల నాయకత్వంలోని ITUF మాత్రం AITUC లో కలవక, రాయిస్టులతోను ఇత రులతోను కలిసి NTUF (National Trade Union Federation) అనే

మరొక సంస్థ ఏర్పడింది. 1936 లో AITUC, NTUF ల కార్యక్రమాలను సమన్వయ పరచడానికి ఒక Joint Labour Board ఏర్పడింది. అప్పటికి NTUF తో ఉన్న సంఘాల సంఖ్య 60, సభ్యత్వం 1,47,516. AITUC తో ఉన్నది 71 సంఘాలు, సభ్యత్వం 93,750.

V

అధికార మార్పిడి

1947 లో భారతదేశానికి వచ్చింది అధికార మార్పిడియేననుకుంటే అది 1935 లోనే ప్రారంభమయింది. ఆ నాటికి క్రమంగా తమ చేతుల్లోకి అధికారం రావడం మొదలయిందని గుర్తించిన బూర్జువా వర్గానికి ఇక కార్మికవర్గంతో అవసరం తీరిపోయింది. అవసరం తీరిపోవడమేకాదు, అంతవరకు అధికారం చేజిక్కడానికి ఒక సాధనంగా వున్న కార్మిక వర్గం ఇప్పుడు ప్రధానశత్రువయింది. అందుకే NTUFలోని 'కార్మిక నాయకులు' గాని, పునస్సంఘటితమయిన AITUC లోని నెహ్రూవంటి నాయకులు గాని కార్మికోద్యమ ఐక్యతపట్ల అంత ఆసక్తిచూపలేదు. కార్మిక ఉద్యమాలపట్ల నయితే ఏమాత్రం చూపలేదు.

1935 నాటి భారత ప్రభుత్వ చట్టాన్ని అనుసరించి వివిధ రాష్ట్రాలలో ఎన్నికలు జరిగాయి. ఆచట్టాన్ని ఫైజ్‌పూర్ సమావేశం (1936) లో 'నిర్ద్వంద్వం' గా నిరాకరించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో మాత్రం పాల్గొంది. ఫైజ్‌పూర్ సమావేశానికి అధ్యక్షత వహించిన నెహ్రూ, ఎన్నికలలో పాల్గొనడం సామ్రాజ్యవాదంతో సహకరించడానికి కాదు, ఆ 1935 చట్టాన్ని వ్యతిరేకించడానికేనన్నాడు. కాబట్టి గెలిచినా గూడా మంత్రి వర్గాలు ఏర్పరచడం, పరిపాలన కొనసాగించడం కూడ దన్నాడు. అయితే ఎన్నికలలో గెలిచిన తరువాత మాత్రం కాంగ్రెస్ పార్టీ నెహ్రూ అభీష్టానికి వ్యతిరేకంగా పరిపాలనకు ఒడిగట్టింది. అదేసమయంలో, రాబోయేరెండవ ప్రపంచ యుద్ధానికి సన్నద్ధమయ్యే క్రమంలో ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మళ్ళీ బలం పుంజుకుంది. దానితో కార్మికులు గూడా, 1930 ల మొదటి భాగంలో కోల్పోయిన దానిని తిరిగి పొందటానికి ప్రపంచవ్యాప్తంగా సమ్మెలు ప్రారంభించారు. అందులో భాగంగా భారత కార్మిక వర్గం గూడ పోరాటాలు చేపట్టింది. 1937 లో 379 సమ్మెలు జరిగాయి, 89 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1938 లో 399

సమ్మెలు జరిగాయి, 90 లక్షల పనిదినాలు నష్టమయ్యాయి. 1939 లో 406 సమ్మెలు జరిగాయి, 50 లక్షల పనిదినాలు నష్టం అయ్యాయి. వాటన్నింటిలోకి చెప్పుకోదగ్గది బెంగాల్ జనపనార మిల్లు కార్మికుల సార్వత్రిక సమ్మె. 1937 ఫిబ్రవరి నుండి మే వరకు జరిగిన ఈ 74 రోజుల సమ్మెలో 2.25 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. అయితే ఎప్పటిలాగ వస్త్రపరిశ్రమకు, జనపనార పరిశ్రమకు, రైల్వేలకు పరిమితమై పోకుండా ఈ సారి సమ్మెలు అగ్గిపెట్టెలు, బీడీలు,తదితర చిన్న పరిశ్రమలకు, రిక్షా జట్కా కార్మికులకుగూడ వ్యాపించాయి.

అప్పుడప్పుడే కొన్ని రాష్ట్రాలలో అధికారానికి వచ్చిన కాంగ్రెస్ ముస్లింలీగ్ పార్టీలు, తమకు ఇక కార్మికులతో అవసరం లేదని చూపిస్తూ ఈ సమ్మెలను,పోరాటాలను బ్రిటిష్ వాళ్ళతో సమంగా అణచి వేశాయి. కాన్పూర్‌లో 46,000 మంది కార్మికులు సమ్మెకు ఉద్యుక్తంకాగా, ఒక కాంగ్రెస్ కార్మిక నాయకుడు హరిహరనాథశాస్త్రి వాళ్లకు సమ్మె చేయవద్దని సలహా ఇస్తే, వేరొక పక్క ముఖ్యమంత్రి గోవింద వల్లభ పంత్ సెక్షన్ 144 ప్రకటించి మీటింగులను సమ్మెలను నిషేధించాడు.

అంతే కాదు. బ్రిటిష్ వారి అడుగుజాడల్లో నడుస్తూ బొంబాయి రాష్ట్రపు కాంగ్రెస్ ప్రభుత్వం 1939లో ఒక పారిశ్రామిక తగాదాల చట్టాన్ని (Bombay Industrial Disputes Act, 1939) రూపొందించింది. ఈ చట్టం దాదాపుగా సమ్మెలను అసాధ్యంచేసి చర్చలనే ఏకైక చట్టబద్ధమయిన పరిష్కార మార్గం చేసింది. అహమ్మదాబాద్‌లో గాంధీ ఏ పద్ధతులనైతే 1919లో ప్రవేశ పెట్టాడో ఆ తిరోగామి పద్ధతులను ఈ బిల్లు చట్టబద్ధం చేసింది. దీనికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపినపుడు పోలీసు కాల్పులలో ఇద్దరు చని పోయారు.

ఒక పక్క ఇదిజరుగుతుండగా వేరొకపక్క 1940లో ఎన్. టి. యు. ఎఫ్ మళ్లీ ఎ.ఐ.టి.యు.సి. లో కలిసి కార్మికసంఘాల ఐక్యత పునరుద్ధరించబడింది. ఈ ఐక్యత తాత్కాలికమే అయినా, రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సమ్మెలనిషేధం వల్లా, 'అత్యవసర' రంగాలలో పని గంటల పొడిగింపు వల్లా, ధరల పెరుగుదలవల్లా, కార్మికులకు కలిగిన కష్టాలకు వ్యతిరేకంగా పోరాడటానికి పనికి వచ్చింది. ఈ క్రమంలో ఎ.ఐ.టి.యు.సి ఒక సంస్థగా గూడా పెరిగి యుద్ధం చివరికి సభ్యత్వసంఖ్య 7లక్షలకు చేరుకుంది.

అయితే 1947 దగ్గర పడేకొద్దీ కాంగ్రెస్ పార్టీకి కార్మికుల పట్ల అసహనం

పెరిగింది. 1946 లో బొంబాయి నగరంలోని నౌకా సిబ్బంది తమకు చాలాకాలంగా వున్న కోర్కెల పరిష్కారం కోసం ఉద్యమించినప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం తీవ్రమయిన చర్యలు తీసుకుంటానని బెదిరిస్తే, నౌకా సిబ్బంది నగరప్రజానీకానికి తమతో సహకరించి బంద్ నిర్వహించమని పిలుపిచ్చారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వల్లభభాయి పటేల్ సహకరించలేదు. పార్టీ అధ్యక్షుడు అజాద్ "ఇది సమ్మెలకు బంద్‌లకు సమయంకాదు" అన్నాడు. అంటే అర్థం, బూర్జువావర్గం అధికారంలోకి రాబోతున్న తరుణంలో కార్మికులు సమ్మెలుచేస్తే సహించమని. అయినా నగర ప్రజలు, ముఖ్యంగా శ్రామిక జనం, బంద్ నిర్వహించి, పోలీసుల కాల్పుల నెదుర్కొని 250 మంది ప్రాణాలర్పించారు.

ఈ ద్రోహానికి పరాకాష్టగా, 1947 మే నెలలో కాంగ్రెస్ పార్టీ పెద్దలంతా కలిసి ఎ.ఐ.టి.యు.సి నుండి కాంగ్రెస్ వాదులంతా బయటకు వచ్చేయాలని, మరొక సంస్థను ఏర్పరచాలని నిర్ణయించుకున్నారు. ఇట్లా ఏర్పడింది Indian National Trade Union Congress(INTUC). ఈ సారి నెహ్రూ వర్గాలగురించి వర్గ పోరాటపు అనివార్యత గురించి ఉపన్యాసాలు ఇవ్వలేదు. ఐ. ఎన్. టి. యు. సి. ని ఏర్పరచిన సమావేశంలో తాను స్వయంగా పాల్గొన్నాడు. నెహ్రూలాగా అభ్యుదయపు పోజులు కొట్టడం తెలీని ఫక్తు రియాక్షనరీ వల్లభభాయి పటేల్, "ఈ పని ఎన్నడో చేసి ఉండాల్సింది" అన్నాడు. దీనితో భారత బూర్జువా వర్గం తనకు అధికారం చేతికి వచ్చిందని, ఇక కార్మిక వర్గంతో శత్రుత్వమే తప్ప స్వల్పకాలిక మిత్రత్వంగూడా లేదని ప్రపంచానికి చాటి చెప్పింది.

వీరేంద్రనాథ్‌లు ఎక్కడున్నుంచి పుడతారు?

హెచ్చార్కె

ఒక విష వృక్షం గురించే మాట్లాడుకుందాం. చుట్టూరా దుర్గంధం వెద జల్లుతూ, రోగాల్ని, మరణాన్నీ పంచిపెడుతూ వుంటుందది. బ్రతుకును ప్రేమించే వాళ్ళందరూ దాన్ని గురించి ఆలోచించడం కేవలం సహజం. దాని ఆకులు నిజం ఆకులు కాదనీ, దాని కొమ్మలు నిజం కొమ్మలు కాదనీ, దాని పండ్లు తింటే ఛస్తారనీ వాస్తవాన్ని ప్రజలకు చాటిచెప్తుతారువాళ్ళు.కొన్నిఆకులు తెంపేస్తారు. కొన్నికొమ్మలు నరికేస్తారు. తల కొమ్మ కొట్టిన పొగాకు చెట్టు లాగా విస్తరిస్తూనో, ఏపుగానో పెరుగుతూనే వుంటుందది.

అది విషవృక్షమని కనిపెట్టడం, దాని ఆకులు, కొమ్మల గురించి చర్చించడం, ఖండించడం జరగాల్సిన పనే. అది అవసరమే. కాని అది చాలదు. దాన్ని నిర్మూలించే కార్యక్రమం గురించిన అవగాహన సమగ్రం కావాలి. దాన్ని వ్రేళ్ళ గురించి చెప్పాలి ముఖ్యంగా. దాన్ని వ్రేళ్ళ నుండి పెకలించి, దగ్ధం చేసే కఠినతర కార్యక్రమానికి అన్ని కోణాల నుండీ శక్తులను సమీకరించాలి. ప్రచారపోరాట కార్యక్రమమంతా ఆ దిశగానే కేంద్రీకరించాలి.

జ్యోతి మరణంతో యండమూరి రచనల మీద చర్చ విస్తృతంగా జరిగింది. మిగతా అలాంటి రచనల్లో అవి భాగమంటూనే, ఆ రెండు రచనల పరిమితిలోనే మొత్తం హేతువాద చర్చ సాగింది. అది ఒక ప్రత్యేక ధోరణి కాదంటూనే; ప్రత్యేక ధోరణియేననిపించేంతగా, యిక యీ వ్యాసంతో, యీ చర్చా గోష్ఠితో దాని నామరూపాలు లేకుండా చేస్తూన్నామన్నంత సుదీర్ఘంగా, అతగాడి పదాల్ని, వాక్యాల్ని విశ్లేషిస్తూ చర్చ దాదాపు "అకాడెమిక్" స్థాయిలో సాగింది. విషయం పల్చబడి, తేలికయి గాలికెగిరి పోయింది. విన్న వాళ్ళ హృదయాల మీద అవసరమయిన ముద్ర వేయకుండానే, చర్చ వాళ్ళ తలల మీదుగా వెళ్ళి పోయింది. ఈ సుదీర్ఘ చర్చ–దాదాపు అంతా–ఆకులు, కొమ్మల గురించు పట్టించుకున్నంతగా విషవృక్షం వ్రేళ్ళ గురించీ, దాన్ని సమూలంగా నిర్మూలించే కార్యక్రమం గురించీ పట్టించుకోక పోవడమే దీనికి కారణం.

అవి కుళ్ళు రచనలు అని తెలుసుకోవడం ఎందుకు? వాటిని లేకుండా చేయడానికై అవసరమయిన కార్యక్రమానికి వుద్యమించేందుకే కదా! మరి, ఆ విధంగా కార్యాచరణకు పురి కొల్పే విధంగానే కదా యీ చర్చ(ఏ చర్చఅయినా)సాగాలి.

ఉదాహరణకు, చేతబడులకు శాస్త్రీయ పునాది వుందనే భ్రమను—అనుమాన ప్రమాణంతో – కలిగించడానికి జలసి రచయిత ప్రయత్నించిన మాట నిజమే. కాని అవి వైజ్ఞానిక నవలలు కావని నిరూపించడమే ముఖ్య కర్తవ్యమన్నట్లు కనిపించింది చర్చ నడచినతీరును గమనిస్తే. అక్కడికి వైజ్ఞానిక నవలలన్నీ ప్రగతి శీలమయినట్లు. జనరల్ సైన్సెస్‌కు సంబంధించిన వాస్తవాలు, ఆ వాస్తవాల మీద ఆధారపడిన వూహలతోనే నవలలు రాసి దోపిడీ వర్గాల కొమ్ము గాయడం, దోపిడీ వర్గ సంస్కృతిని వ్యాపింపజేయడం సాధ్యమేననడానికి పెక్కు పాశ్చాత్య నవలలు తార్కాణం.

ఆ దేశాలలో భూస్వామ్య విధానం అంతరించి పెట్టుబడిదారీ విధానం దాని అంతిమ దశకు పెరిగివుంది. ఆ పునాది నుండి వచ్చే పెక్కు నవలలు "వైజ్ఞానిక నవలల" నిర్వచనానికి లోబడే క్రైం, సెక్స్‌లతో నిండి సామ్రాజ్యవాద సంస్కృతి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. విపరీత పారిశ్రామిక అభివృద్ధి, అంతిమ సంక్షోభం లోనికి చేరుతున్న పెట్టుబడిదారీ ఫ్రస్ట్రేషన్‌లను యీ నవలలు ప్రతిబింబిస్తాయి.

అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య స్వభావం కలిగిన మన సమాజంలో కొత్త వైజ్ఞానిక నవలల పెక్కికన్నా (అపభ్రంశ రూపంలోనే), ఎక్కువగా మూఢ నమ్మకాల (పుక్కిటి పురాణాల) పెక్కికన్నా రంగరించి రాసి డబ్బు చేసుకోవడం సాధ్యం అవుతోంది.

యండమూరి, నంది, హరికిషన్ తదితర రచయితలు మూఢనమ్మకాన్ని పెంచడమేకాదు. అలారాసి, చదివించి "బాగుపడుతున్నారు". మంచిదయినా, చెడుదయినా ఒక రచన సామాజిక పునాది లేకుండా సక్సెస్ కాదు. వాళ్ళు రాయడమేకాదు వాటిని ప్రజలు విస్తృతంగా చదివి పుస్తకవిక్రేతలకు డబ్బు గడించిపెడుతున్నారు. ఇట్లాంటి నవలలు వుత్పత్తి చేయడానికి అవసరమైన ఇన్సెంటివ్ (ప్రోత్సాహం) సమాజంలోనే వుంది. ఈ వైపరీత్యాన్నే మనం వివరించ గలగాలి. అవి రాయబడడానికీ, చదవడానికీ వున్న సామాజిక పునాదిని తెలుసుకోవాలి. తెలపాలి. ఆ పునాది మీదనే జరపాలి అసలు యుద్ధం. ఆకులను, కొమ్మల్ని ఖండించాల్సిందే. చెట్టును ఛిన్నాభిన్నం చేయాల్సిందే. అదంతా విష వృక్షాన్ని వ్రేళ్ళ నుండి పెకలించాల్సిన పనిని సులువు చేసుకోడానికేనని మాత్రం మరువరాదు. మరువ నివ్వరాదు.

దయ్యం వ్యవస్థ _ దయ్యం బిడ్డలు

20 వ శతాబ్దం పూర్తి కావస్తోంది. ఈ దేశం యింకా, సామ్రాజ్యవాద, భూస్వామ్య రాజకీయార్థిక, సాంస్కృతిక బంధనాల క్రింద మగ్గుతూనే వుంది.

ప్రజలకు ఏమీ ఒరగ బెట్టకుండానే, కేవలం వాగ్దానాల మీద, సమ్మకం సంపాదించి ఒకరు ప్రధానమంత్రిగా కొనసాగ గలుగుతున్న దేశం మనది. ఎవరో ఒకర్ని విగ్రహం చేసుకుంటే తప్ప – వారి విధానాలు సరైనవైనా – అనుసరించలేని పరిస్థితి మన ప్రజల్లో ప్రబలంగానే వుంది. పైకి చూడ్డానికి యీ దేశంలో పార్లమెంటరీ రాజకీయాలున్నాయి. కాని, వంశ పారంపర్య రాజకీయాలు, ఏక వ్యక్తి పాలన సజావుగా సాగుతూనే వున్నాయి. అందుకే, ఒక విమర్శకు డన్నట్లు; యిది పెట్టుబడిదారీ దుస్తులు తొడుక్కున్న భూస్వామ్య సమాజం అనడం దీనికి ఎంతైనా నప్పుతుంది.

ఈ లక్షణాలు వుంటం కూడా కాదు, మన సమాజపు ప్రత్యేకత. ఇవన్నీ దాదాపు అంగీకృతాంశాలుగా కొనసాగుతూ వుండడం, జాతి జీవనంలో భాగంగా కొనసాగుతూ వుండడం.

రోజూ ఎవరో ఒక మహిళ ఎందుకో ఒకందుకు ఆత్మ హత్య చేసుకోవడం కాదు; అంతూలేలు, సుబ్బరామిరెడ్లు అవినీతికి పాల్పడడం కాదు; "ఎన్ కౌంటర్ల" పేరుతో పోలీసులు ప్రజలనూ, ప్రజల నాయకులనూ కాల్చిచంపి – నమ్మాలని వాళ్ళే ఆశించని – కట్టు కథలు చెప్పి తప్పుకో గలగడం కాదు యీ సమాజం ప్రత్యేకత. అవి సమాజ జీవితంలో మామూలు భాగాలైనట్లు, నిర్లక్ష్యంగా తుడిచేసుకొని ఎవరి బ్రతుకు వాళ్ళు బ్రతుకుతూ వుండడమే – యీ సమాజపు ప్రత్యేకత.

ఇందిరమ్మ వాగ్దానాన్ని నమ్మి ఓట్లేసే సమాజం యండమూరి థియరీలు నమ్మి డబ్బుల వర్షం కురిపించడం సహజమే. దానిలో ఆశ్చర్యపడవలసిందేమీ లేదు.

పేరుకుంటున్న కుళ్ళు

నిరంతరాభివృద్ధి అనేది అన్ని వస్తువులలాగే సమాజానికీ ప్రాథమిక లక్షణం. ఏ కారణం చేతనైనా యీ సహజ అభివృద్ధి ఆగిపోయినప్పుడు వస్తువు కుళ్ళుతుందనేది సర్వసాధారణమైన విషయమే. పారని నీరు కొద్ది కాలంలోనే నాచుపట్టి, మురికి జారి త్రాగడానికి వీల్లేకుండా తయారవుతుంది. సమాజం గతీ అంతే. ఈనాటి మన వ్యవస్థ పరిస్థితీ అంతే.

సామ్రాజ్యవాదం తన అవసరాలకనుగుణంగా యీ దేశంలో పెట్టుబడిదారీ విధానాన్ని ఒక మేరకు అభివృద్ధి చేసిన మాట నిజమే. కాని, త్వరలోనే భూస్వామ్య విధానంతో రాజీపడి అభివృద్ధికి అవరోధమయింది. ఫలితం, అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య స్థితినుండి ఎదుగూబొదుగూ లేకుండా పడివున్న మన సమాజం. ముందుకు దారిలేని ప్రతిష్టంభన. వస్తువు కుళ్ళేది యిక్కడే. సంక్షోభం తీవ్రమయ్యేకొద్దీ కుళ్ళు పేరుకుంటున్న క్రమాన్ని సులభంగానే చూడవచ్చు.

పదేండ్ల క్రిందట క్రైం, సెక్స్‌నవలలు కావాలంటే వీధిమారుమూల దుకాణం లోంచి అద్దెకు తెచ్చుకుని టెక్స్ట్ పుస్తకాల మాటున పెట్టుకుని చదువుకునేది, యువకులు. ఇప్పుడు దర్జాగా ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి పత్రికలు కొని, యింట్లో ఎవరి తరువాత ఎవరని వంతులు వేసుకుని చదువుకోవచ్చు, అందరూ.

పునాది, వుపరితలం అనే శాస్త్రీయ సూత్రీకరణ చెప్పింది మార్క్సిస్టులు, కనుక తిరస్కరిద్దాం, అనే ప్రేజుడిస్‌కు బలైపోని వాళ్ళంతా – పునాది రంగాల (ఆర్థిక, రాజకీయ రంగాల) కుళ్ళే సాహిత్యంలోనికి ప్రవేశిస్తోందని అంగీకరించడానికి అభ్యంతరం చెప్పరు.

యండమూరి, నంది తదితరులందరూ యీ దయ్యం వ్యవస్థకు సహజమైన బిడ్డలే. ఈ వ్యవస్థ వున్నంతకాలం వీళ్లు పుడుతూనే వుంటారు. వేటూరి బూతు పాటలతో, అమ్జాద్‌ఖాన్, బ్రూస్‌లీ ల అర్ధ-రహిత హింసా ప్రదర్శనలతో సినిమాలు వస్తూనే ఉంటాయి. అంగీకృతాలై, ఆదరింపబడి డబ్బు చేసుకుంటూనే వుంటాయి.

ఈ కళలూ, సాహిత్యం యీ వ్యవస్థ దయ్యం బిడ్డలైతే; వాటిని కొని, చూసి "సక్సెస్‌ఫుల్" చేస్తున్న ప్రజలు యీ దయ్యం వ్యవస్థకు విక్టిమ్స్, బలైపోతున్నవాళ్లు.

కుళ్ళు సరుకును గుట్టలకొద్దీ దుకాణాలుపెట్టి అమ్ముకుని "బాగుపడుతున్న" వాళ్ళను ఒక్కొక్కరిని గురించే చర్చించడం మొత్తం క్రమాన్ని వాళ్ళ వుదాహరణలతో ప్రజలకు అర్థం చేయించడానికేగాని, వుదాహరణలే ప్రత్యేక విషయాలు కాకూడదు. ఆకుల్ని మైక్రోస్కోపుకింద పెట్టి చూపించడం యిది విషవృక్షమని రుజువు చేయడానికే, గాని ఆకుతో మొదలెట్టి, ఆకుతో ముగించడానికి గాదు.

యుద్ధం ఎలాగూ తప్పదు. ప్రజల్నిరక్షించుకోవాలి. విషవృక్షాన్ని సమూలంగా పెరికివేయాలి. ప్రమాదం గురించి చెప్పడం చాలదు. పెరికివేసే కార్యక్రమానికి జనాన్ని కదిలించాలి.

ఉదాహరణకు తులసి, తులసిదళం తదితర రచనలను నిషేధించాలని డిమాండ్ చెయ్యనవసరం లేదనే అభిప్రాయం ఒకటి వినవచ్చింది.. కాని అది అవసరమే. దాని మీద ఒక పూరేగింపు జరిపినా అది వుపయోగకరమే. ఈ ప్రభుత్వం వాటిని నిషేధించదు. విప్లవ సాహిత్యాన్ని నిషేధించేదీ, కుళ్ళు సాహిత్యాన్ని నిషేధించనిదీ - ఎటువంటి, ఎవరి ప్రభుత్వమో తెలియజెప్పి ప్రజలతో ఒప్పించడానికున్న అవకాశాన్ని వదులుకోవడం ఎందుకూ? ఇది కుళ్ళిన వ్యవస్థ. దీనిని పరిరక్షించి, ప్రజల్ని అన్ని విధాలుగా నాశనం చేసేదే యీ ప్రభుత్వం.

ప్రత్యామ్నాయ వ్యవస్థ

ప్రత్యామ్నాయ సాహిత్యం

కుళ్ళు వ్యవస్థనూ, కుళ్ళు సాహిత్యాన్నీ వ్యతిరేకించడమొక్కటే చాలదు. ప్రజలకు యీ వ్యవస్థ అనివార్యం (ఇనెవిటబుల్) కాదు. వాళ్ళ వ్యవస్థ ఆరోగ్యకరమైనది. దాన్ని సాధించుకోవాలి. అలాంటి ప్రత్యామ్నాయం చూపించాలి. దానికై నడిపించాలి. అలాంటి ప్రత్యామ్నాయ సాహిత్యం అందించాలి. దాన్ని చదివించాలి.

మనిషిని అటు సరుకు గానూ మార్చి, ఇటు "విశ్వాసాల"కూ బలిచేసి పబ్బం గడుపుకుంటున్న అర్ధ-వలస, అర్ధ-భూస్వామ్య వ్యవస్థ యిప్పుడున్నది. పరస్పరం ప్రజలమధ్య సహకారాన్ని గాక కేవలం పోటీని, ఆత్మ విశ్వాసాన్నిగాక ఆత్మ పరాధీనతను పెంచి పోషిస్తున్నది. వేతన బానిసగా మారిన మనిషి తన సారాంశమైన శ్రమనుండి, శ్రమ ఫలితం నుంచి దూరమైనాడు. తనను తాను పోగొట్టుకొని తీవ్రమైన ఆవేదనతో, తనకై తాను వెదుక్కుంటున్నాడు. ఇనెవిటబిలిటీ (విధి)ని పాత, కొత్త రూపాల్లో అంగీకరింపజేసి, మృత్యువు దిశగా పలాయనం చేయించటమే "పలాయనాధ్యాత్మికావేశం" నూరిపోసే కవులు, బ్రతుకును గురించిగాక చావు గురించి ఆలోచింపజేసే యండమూరి తదితరుల రచనలూ చేస్తున్న దుర్మార్గం. ఈ సాహిత్యం, కళలు యధాతధస్థితిని-దాని దుర్భరత్వంతో సహా-వ్యక్తీకరిస్తాయి. పోతే యిదింతే, అనివార్యమని నమ్మింపజూస్తాయి.

తీవ్రమైన వేదనను అనుభవిస్తున్నారు పేద, మధ్యతరగతి ప్రజలు. దైహిక, మానసిక క్షుధాపీడితులై క్రుంగిపోతున్నారు. ఆకలి దహించే మనిషి చెత్తకుండీలోని కుళ్ళిన కూడు భోంచేసినట్లుగానే ప్రజలు ఇందిరమ్మకు ఓట్లేస్తున్నారు. కుళ్ళు రచ

నలు చదువుతున్నారు. చెత్తకుండీ తిండి తింటున్న వాళ్ళను "అధములం"టూ నిర్వచనాలకు దిగడం సమంజసం కాదు.

గుండెకోత పెట్టే వేదనవల్లనే, తాత్కాలికంగా ఏ మత్తుమందు దొరికితే అది తిని కాసేపయినా నిద్రపోదామని, లేదా ఎందుకీ బ్రతుకు ఏ విషమైనా తిని చచ్చిపోదామని చూస్తారు సాధారణ ప్రజలు. ఇందిరమ్మకు ఓట్లేయనివ్వండి, సత్యసాయిబాబాకు భజనలు చేయనివ్వండి, గంజాయి దమ్ముకొట్టి సోలిపోనివ్వండి. తులసి, కాంచనగంగ, బలిహారం చదివి నిద్రపోనివ్వండి—ఇదంతా సమస్యలను తామే పరిష్కరించుకోగలుగు తామనే ఆత్మ విశ్వాసం లేక మత్తులోనికి, మృత్యువులోనికి జరుపుతున్న పలాయనమే. ఈ దుర్భర వేదన అనివార్యం అని రాజకీయాల్తో, సాహిత్యంతో ఒప్పించాం, యిక వాళ్ళెందుకు జీవించాలి? (దేముడు బతకమన్నాడు గనుకనా?)

అందుకే, యివాళ ప్రజలకోసం పనిచేసే కార్యకర్తల కర్తవ్యమూ, ప్రజల రచయితల కర్తవ్యమూ దాదాపు ఒక్కటే. కుళ్ళు వ్యవస్థను, కుళ్ళురచనలను బట్టబయలు చేస్తూనే, వాటి సమూలనిర్మూలన సాధ్యమనే ఆత్మవిశ్వాసం యివ్వాలి. దీనికి ప్రత్యామ్నాయంగా ఆరోగ్యకరమైన, నిజమైన ప్రజల సమాజాన్ని చూపించాలి. ఒప్పించాలి. నడిపించాలి. ఒక వూరేగింపు, ఒక డిమాండ్లపత్రం, ఒకసమ్మె, విముక్తి యుద్ధం—మెట్టు, మెట్టుగాకదుల్తారు ప్రజలు. కదుల్తున్నారు. (కదలడమే ఒక ప్రత్యామ్నాయం.) ఏ మేరకు కదుల్తున్నారో ఆ మేరకు కుళ్ళు రాజకీయాల్ని, కుళ్ళు సాహిత్యాన్ని తిరస్కరిస్తున్నారు. ఇది ప్రస్తుత చారిత్రక నేపథ్యం. (యండమూరి రచనలమీది చర్చ యీ నేపథ్యానికి ఒకడుగు వెనకే వుందని, యీ వ్యాసకర్త అభిప్రాయం)

ఔనండీ, చదువుకున్నవాళ్ళకు చదువుకునే (చదివించే) నవలలు కావాలి. చక్కని కవిత్వం కావాలి. బ్రతుకు బొమ్మలుకట్టే పాటలు కావాలి. ప్రజలకు ఆరోగ్యకరమైన కళలూ—సాహిత్యాన్ని ప్రత్యామ్నాయంగా, విస్తృతంగా ఏ మేరకు అందించగలుగుతామో ఆ మేరకు కుళ్ళు కళలూ—సాహిత్యానికి అవకాశం లేకుండా చేస్తాము. (చర్చాక్రమంలో వచ్చిన శ్రీ చేరా వ్యాసం యీ అంశాన్ని ముందుకు తెచ్చింది. యితరులు అదిఏదో అల్పవిషయమని కొట్టేయడం జరిగిందనిపించింది).

మెజారిటీ ప్రజానీకానికి ప్రత్యామ్నాయ వ్యవస్థపై నమ్మకం కలిగించగలిగితేనా, దాన్ని సాధించుకోగలుగుతామనే విశ్వాసం పూర్తిగా యివ్వగలిగితేనా—ప్రజలు వుప్పెనగా లేస్తారు. ఇందిరమ్మకు ఓట్లేసిన ఆ ప్రజలే యీ వ్యవస్థకు గోరీ కట్టడానికి

చెరబడ్డరాజు

జె. శిల్పి

మట్టి బతుకులు మళ్ళీ....మళ్ళీ....
పాడుకోవాలనిపించే గీతానివి నువ్వు
తుళువతనపు కుబుసాన్ని విడిచి
మేఘగర్జనల్లో రాలిన తొలకరివి
ఈ ముళ్ళ కంచెలు దాటితే
మళ్ళీ నిన్ను చూడాలనే ఆవేదన
మోనాపలీ కంపెనీల లాభాల కోసమేగాని
మానవత్వం ప్రాణాల్ని రక్షించడానికి మందులు లేవు
పెట్టుబడిదారీ విలువలకోసం
సైన్స్ సత్యశోధన బలయి పోతున్నది.
అమ్ముడుపోయిన విలువల్లో
ఎదగని శాస్త్రీయజ్ఞానం
కూలి పోతున్న మట్టి గోడలు
హృదయాల్ని పిండేస్తున్న భయం
మళ్ళీ నువ్వు కోలుకుంటే
నిన్ను చూడాలనే ఆవేదన

రాళ్ళు మోసుకొస్తారు. చేతబడి నవలల పాఠకులే ప్రజాసాహిత్యానికి నడిచే లైబ్రరీలు అవుతారు.

ఆ ప్రత్యామ్నాయ వ్యవస్థ మరేదో కాదు. నిజమైన స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం పునాదిగా వుండే నూతన ప్రజాస్వామిక వ్యవస్థయే. ఆ ప్రత్యామ్నాయ సాహిత్యం మరేదో కాదు. ప్రజల జీవితం, ప్రజల పోరాటాలకు అంకితమైన నూతన ప్రజాస్వామిక సాహిత్యమే. రెండు రంగాల్లోనూ ప్రారంభమై అభివృద్ధి చెందుతున్న యీ వుద్యమాన్ని యింకా ముందుకు తీసుకుపోవడమే ప్రజలను ప్రేమించే వాళ్ళందరి కర్తవ్యమూ.

ప్రాణగీతం

కె. రాంమోహన్‌రాజు

మేము వచ్చాము-పైకెగిసి
మీ ఊహాసౌధాల రెక్కల్ని కత్తిరిస్తూ
మేము వచ్చాము-పైకురికి
మీ పునాదుల నెర్రెల్లో లావాలై ప్రవహిస్తూ
మేము వచ్చాము మీతో యుద్ధానికి—
ఈ క్షుద్ర సంధ్యాసమయంలో నరమాంస రక్త
పిపాసులై గంతులేసే పిశాచ సమూహాల్లారా తొలగండి
సూర్యుడు కుంగిపోయాడని గదా మీ ఊహ!
పగలంతా ప్రాణతేజం పొందిన శక్తుల్ని మరవకండి
మొండి వేళ్ళతో కత్తి పట్టటానికి
సాహసిస్తున్న మీరంతా వెళ్ళిపోండి
మేము తరతరాల మా వారసత్వాన్ని
నిలుపుకోటానికి
మా జాతిజనులు అనాదిగా నిక్షిప్తం చేసిన
శక్తుల్ని ధరించి కవితా యుద్ధరంగానికి వచ్చాము
కాల సముద్రపు కెరటాల జవనాశ్వాలనెక్కి
సంకల్పం ధనుస్సుగా-ధైర్యాన్ని అమ్ముగా
ధరించి వచ్చాము—కవితను సైతం స్వేచ్ఛకోసం ప్రయోగిస్తాము
అజ్ఞాన రాక్షసి
నరాలు తెంపి ఫిడేలు రాగాలు పలికిస్తూ
యుద్ధగీతం ఆలపిస్తూ వచ్చాము
తప్పుకోండి మీరంతా-తట్టుకోలేరు మా వర్గశక్తి!
సుఖ వాంఛా జ్వర సంధి ప్రేలాపనల్ని కట్టిపెట్టండి
మీ పట్టు లాల్చీ జేబులో నిద్రపోయే
షెఫర్డ్ పెన్ను ఇకపై చాకలి పద్దులుగూడా రాయలేదు
కవిత్వం మీరంటున్నట్టు అంతఃపురాంగనల నడుంమీద
కొవ్వు మడత కాదు

అరమోడ్పు కన్నుల సుందరి సుతారపు వేళ్ళ
వీణ తీగమీద చేసే లాఘవనాట్యం కాదు
నల్లడబ్బుతో తాగే పచ్చని షాంపేన్ కాదు
సుఖాల పసుప్పచ్చని గుండుమీద మెరిసే
ఆధ్యాత్మిక కాషాయప్పులకకాదు
కవిత్వం గీయగానే మండే అగ్గిపుల్లకాదు
మెలమెల్లగా హృదయాన్నావరించి రక్తాన్ని
పోటెక్కించే భాస్కరశక్తి
కవిత్వమంటే శ్రమజీవి నెత్తురు నీరైనప్పుడు పలికే జీవన సంగీతం
చంద్రుడు ఉదయాద్రినెక్కి విశాల
వియత్సముద్ర జలాల్లోకి డైవింగ్ చేసి
ఈదుతున్నవేళ
అలసటగా కుక్కి మంచంలో సోలినకూలీ
నుదుట ఊరిన స్వేద బిందువులో
కవిత్వం తళుక్కున మెరుస్తుంది
కోపంతో రక్తం మరిగినప్పుడు
ఆవిరి అక్షరాలుగా
ఊపిర్లు రాగాలుగా రూపుదిద్దుకుంటాయి
ధ్వనులు భేరీల్లా మోగుతాయి
కవిత్వం మాకు ఆయుధం
మీరు పళ్ళు కోసుకునే కత్తి
మా వర్గం చేతిలో ఆయుధమవుతుంది
అనాది మానవుని స్వేచ్ఛాగానాన్ని
భవిష్యన్మానవుని పురోగామి గీతాన్ని
మేము కవిత్వంలో వింటున్నాము
మాకు కవిత్వం జీవించే ధైర్యాన్నిచ్చే ఉద్దీపన శక్తి
మాకు కవిత్వం వర్గకసిలో రగిలిన మంట

ప్రజా పంథా

లక్నారెడ్డి

గీత గీయడం కష్టంగా వుంది
నాకూ వీనికీ మధ్య
తోడేళ్ళకూ మేకలకూ మధ్య
తెర గీయడం కష్టంగా వుంది-
మట్టిని పట్టి పట్టి చూసి
పరిశోధనశాలలో పరిశీలించినా
నూటికి నూరుపాళ్ళు విశ్లేషించడం కష్టంగా వుంది-
అమ్మ మీంచిపోతుందో, అయ్య మీంచిపోతుందో
సంకలో పేను దాక్కుంటుందేమో !
చెప్పలేనంత అనుమానంగా వుంది-
ఇది కబడ్డీ ఆటకాదు
అల్లాటప్పా ఆడుకోవడానికి-
రణ భూమిలో
నా వాళ్ళనూ, పగవాళ్ళనూ
పసిగట్టడం ముఖ్యం—

జన సైన్యాన్నెక్కించుకోకుండానే స్టార్టయి
మరే స్టేషన్లోనూ ఆగకుండా
యుద్ధ భూమిలో క్షతగాత్రురాలవుతుంది దుడుకుదనం
పగవాళ్ళను కూడా ఎక్కించుకొని
శత్రు శిబిరానికి సహాయాన్నందిస్తుంది మెత్తదనం

మితిమీరిన సాహసం కాళ్ళనరికేస్తే
మితిమీరిన సహనం తల కొరిగేస్తుంది-

గీత స్పష్టంగా గీస్తేనే
బ్యాలెన్సు ఖచ్చితంగా పాటిస్తేనే
విజయ దేవత పాదాభివందనం చేస్తుంది-

చుట్టరికాల రక్తబంధాల తెంచి చూసినా
పాలెగూళ్ళ గజిబిజి వర్గాల్లోంచి
భవిష్యత్ లోకాలకు దారి గీయడం కష్టంగా వుంది--
చంద్రుడు ఆకాశాన్ని వెలిగించినా
చుక్కకూ చుక్కకూ మధ్య వున్న చీకట్లో
దారి వెతుక్కోవడం కష్టంగా వుంది-
రాత్రికీ పగలుకూ మధ్యవున్న సరిహద్దు రేఖల
గమన సూత్రాల గతితర్కాన్ని స్టడీ చేశాక
సన్నని, మెలికలు తిరిగిన,
సుదీర్ఘమయిన దారి దొరికింది-
అయినా - దారమంత దారిమీంచి
ఎర్రసైన్యంతో లాంగ్‌మార్చ్ చేయడం కష్టంగా వుంది-
(తొందరలో) బ్యాలెన్సు నిలదొక్కుకోడానికి
కుడినుంచి ఎడమకూ
ఎడమ నుంచి కుడికీ
పరిగెత్తే ప్రమాదం వెంటాడుతుంది-
అటు పడ్డా ఇటు పడ్డా
శరీరం గాయాల పాలవుతుంది.
గమ్యం ఇంకా దూరమవుతుంది-

అయిదు అమ్ముల హొదల సెల్సులతో
బలంగా వెలిగించే టార్చిలైట్లున్నా
పెద్దలు స్వయంగా చేయిపట్టుకొని నడిపిస్తున్నా
దారి తప్పకుండా నడవడం కష్టంగా వుంది-
వెన్నెల మైదానాలకెళ్ళే ఈ అడవి గుండా
పులితోటో, చిరుత పులితోటో
ఏ చిల్లర జంతువుతోటో
దెబ్బతినకుండా పోవడం సాధ్యం కావడంలేదు-

గిరిజన వ్యవసాయ పద్ధతులు - ప్రభుత్వ వైఖరి

కె. సీతారామారావు

I

ఆఫ్రికా తరువాత భారతదేశంలోనే ఎక్కువ మొత్తంలో గిరిజన జాతులు నివసిస్తున్నవి. భారతదేశంలో దాదాపు 450 వరకు గిరిజన తెగలు, ఉపతెగలున్నవి. భారతదేశ మొత్తం జనాభాలో గిరిజనుల జనాభా ఏడుశాతం. ప్రతి గిరిజన తెగ ఒక ప్రత్యేక జీవనవిధానాన్ని, సంస్కృతిని కలిగిఉండి గిరిజనుల జీవనపరిస్థితులలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. భారతదేశంలో ముఖ్యంగా గిరిజనులు ఈశాన్య భారత సరిహద్దుప్రాంతాల్లో మధ్య భారత ప్రాంతంలో ఎక్కువ కేంద్రీకరింపబడినారు. ఈ మధ్యభారత గిరిజనప్రాంతం ఎన్నోరాష్ట్రాల్లోకి (మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, బెంగాల్ విస్తరించి ఉన్నది.

సాధారణంగా భారతదేశంలోని గిరిజన ప్రాంతాలను అక్కడ ఉండే ఉత్పత్తి విధానం, ప్రజల జీవన పరిస్థితుల ననుసరించి నాలుగు రకాలుగా విభజించవచ్చు. అవి (i) ఆహారోత్పత్తి మొదలుగాక కేవలం ఆహారణ సేకరణద్వారా జీవించే గిరి

అయినా పడ్తూ, లేస్తూ
నడుస్తూనే ఉన్నా —

తగిలిన గాయం మీది మచ్చ పాఠం చెబితే
ఓటమి ద్వారా గెలుపుకు హామీ పొందాను

బాయినెట్ల రోమాల కంచకావరమున్న
మూడు పర్వతాల మూల నరాలను
ఈ లేత ఉక్కు గోళ్ళతో గీకేయడం బాధగాలేదు-
పడవ పగిలిపోయి
శరీరమంతా రక్తమయమయి
కనుచూపు మేరలో ఒడ్డు కానరాకున్నా
ఎంచుకున్న దారిలో ఈదుకుంటూ పోవడం కష్టంగా లేదు-
ఉత్తేజంగా, సంతోషంగా ఉంది
గొప్ప ఆనందంగా వుంది—

జనులున్న గిరిజన ప్రాంతాలు (ii) అడవిని జయలుచేసి పోడు వ్యవసాయాన్ని కొనసాగిస్తూన్న ఆహార సేకరణపై జీవించే గిరిజనులున్న గిరిజన ప్రాంతాలు iii) గిరిజనులు మైదాన ప్రాంతాల్లో స్థిర వ్యవసాయాన్ని కొనసాగిస్తూ జీవిస్తున్న గిరిజన ప్రాంతాలు iv) గనుల త్రవ్వకం, పారిశ్రామికీకరణ జరిగిన గిరిజన ప్రాంతాలు. ఈ ప్రాంతాల్లోని గిరిజనులు గనుల్లో, కర్మాగారాల్లో కూలీలుగా మారడం జరిగింది. గిరిజన ప్రాంతాల్లోని ఆర్థిక వ్యవస్థ ఆదిమ లక్షణాలు కలిగినటు వంటివి. ఆహార ఉత్పత్తిలో ఆదిమ ఉత్పత్తి విధానం, తక్కువస్థాయి సాంకేతిక విజ్ఞానం ఉపయోగించడమే దీనికి ఉదాహరణ. ప్రధానంగా ఇలాంటి లక్షణాలున్న గిరిజన ఆర్థిక వ్యవస్థలు ఎంతోకాలంగా స్వయం పోషకంగా మనగలిగినవి. కాని క్రమంగా ఇవి తమ స్వయం పోషకత్వాన్ని కోల్పోతున్నవి. ఎన్నో సంవత్సరాలనుండి ముఖ్యంగా మైదానప్రాంతాల్లోని గిరిజనేతరులు గిరిజన ప్రాంతాల్లోకి వలసపోవడం, గిరిజన ప్రాంతాల్లోనున్న సహజ వనరులు, ఖనిజాలు ఉపయోగించడానికి చేపట్టిన గనుల త్రవ్వకం,పారిశ్రామిక కార్యకలాపాలు, అడవుల్లోని ముడిసరుకుల వినియోగానికి ప్రభుత్వంచేపట్టిన అడవుల వ్యాపారీకరణ (Commercialisation of forests) విధానం ఇవన్నీ గిరిజనుల సామాజిక-ఆర్థిక జీవనాన్ని కల్లోలపరచడమే గాకుండా గిరిజనులను క్రూరమైన పేదరికంలోకి నెట్టివేసినవి.

ఈశాన్య భారత గిరిజన ప్రాంతాలకు మధ్య భారతంలోని గిరిజన ప్రాంతాలకు కొన్ని మౌలికమైన తేడాలున్నవి. ఈశాన్య భారత గిరిజన ప్రాంతాలు ఇప్పటికికూడా చాల వరకు, ఆధునిక మార్కెట్ ఆర్థిక వ్యవస్థలోకి తీసుకురా బడలేదు, ఒక్క త్రిపుర తప్ప. ఇప్పటికీ ఆ గిరిజన ప్రాంతాలు కొంత స్వయం పోషకత్వాన్ని కలిగి ఉన్నవి. ఈశాన్యభారత గిరిజన ప్రాంతాల్లో క్రిస్టియన్ మిషనరీల ప్రభావం ఎక్కువ. కాని మధ్య భారతంలోని గిరిజన ప్రాంతాల్లోకి గిరిజనేతర వడ్డీ వ్యాపారస్తులు, గుత్తేదార్లు పెద్ద మొత్తంలో చొచ్చుకొనిపోయినారు. బ్రిటిష్ వలసరాజ్యం ఈ రెండు గిరిజన ప్రాంతాలపట్ల రెండు రకాలైన విధానాలు అవలంబించింది. ఈశాన్య భారత గిరిజన ప్రాంతం సరిహద్దు ప్రాంతం కాబట్టి రక్షణ అవసరాల దృష్ట్యా అప్పుడున్న బ్రిటిష్ ప్రభుత్వం "పరిమిత జోక్య విధానాన్ని" (offcial isolation policy) అవలంబించింది. కాని మధ్య భారత గిరిజన ప్రాంతాలలో "విస్తరణ విధానాన్ని" అవలంబించింది. ఈ విధంగా గిరిజన ప్రాంతాలు సామ్రాజ్యవాదులచే, స్థానిక పెట్టుబడిదారులచే, గిరిజనేతర గుత్తేదార్లచే, వడ్డీ వ్యాపారస్థులచే దోచుకోబడి వెనుకబడిన

ప్రాంతాలుగా మిగిలినవి. గిరిజన ప్రాంతాలను వెనుకబడ్డ దేశాల్లో ఇంకా వెనుకబడ్డ ప్రాంతాలుగా చెప్పవచ్చు.

గిరిజనేతరులు మైదాన ప్రాంతాల్లోనుండి గిరిజన ప్రాంతాల్లోకి వలసపోయి అక్కడ వారి అతిసారవంతమైన భూములను అక్రమంగా ఆక్రమించుకోవడం వల్ల గిరిజనులు తమ భూములనుండి పరాయీకరణ (Aliaenation) చెంది వ్యవసాయకూలీలుగా మార్చబడి దోచుకోబడ్డారు. గిరిజనేతర భూ ఆక్రమణదార్ల భూదాహంవల్లనే గిరిజన ప్రాంతాల్లో భూదాహం పెరిగి గిరిజనులు ఎన్నో తిరుగుబాట్లు చేయాల్సివచ్చింది. గూడెం గూడెం తిరుగుతూ ఉప్పు, మిరపకాయలు, పొగాకు అమ్ముకునే సంచార వ్యాపారస్తులు క్రమంగా అప్పులిచ్చి వడ్డీ వ్యాపారస్తులై గిరిజనుల భూములను ఆక్రమించినారు. ఈ విధంగా గిరిజనులు నిరంతరం అప్పుల పాలవడమే గాకుండా వడ్డీ వ్యాపారస్తులచే క్రూరంగా దోచుకోబడుతున్నారు. సహజ వనరులు. ఖనిజాలలోపం గనుల త్రవ్వకం, పారిశ్రామికీకరణ కూడా గిరిజనులకు ఏ మాత్రం లాభం కలుగచేయక పోవడమే కాకుండా గిరిజనులు ఎన్నో కొత్తకొత్త పద్ధతులు, సంస్థలద్వారా దోచుకోబడ్డారు.

గిరిజన ప్రాంతాల్లో నిర్మించిన పెద్దపెద్ద నీటిపారుదల ప్రాజెక్టులు ప్రధానంగా జలవిద్యుత్తు ఉత్పత్తికోసం ఉద్దేశింపబడ్డవే కాని గిరిజన ప్రాంతాల నీటిపారుదల, వ్యవసాయాభివృద్ధికోసం మాత్రంకాదు. వన్యవనరులనుదోచే ప్రభుత్వఅడవులవ్యాపారీకరణ విధానంసహజసిద్ధమైనఅడవులు నాశనమైపోవడానికేకాకుండా ఫారెస్టుగుత్తేదార్లు గిరిజనులను ఎన్నో విధాలుగా దోచడానికి ఉపయోగపడ్డది. అడవులపై గిరిజనులకుండే సాంప్రదాయ సిద్ధమైన మౌలిక హక్కులు హరించబడ్డవి. అంతేగాకుండా ఫారెస్టు గుత్తేదార్లతోపాటు అటవీశాఖాధికారులు గిరిజనులను ఎన్నో విధాలుగా బెదిరించి పీడిస్తున్నారు. వీటన్నికంటే ప్రభుత్వ గిరిజన సంక్షేమవిధానం, గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు పూర్తిగా విఫలతనొందడమేకాక గిరిజనులకు ప్రభుత్వానికిమధ్యఉన్న అంతరం ఎంతగానో పెరిగింది. ఒక్కమాటలో చెప్పాలంటే వీటన్నింటివల్ల గిరిజనుల స్వతంత్రమైన, సమిష్టి సామాజిక జీవనం పూర్తిగా దెబ్బతిని పోయింది.

ఇవన్నీ జరుగుతుంటే గిరిజనులు నిస్సహాయ ప్రేక్షకులుగా ఉండలేదు. గిరిజనులు తమజీవనాన్ని రక్షించుకోవడానికి ఎన్నో తిరుగుబాట్లు, ఉద్యమాలు లేవదీసి ఆ కాలాల్లోని ప్రభుత్వాల నెదిరించి పోరాడినారు. ఇప్పటికీ గిరిజన ప్రాంతాలన్నీ

తీవ్రమైన నిర్బంధానికి గురి అవుతున్నవి. పోరాటస్థాయినిబట్టి నిర్బంధంకూడా అదే స్థాయిలో అమలుజరుపబడుతున్నది. ఈశాన్య భారతంలోని గిరిజన ప్రాంతాలు మిలిటరీ ఉక్కు పాదాలక్రింద నలుగుతుంటే ఇతర ప్రాంతాలలోని గిరిజనులు తీవ్రమైన పోలీసు నిర్బంధానికి గురవుతున్నారు. చాలవరకు గిరిజన ప్రాంతాలన్నీ కల్లోలిత ప్రాంతాలే. ప్రస్తుతం జరుగుతున్న గిరిజనోద్యమాలు స్వభావ రీత్యా మూడురకాలుగా విభజించవచ్చు. అవి i) పోడు వ్యవసాయం, ఆహార సేకరణలాంటి ఆదిమ ఉత్పత్తి పద్ధతులున్నచోట రాజ్యానికి గిరిజనులకుమధ్య పోరాటం సాగుతున్నది. ii) గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు స్థిరపడి స్థిర వ్యవసాయంతో వ్యక్తిగత ఆస్థి సంబంధాలు వచ్చినచోట గిరిజనులకు గిరిజనేతర దోపిడీదార్లకు మధ్య పోరాటాలు సాగుతున్నవి. iii) గనుల త్రవ్వకం, పారిశ్రామికీకరణ జరిగిన ప్రాంతాల్లో గిరిజనులు సామ్రాజ్య వాదానికి, దాని ఏజంట్లయిన గుత్తపెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు.

భారతదేశంలోని గిరిజన ప్రాంతాల్లో ఈ ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మహారాష్ట్ర సిరోంచ తాలూకా "అభుజమార్" కొండ ప్రాంతాల్లో, మధ్యప్రదేశ్ బస్తర్ జిల్లాలో నివసిస్తున్న మరియగొండు గిరిజనుల జీవన పరిస్థితులను పరిశీలించడం జరిగింది. ముఖ్యంగా ఈ కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల జీవన విధానం, సంస్కృతి, పోడు వ్యవసాయ విధానం, స్థిర వ్యవసాయం ప్రవేశపెట్టడంవల్ల వచ్చిన మార్పులు, ప్రభుత్వ గిరిజనాభివృద్ధి కార్యక్రమాలు మొదలైన విషయాలు చర్చించబడ్డవి. సిరోంచ తాలూకా, బస్తర్ జిల్లా గిరిజనుల పరిస్థితులపై ఈమధ్య ఊర్మిళ, రాజారెడ్డి, క్రిస్టొఫ్‌వాన్ హెమెన్ డార్ఫ్ రచించిన "గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయాన్ని రద్దు చేయాల్నా?" (సైన్స్ టుడే, ఏప్రిల్ 1982) అనే వ్యాసంనుండి ఎక్కువభాగం సమాచారాన్ని ఉపయోగించడం జరిగింది.

II

ఇంద్రావతీ నదీలోయ ప్రాంతంలో నివసించే మరియగొండులు అంతర్వివాహ పద్ధతిగల ఒకే తెగకు (Endogamous) చెందిన రెండు గుంపులు—మైదాన ప్రాంతాల్లో నివసించేమరియలు కొండప్రాంతాల్లో నివసించే ప్రజలు. మైదానప్రాంతాల్లో నివసించే మరియగొండులు సిరోంచా తాలూకా మైదాన భూముల్లో వర్షాధార వరి సేద్యం చేస్తూ జీవిస్తారు. కొండప్రాంతాల్లో నివసించే మరియలు "అభుజమార్" కొండల్లో ప్రవహిస్తున్న సెలయేళ్ళ పొడువునా నివసిస్తున్నారు. ఈ అభుజమార్

కొండలు మహారాష్ట్రలోని బ్రహ్మపుర్ అడవిప్రాంతంలో మొదలై మధ్యప్రదేశ్‌లోకి విస్తరించినవి. ఈ కొండప్రాంతం ఎక్కువభాగం పూర్వపు బస్తర్ సంస్థానంలో ఉన్నా ప్రస్తుతం కొంతభాగం మహారాష్ట్రలోకూడా ఉన్నది. 1980 వరకు ఈ అడవి ప్రాంతాలలో మోటార్లు వెళ్ళే రోడ్లుకాని,బండ్లుపోయే మార్గాలుకాని లేవు. కొన్ని కొండ ప్రాంతాలలో వెదురు, టేకు, విప్పచెట్లేగాక అడవిగడ్డి కూడా దట్టంగా విస్తరించి ఉన్నది. 1930 సంవత్సరంలో అభుజమార్ కొండలలో ఉన్న గ్రామాల సంఖ్య 150నుండి 160 వరకు. 2.6చ॥కి॥మీ॥లకు ఒక్క గ్రామం చొప్పున ఉన్నది. ఒక్కొక్క గ్రామంలో జనసాంద్రత 8 కంటె తక్కువ. అప్పటి నుండి ఈ ప్రాంతంలో జనసాంద్రతలో పెద్దగా మార్పురాలేదు.1930లో ఉన్న 11,500జనాభా, 150 గ్రామాలు;1961 వరకు జనాభా 15,000కు, గ్రామాలు 200 వరకు పెరిగినవి. అంటే 40 సంవత్సరాలలో సంవత్సరానికి 0.7 శాతం చొప్పున జనాభా పెరిగింది.

అభుజమార్ గిరిజన కొండ ప్రాంతం భౌగోళికంగా సాంస్కృతికంగా ఒకే లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ పాలన దృష్ట్యా ఇవి రెండు ప్రాంతాలు. ఈ రెండు ప్రాంతాలలో రెండు రాష్ట్ర ప్రభుత్వాల (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్) గిరిజన, అడవి చట్టాలు అమలులో ఉన్నవి. 1978 వరకు భీనకొండ దాని చుట్టుపక్కలున్న గ్రామాల ప్రజల ప్రధాన జీవనాధారం పోడు వ్యవసాయం. పోడు వ్యవసాయంతోపాటు ఆహార సేకరణ, వేటాడ్డం కూడా ఇక్కడి గిరిజనుల జీవనాధార వృత్తులు. దీని ద్వారా ఆహార వినిమయంలో ప్రత్యేకతతోపాటు సమతౌల్యాన్ని కూడా పెంచుకొంటారు.

వర్షాకాలంలో ఆకుకూరలు, దుంపలు, పుట్టగొడుగులు, వెదురు బియ్యం మొదలైనవి సేకరించి తింటారు. వెదురుబియ్యాన్ని ఉడికించి తినడమే కాకుండ మిగిలింది ఎండబెట్టి దాచుకుంటారు. వేసవి కాలంలో వివిధ రకాలైన పండ్లు అడవిలో దొరుకుతాయి. చిన్న చిన్న అడవిజంతువులను ఈ గిరిజనులు విల్లంబులతో సమష్టిగా వేటాడుతారు. అంతే గాకుండా ప్రతికుటుంబంలో పందులను,కోళ్ళను పెంచుకొంటారు. ఇవి సాధారణంగా పెండ్లిళ్ళలో, పండుగలలో తినడానికి ఉపయోగపడతాయి. కొన్ని కుటుంబాలకు కొద్దిపాటి ఆవులు గూడా ఉన్నాయి. వీటిని అడవిలో మేపుకోవచ్చు. కాని వీటి నుండి పాలు పిండరు. ఈ కొండ మరియలకు ప్రక్కనే ఉన్న బస్తర్ జిల్లాలో నున్న తమ తెగ వారితో వివాహ సంబంధాలున్నాయి. వీరు సాధారణంగా తమ నిత్యావసర వస్తువులు – ఉప్పు, బట్టలు, వంట పాత్రలు మొదలైనవి – కొనుక్కోవడానికి బస్తర్ జిల్లాలోని నారాయణపూర్ అంగడికి పోతుంటారు. అక్కడ

వాళ్ళు సేకరించిన కూరగాయలు, పండ్లు మొదలైనవి అమ్మి వాళ్ళకు కావల్సినవి కొనుక్కొంటారు. నారాయణపూర్ అంగడి గిరిజనుల కోసం గిరిజనులచేత (మరియులు, హాలబలు, కొండమరియలు) నిర్వహించబడుతోంది. ఎప్పుడో అవసరమను కొన్నప్పుడే వాళ్ళు కొండల దిగువన గల లాహిరి అంగడికి పోతారు. ఈ అంగడి పూర్తిగా 'తేలి' గిరిజనేతర వ్యాపారస్తుల చేతులలో ఉంది. మహారాష్ట్ర సిరోంచా తాలూకాలోని లాహిరి, పర్మేలి గ్రామాలలో గిరిజనేతర 'తేలి' వడ్డి వ్యాపారస్తులు నిర్వహిస్తున్న అంగళ్ళలో వలె కాకుండా నారాయణపూర్ అంగడి నిర్వహిస్తున్న గిరిజనులకు ఉప్పు, బట్టలు మొదలైన వస్తువుల మార్కెటు విలువ తెలుసు. దీని నుండి వస్తు ఆర్థిక వ్యవస్థ (Kind economy) నుండి ద్రవ్య ఆర్థిక వ్యవస్థ (Cash economy) లోకి మారడంలోనున్న సమస్యలు స్పష్టంగా కనబడుతాయి. పై విషయాలన్నీ అభుజమార్ కొండలలో నివసిస్తున్న మరియా గోండుల సాంస్కృతిక జీవన ఏకత్వానికి ప్రతీకలు. ఇవి అభుజమార్ కొండ ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనుల సాధారణ జీవన పరిస్థితులు.

III

పోడు వ్యవసాయం : గిరిజనుల ఆర్థిక వ్యవస్థలో మార్పులు

భారత దేశంలోని చాలా భాగాల్లో ముఖ్యంగా కొండ, అడవి ప్రాంతాల్లో కేవలం పోడు వ్యవసాయం తప్ప ఏ ఇతర స్థిర వ్యవసాయం చేయడానికి అవకాశం చాలా తక్కువ. నాగా ఆటవిక గిరిజన జాతులకు, అరుణాచల్ ప్రదేశ్‌లోని ఎక్కువ శాతం ప్రజలకు కేవలం ఈ పోడు వ్యవసాయం తప్ప ఇతర స్థిరవ్యవసాయ పద్ధతులు పూర్తిగా తెలియవు. ఈ అస్థిర వ్యవసాయాన్ని (Shifting cultivation) ఆంధ్రప్రదేశ్‌లో "పోడు", మధ్యప్రదేశ్, మహారాష్ట్రల్లో "బేవార్" లేక "పెండా", ఈశాన్య భారత గిరిజన ప్రాంతాల్లో "జూమ్" అని పిలుస్తారు. అడవిలో కొంత భాగం (చెట్లను, పొదలను) కొట్టి అవి ఎండిన తరువాత కాలబెట్టి నేలను చదును చేసి, చెట్లు పొదలు కాలి బూడిద కలిసిన నేలలో విత్తనాలు చల్లి పంట పండించడమే పోడు వ్యవసాయం! మూడు నాలుగు సంవత్సరాల తరువాత ఆ భూమి సారవిహీనమవుతుంది. అప్పుడు ఆ భాగాన్ని వదిలేసి తిరిగి కొత్త ప్రాంతంలో అడవి నరికి కొత్తగా పోడు వ్యవసాయాన్ని మొదలు పెడ్తారు. పోడు వ్యవసాయం చేసి వదిలేసిన భాగాలు

పచ్చని అడవిలో తెల్లటి మచ్చల్లాగా కనపడతాయి. ఒక ప్రాంతాన్ని విడిచి మరో ప్రాంతంలో పోడు వ్యవసాయంచేసే మధ్యకాలంలో పంట పండించి విడిచిన ప్రాంతంలో అడవి దానంతటదే మళ్ళీ పెరుగుతుంది. నిపుణులైన కొందరు శాస్త్రజ్ఞులు, తరచుగా, ఈ విధంగా అడవిని నరికి, కాల్చి వ్యవసాయం చేయడం దుబారాయే కాకుండా వన్య సంరక్షణకు హానికరం కాబట్టి ఆటవిక ప్రాంతాలలోని ఈ విధమైన "అస్థిర" పోడు వ్యవసాయాన్ని పూర్తిగా రద్దు చేయాలంటారు. కాని వీరిలో కొందరు మాత్రం వన్యసంరక్షణను వ్యాపార దృష్టితో చూడడమే గాకుండా, వన్యవనరులపై గుత్తాధిపత్యం వహించాలనుకునే వ్యక్తుల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహిస్తారు. నిజానికి ఎక్కడైతే ప్రజలు వందల సంవత్సరాల కొలది అడవిని నరికి పోడు వ్యవసాయం చేస్తున్నారో అక్కడే సహజ సిద్ధమయిన అడవులు, వన్యవనరులు చాల పెద్ద మొత్తంలో పరిరక్షింప బడ్డాయి. కాని నాగటి – వ్యవసాయం(Plough cultivation) స్థిరపడి అభివృద్ధి చెందిన చోట అడవులు పూర్తిగా నాశమయినవి. పెద్ద మొత్తంలో అడవుల వ్యాపార దోపిడీ వల్ల సహజసిద్ధమైన అడవులు నాశనమవడమే కాకుండా సరిఅయిన వన్యసంరక్షణ జరగక అడవులు నాశనమయినవి. ఈశాన్య భారత గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం క్రింద ఉన్న మొత్తం భూమిసుమారు 455.05 వేల హెక్టార్లు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం క్రింద ఉన్న భూమి 40,000 ఎకరాలు. అంటే మొత్తం అడవిలో 0.3 శాతం. దీన్ని బట్టి చూస్తే అడవులు నాశనమయి పోవడానికి కారణం కేవలం పోడు వ్యవసాయం ఏ మాత్రం కాదు. అయినప్పటికీ తరతరాల నుండి పోడు వ్యవసాయం పై ఆధారపడ్డ గిరిజనుల దుర్భర జీవన పరిస్థితులను, అడవిపై వాళ్ళకున్న పురాతన సాంప్రదాయ హక్కులను నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన ప్రభుత్వం భారత దేశంలోని చాల గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయాన్ని పహితం రద్దు చేసింది.

మహారాష్ట్రలో చంద్రపూర్ జిల్లా, సిరోంచ తాలూకా అడవుల్లో నివసిస్తున్న మరియాగోండు గిరిజనులపై గతఏనిమిది సంవత్సరాల్లో జరిపిన జీవ, ఆర్థిక,మానవ–సమాజ (Biological, Economic, Anthropological)శాస్త్రాల అధ్యయనం వివరంగా తెలియచేసే విషయమేమిటంటే గిరిజనుల సాంప్రదాయిక ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వపు ఆక్రమ ప్రవేశం వల్ల అపార నష్టం కలిగిందని. ముఖ్యంగా సిరోంచా తాలూకా అభుజమార్ కొండ ప్రాంతాలలో, మధ్యప్రదేశ్ బస్తర్ జిల్లా అడవులలో నివసిస్తున్న గిరిజనుల జీవన పరిస్థితులు, పోడు వ్యవసాయం, దీనిస్థానే స్థిర వ్యవ

సాయం ప్రవేశపెట్టడం వల్ల కలిగిన నష్టాలు, ప్రభుత్వ గిరిజన సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు-ఇవన్నీ క్షుణ్ణంగా పరిశీలిస్తే మనకు చాల విషయాలు బోధపడుతాయి.

మహారాష్ట్రి గిరిజన ప్రాంతాల లో1978 సంవత్సరం వరకుకూడా పోడు వ్యవసాయం అక్కడి ప్రజల ప్రధాన జీవనాధారం. 1980లో కూడా మధ్యప్రదేశ్ బస్తర్ జిల్లా సొనాపూర్ అనే కొండమరియల గ్రామంలో గిరిజనులు పోడు వ్యవసాయాన్ని సాగిస్తున్నారు. నారాయణపూర్‌కు దక్షిణాన ఉన్న హండేవాడ అనే మరో గిరిజన గ్రామంలో కూడ పోడు వ్యవసాయం చేసుకోవడానికి అనుమతించబడింది. ఇక్కడ మాత్రం ప్రభుత్వం ప్రస్తుతం గిరిజనుల సహజ జీవన విధానంలో ఎక్కువ జోక్యం కలుగచేసుకోవడంలేదు. ఈ ప్రాంతం కాగితపు పరిశ్రమ గుత్తేదార్ల వ్యాపార దోపిడీ నుండి మినహాయించబడి రక్షిత ప్రాంతంగా పేర్కొనబడింది. ఈ ప్రాంతాలలో సాధారణంగా సుమారు 12 నుండి 14 సంవత్సరాల వరకు చెట్లను పెరగనిచ్చి, వంతులవారీగా నరికి అడవిలో పోడు వ్యవసాయం చేస్తారు. ఒక కుటుంబం సాధారణంగా రెండు హెక్టార్ల భూమిలో ఉన్న అడవిని కొట్టి సాగులోకి తెస్తుంది. ఈ పోడు వ్యవసాయ పద్ధతిలో ప్రధానంగా రెండు అడ్డంకులున్నవి. మొదటిది ; ఒక కుటుంబం తమ జీవనాధారానికి తగినంత భూమిని చదును చేసుకోగలగాలి; అడవి సాంద్రత, అక్కడి చెట్ల చుట్టుకొలత, వాటి పెరుగుదల మొదలైనవి, వాటిని కొట్టి ఆ ప్రాంతంలో సమానంగా పరిచి తొలకరికి ముందు కాల్చడానికి వీలుగా ఉండాలి. రెండవది : చల్లిన విత్తనాలు మొలకెత్తడానికి తగినంత బూడిద పొర ఏర్పడాలి.

పోడు వ్యవసాయం సాగులో ఉన్న ఈ ప్రాంతాలలో ప్రతి సంవత్సరం జనవరి నెలలో ఆ ఊరి పెద్ద అడవిని బయలు పరచడానికి ఒక రోజును నిర్ణయిస్తాడు. ప్రతి కుటుంబ పెద్ద తనకు కావాల్సిన ప్రాంతాన్ని ఎన్నుకుంటాడు. అడవిని కొట్టి బయలు చేసి భూమిని చదును చేసేపనిలో కుటుంబమంతా పాల్గొంటుంది. స్త్రీలు, పని కెదిగిన పిల్లలు చిన్న చిన్న చెట్లను పొదలను కొట్టడంవంటి సులభమైన పనులు చేస్తారు. మే నేలలో కొట్టిన అడవిని కాల్చడానికి మళ్ళీ ఊరిపెద్దే రోజును నిర్ణయిస్తాడు. ఊరంతా ఒకే రోజు తాము కొట్టి బయలు చేసుకున్న అడవిని కాలుస్తారు. అడివిని కాల్చి విత్తనాలు చల్లడానికి మధ్య కాలం ఎక్కువగా ఉండదు. ఆ తరువాత చేలను వన్య మృగాల నుండి రక్షించడానికి అందరు కలిసి అన్ని చేన్లకు ఒకే కంచె

వచ్చేటట్టు ఏర్పాటు చేసుకుంటారు. అడవిని బయలుచేసి పోడు వ్యవసాయానికి తయారు చేసిన భూములలో మొదటి వర్షాలకు చిన్న కొర్రల విత్తనాలు ప్రత్యేకంగా కొంతభాగంలో చల్లుతారు. ఎక్కువ భాగంలో పెద్ద కొర్రలు, ఇంకా కొన్ని చిరు ధాన్యాలు, జొన్నలు మొదలైనవి ఒక ప్రత్యేక పద్ధతిలో చల్లుతారు. చిన్న కొర్రలు తక్కువ కాలంలో వచ్చే పంట. జులై నుండి ఆగస్టు మధ్యకాలంలో పంటవస్తుంది. ఇప్పటి నుండి పెద్ద కొర్రల పంట వచ్చే వరకు (డిసెంబరు, జనవరి వరకు) ఇది ఆహారంగా ఉపయోగపడుతుంది. అయితే జనవరి నుండి పెద్ద కొర్రలు ప్రధాన ఆహారంగా వాడుతారు. ఈ పోడు వ్యవసాయంలో మానవశ్రమ తప్ప పశువులను ఉపయోగించరు. పంట పండిన తరువాత పంటలు కోసుకోవడం, గింజలు రాల్చుకోవడం, ఇంటికి తీసుకొని పోవడం వంటి పనులన్నీ గ్రామస్తులు సమిష్టిగా చేసుకొంటారు. చిన్న చిన్న పోడు వ్యవసాయ క్షేత్రాలలో చిరుధాన్యాలు, జొన్నలతోపాటు చిక్కుడు దోస వంటి కూరగాయలు కూడ పండిస్తారు. ఈ విధంగా పోడు వ్యవసాయం ద్వారా చిన్న చిన్న క్షేత్రాలలో (ఒకొక్క క్షేత్ర విస్తీర్ణం రెండు హెక్టార్ల వరకుంటుంది) పండించిన పంట ఒక కుటుంబానికి సంవత్సరాంతం వరకు సరిపోతుంది. ఇప్పటికీ కొండ మరియలు తాము పండించిన పంటలను వ్యక్తిగత శ్రమ ఫలితంగా కాకుండా సమష్టి శ్రమ ఫలితంగా గుర్తిస్తారు. ముసలి వాళ్ళు, రోగగ్రస్తులు వ్యవసాయ కార్యక్రమాలలో పాల్గొనక పోయినప్పటికి సహజంగా వాళ్ళ తిండి వాళ్ళకు లభిస్తుంది. ఈ గిరిజన సమాజంలోని సభ్యులు ఒక వేళ గిరిజనేతరులిచ్చిన అప్పులతో లేక ఇతర జుర్మానాలతో వేధించ బడ్డప్పుడు అవి తీర్చడానికి గ్రామస్తులంతా సమిష్టిగా బాధ్యత వహిస్తారు. ఈ విధంగా వాళ్ళు ఏర్పరుచుకొన్న సమర్ధవంతమైన సామాజిక భద్రతా వ్యవస్థ వ్యక్తుల మధ్య సత్సం బంధాలు బలపర్చడమే కాకుండా మొత్తం గిరిజన సమాజాన్ని ఐక్యపరిచి ఏ సంక్షోభాన్నైనా ఎదుర్కొనేటట్లు చేస్తుంది. ఈ గిరిజన సమాజంలోనున్న ఈ విశిష్టమైన సహకార పద్ధతికి మూలం పోడు వ్యవసాయ ఉత్పత్తి విధానం, దీనిలో గిరిజనులంతా సమష్టిగా వ్యవసాయ కార్యక్రమాలలో పాల్గొనటమే.

ఇటువంటి పోడు వ్యవసాయం స్థానంలో ఒకేసారి స్థిర వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడంతో, బీనకొండ దాని చుట్టు ప్రక్క గ్రామాలలో నివసిస్తున్న మరియగొండులు పోడు వ్యవసాయాన్ని వదలి స్థిర వ్యవసాయాన్ని చేపట్టడానికి ఇష్టపడడం లేదు. స్థిర వ్యవసాయంతో మాగాణిలో వరి పండిస్తే ఎక్కువ ధాన్యాన్ని ఉత్పత్తి చేయవచ్చుననే

విషయం గిరిజనులకు స్పష్టంగా తెలుసు. కాని వాళ్ళు ఇంకా అతిస్పష్టంగా తెలియ చేసిన విషయమేమిటంటే పోడు వ్యవసాయం నుంచి స్థిరవ్యవసాయానికి మారితే కొత్త పనిముట్లు, ఎక్కువ పెట్టుబడి అవసరం. దీంతో ప్రభుత్వం ఇచ్చే సహాయం పై ఆధారపడడం కూడా పెరుగుతుంది. కాని పోడు వ్యవసాయంలోనైతే ఇవన్ని అక్కరలేదు. కావాల్సినవి ఒక గొడ్డలి, రెక్కల కష్టం మాత్రమే. సంవత్సరం మొత్తం తిండికి చావకుండా ఉండడమేకాకుండా స్వతంత్రంగా,క ఇంకొకరిపై ఆధార పడకుండా బ్రతకవచ్చు. దీనికి విరుద్ధంగా స్థిర వరి వ్యవసాయం ప్రవేశ పెట్టడంవల్ల అభుజ మార్ కొండ ప్రాంతాలలో కూడా వ్యష్టి దృక్పథం ప్రోత్సహించబడింది. కొద్దిగా ఉన్న వరి వ్యవసాయ క్షేత్రాలు వ్యక్తిగత ప్రయివేటు ఆస్తిఅయినవి.

1956 వ సంవత్సరంలో ప్రభుత్వం కొన్ని కొండ మరియు కుటుంబాలను వేనుగున్వారా, కొత్వారా, జాపెల్లి, నూల్వాడ గ్రామాల నుంచి తీసికొచ్చి కొండ క్రింద ప్రాంతాలలో స్థిర పడేటట్లు చేయడానికి ప్రయత్నించింది. ప్రభుత్వం వీళ్ళను ఆకర్షించడానికి ఈ క్రింది సహాయాలను కల్పిస్తామని వాగ్దానం చేసింది.

i) ప్రతి కుటుంబానికి 4 హెక్టార్ల భూమి,

ii) విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు,

iii) ప్రతి వ్యవసాయ కుటుంబానికి ఒక నాగలి, ఎడ్లజత,

iv) మూడు సంవత్సరాల వరి సాగుకవసరమయ్యే ఆర్థిక సహాయం,

v) ప్రతీ కుటుంబం ఒక గుడిసె వేసుకోవడానికయ్యే ఖర్చు.

1970 లో నూతనంగా స్థిర పరిచిన గిరిజన గ్రామల్లో మొరంగల్ కోయిల్, గొట్పాడి, టొడెంగ-గిరిజనుల సాధారణ ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను విచారించి నప్పుడు పైన పేర్కొన్న హామీలన్నింటిలో ఏ ఒక్క దానినైన ప్రభుత్వం అమలు చేయలేదని ఏకాభి ప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ స్థిర వ్యవసాయంతో ఎన్నో సమ స్యలువచ్చి పడ్డవి. మరియ గోండులు వరి వ్యవసాయం చేయడానికి చాలాశ్రమ పడాల్సి వచ్చింది. ముఖ్యంగా కట్టలు పోయడం, విత్తనాలు, ఎరువులు కొనడం. ఇవే కాకుండా రోజంతా పొలాల్లో పనిచేయాల్సి వచ్చింది. అయినప్పటికి వర్షాభావం వల్ల, పంటకు వచ్చే తెగుళ్ళ వల్ల ఫలసాయంలో అనిశ్చితత్వం ఏర్పడింది. దీనివల్ల గిరిజనులు, గిరిజనేతర వడ్డీ వ్యాపారస్తులనుండి ఎక్కువ వడ్డీకి అప్పులు తప్పని సరిగా తీసుకోవాల్సి వచ్చింది. పండించిన పంట తిండికి సరిపోలేదు. దీనితో బీడీ ఆకు

గుత్తేదార్ల వద్ద కూలీలుగా పని చేయాల్సి వచ్చింది. ఈ విధంగా ఏర్పడిన కొత్త ఆహారపు అలవాట్లలో వైవిధ్యం లోపించింది. ఈ గిరిజనాభివృద్ధి పథకాల ఫలితంగా నిస్పృహతో కొన్ని కుటుంబాలు బస్తర్ జిల్లా అడవుల్లోకి పారిపోయాయి. పోగా మిగిలిన కుటుంబాలు తమ పాత జీవనానికి తిరిగి పోవడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, అటవీ శాఖాధికారుల భయంతో పోవడానికి భయపడుతున్నారు. ఈ కార్యక్రమాల వైఫల్యాన్ని ప్రభుత్వ అధికారులు కూడా అంగీకరించారు.

50 సంవత్సరాల క్రితం మైదాన ప్రాంతాల్లో అహేరీ జమీందార్ 1922-24 సెటిల్మెంట్ చట్టం ద్వారా పోడు వ్యవసాయాన్ని ఒకేసారి రద్దు చేసినాడు.1940-42లో డబ్ల్యు. వి. గ్రిగ్సన్ ఈ పోడు వ్యవసాయాన్ని రద్దు చేయటంవల్ల గిరిజనులు అనవసరమైన కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందని తన టూర్ డైరీలో రాసుకొన్నాడు 1930-40 మధ్యకాలంలో వరిపంట వైఫల్యం వల్ల కొందరు మరియలు తమ పాత పోడు వ్యవసాయానికి తిరిగి పోయినారు. మరికొందరు బస్తర్ జిల్లాకు శరణార్థులుగా వెళ్ళినారు. ఆ కాలంలో గ్రిగ్సన్ మరియగోండు గిరిజనులను కలిసినపుడు అక్కడి ప్రతిగ్రామం లోని గిరిజనులు పోడు వ్యవసాయాన్ని పునరుద్ధరించాలని తమ కోరికను విన్నవించుకోవడం జరిగింది. ప్రస్తుతం గిరిజనులు అటవీ శాఖాధికారులు విధించే జుర్మానాల భయంతో తప్పని సరిగా స్థిర వ్యవసాయాన్ని చేస్తున్నారు.

గిరిజనులపై మౌలిక సమాచారం ముఖ్యంగా పోడువ్యవసాయ ఆర్థికఅంశాలు, గిరిజనుల ఆహారపు అలవాట్లు, ఆరోగ్యపరిస్థితులు మొదలైనవి బినాకొండ గ్రామంలో 1981లో మరోసారి క్షుణ్ణంగా అధ్యయనం చేయబడ్డవి. ప్రస్తుతం కాగితపు మిల్లు గుత్తేదార్లు అడివిలోని వెదురు తీసికొని పోవడానికి గిరిజన గ్రామాల వరకు రోడ్లను వేసినారు. దీనితో గిరిజనుల ప్రస్తుత జీవన విధానంపై బయటి ప్రభావం పడటంవల్ల కొన్ని మార్పులు జరిగే అవకాశమున్నది. ఈ గ్రామంలో గిరిజనులపై జుర్మానా విధించే పద్ధతిద్వారా భయపెట్టి పోడు వ్యవసాయాన్ని రద్దు చేయటం జరిగింది.సిరోంచ తాలూకాలోని కొత్త ప్రాంతాల్లో పోడు వ్యవసాయం కొరకు అడివి నరికి నందుకు కొంత మంది గ్రామస్తులకు 60 రూపాయలదాకా జుర్మానా విధించినారు. గిరిజనులు బలవంతాన స్థిర వరి వ్యవసాయానికి మారాల్సి వచ్చింది. ఈ వరి వ్యవసాయానికి కావాల్సిన భూములను తగు విధంగా తయారు చేసుకోవడానికి వాళ్ళు కొంత డబ్బును ఖర్చు పెట్టినారు. ఈ విషయంలో కొండ మరియలు మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న మరియ గోండు గిరిజనుల నుండి సలహాలుకూడా తీసుకొన్నారు. మొదటి వరి పంట

పండించడానికి గత జూన్ మాసంలో రూపాయికి కిలో చొప్పున విత్తనాలు కూడా కొన్నారు. కాని వర్షాభావం, తెగుళ్ళ వల్ల సరియైన పంట పండలేదు. పండిన పంట రెండు నెల్ల తిండికి కూడా సరిపోలేదు.

ఈవిషయం గురించి బినా కొండ గ్రామంలోని మొత్తం 16 కుటుంబాల నుండి సమాచారం సేకరించబడ్డది. వీరికి ప్రక్కనేగల బస్తర్ జిల్లాలో బంధువులున్నారు. అక్కడికి పోయి పనిచేయగా మనిషికి 9 కిలోల కొర్ర జొన్నలు దొరకటం వల్ల, పని జరిగినన్ని రోజులు తిండి కోసం గిరిజనేతర వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లో అప్పుల పాలు కాకుండా ఉండ గలిగారు. ఈ విధంగా ఈ సమస్యనుండి బయట పడ్డారు. అయినప్పటికి కొన్ని కుటుంబాలు వాళ్ళ బంధువుల నుండి 4 : 6 నిష్పత్తిలో ఎంత కాలంలోనైనా తీర్చే విధంగా తిండి గింజలను అప్పుగా తీసికొన్నారు. కొంతమంది గిరిజనులు కాఫీతోటల్లో, అడవిలో పెసురు నరకడానికి కూలీలుగా చేరిపోవడం మొదలు పెట్టినారు. కాని వీళ్ళకు ఇతర కూలీల కంటె తక్కువ కూలీ ఇస్తున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాలలోని గిరిజనులు తమవద్దఉన్న కొద్దిపాటి ధాన్యంతోపాటు, అడవినుంచి సేకరించిన ఆకుకూరలు, దుంపలు, పండ్లు మొదలైన వాటిని ఆహారంగా ఉపయోగి స్తున్నారు. ఈప్రాంతంలోని ఒకగిరిజన సంక్షేమాధికారి వివరించిన ప్రకారం, గిరిజ నులు సాంప్రదాయ పోడు వ్యవసాయాన్ని వదిలి గిరిజన సంక్షేమశాఖ ఇస్తున్న "ఆర్థిక సహాయం"తో స్థిర వరి వ్యవసాయం చేపట్టాలి. కాని కొండ మరియలు క్రితం ఒకసారి వరివ్యవసాయం వల్లవచ్చిన చెడ్డ అనుభవంతో పోడు వ్యవసాయాన్ని విడిచిపెట్టడానికి సిద్ధంగా లేరు. అంతేగాక వరి వ్యవసాయంద్వారా సంవత్సరానికి సరి పోయే ధాన్యం పండుతుందనే నమ్మకంలేదు. ప్రస్తుతం ఆ గ్రామాలలోని గిరిజనులు ఏప్రిల్ నెలాఖరులో గిరిజన కమీషనర్ వచ్చి వాళ్ళ సమస్యలను అక్కడికక్కడే పరిష్కారం చేస్తాడనే ఆశతో ఎదురుచూస్తున్నారు.

1957 లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొండి మరియల పునరావాస కార్య క్రమం పూర్తిగా విఫల మయింది.ఈ మరియ గిరిజనులు తమకొండ ప్రాంతాలనుండి తరలించబడటమే కాకుండా వాళ్ళు తప్పనిసరిగా కొత్త సాంకేతిక విజ్ఞానికి, దానితో పాటువచ్చే కొత్త జీవన విధానానికి విధిగా మారాల్సి వచ్చింది.దీనితో పాటు ప్రభుత్వం వాగ్దానం చేసిన ఆర్థిక సహాయం ఎప్పుడూ సరియైన కాలంలో అందక పోవటం, తరుచుగా పంట నష్టాలు, ఇవన్నీ తరతరాలనుండి వస్తున్న గిరిజనుల సమిష్టి సహ

కార జీవన విధానాన్ని దెబ్బతీయడమే కాకుండా అంతిమంగా వారిని వడ్డీ వ్యాపారస్తుల కబంధహస్తాల్లోకి నెట్టి వేసాయి.

V

అభుజమార్ కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న మరియ గోండు గిరిజనుల జీవన పరిస్థితులను వాటిలో కలిగే మార్పుల గురించి తెలియచేసే ఈ సమాచారాన్ని విశ్లేష ణాత్మకంగా పరిశీలిస్తే మనకు కొన్ని ప్రశ్నలు తలెత్తక తప్పవు.

i) ప్రభుత్వం ఎందుకు గిరిజనులను బలవంతంగా స్థిర వ్యవసాయాన్ని చేపట్టేటట్లు చేస్తున్నది ?

ii) గిరిజనులు పోడు వ్యవసాయం వదిలి స్థిర వ్యవసాయానికి మారాలా ? ఆ మారడం ఏ విధంగా జరగాలి ?

iii) ఈ వ్యవస్థలో ప్రభుత్వం తమ 'అభివృద్ధి కార్యక్రమాల' ద్వారా గిరిజన సంక్షేమాన్ని సాధించ కలుగుతుందా ?

i) ప్రభుత్వం గిరిజనులను స్థిర వ్యవసాయం చేపట్టే విధంగా వివిధ రకాలైన ఒత్తిడులు తేవడానికి గల ప్రధాన కారణం పెట్టుబడిదారీ మార్కెట్ విస్తరణ. పెట్టుబడిదారీ వ్యవస్థ చావకుండా బ్రతకాలంటే నిరంతరం క్రొత్త మార్కెట్ల కోసం అన్వేషించి విస్తరించడానికి ప్రయత్నించాలి. గిరిజన ప్రాంతాల్లో పోడు వ్యవసాయం స్థానే స్థిర వ్యవసాయాన్ని, వ్యక్తిగత ప్రైవేటు ఆస్తిని ప్రవేశపెడితే అక్కడ ఒక ధనిక రైతువర్గం సృష్టింపబడి, పెట్టుబడిదారీ పారిశ్రామిక వస్తువులకోసం మార్కెట్ సృష్టింప బడుతుంది. మన భారత ప్రభుత్వం పెట్టుబడిదారీ వ్యవస్థను కేవలం వ్యాపార లాభార్జన దృష్టిగల గుత్త పెట్టుబడిదారుల, సామ్రాజ్యవాదుల ప్రయోజనాలను రక్షించడానికే పూనుకొంది. కాబట్టి పెట్టుబడిదారీ పారిశ్రామిక వస్తువుల ఉత్పత్తి కోసం కావాల్సిన ముడి సరుకులను దోచడానికి అడవులను తిరిగి అదే పెట్టుబడి దారులకు లేదా వారి ఏజంట్లకు గుత్తకిస్తుంది. అంతేగాకుండ గిరిజనులు వెదురు నరకడానికి కాగితపు మిల్లు గుత్తేదార్ల వద్ద కూలీలుగా చేరక తప్పదు. అప్పుడు వాళ్ళ శ్రమను అతితక్కువ వేతనాలిచ్చి దోపిడీ చేయవచ్చు. వ్యక్తిగత ప్రైవేటు ఆస్తి రావడంతో అంతకుముందు పురాతన కాలంనుండి వస్తున్న సమిష్టి సహకార సంబంధాలు దెబ్బతిని పోతాయి. అంతేగాకుండా కరువులవంటి సంక్షోభాలు వచ్చి

నపుడు గిరిజన సమాజం సమిష్టిగా ఎదుర్కొనేది కాని ఇప్పుడు స్థిర వ్యవసాయంతో వ్యక్తిగత ఆస్తివస్తే ఎవరి బ్రతుకు వారిదై పోవడమేగాక వ్యష్ఠి దృక్పథం బలపడి ఏ సంక్షోభాలొచ్చినా వ్యక్తిగతంగానే ఎదుర్కొనాల్సి వస్తుంది. ఈ విధంగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లో స్థిర వ్యవసాయం ప్రవేశపెట్టడం వల్ల అంతిమంగా పెట్టుబడిదారుల ప్రయోజనాలే నెరవేరుతాయి తప్ప గిరిజనుల కేమాత్రం లాభం కలుగదు.

ii) గిరిజనులు కేవలం పోడు వ్యవసాయానికే అంటి పెట్టుకొని స్థిర వ్యవసాయానికి మారవద్దు అనే వాదం శాస్త్రీయం కాదు. వారు స్థిర వ్యవసాయానికి మారకుండా ఉండడం అసాధ్యం. ఎప్పుడో ఒకప్పుడు మారక తప్పదు. కాని హేమెన్ డార్ఫ్ సూచించినట్లు గిరిజనులు పోడు వ్యవసాయం నుండి స్థిర వ్యవసాయానికి వాళ్ళ సంక్షేమ దృష్ట్యా మారాల్సిందే తప్ప పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మాత్రం కాదు. అదైనా ప్రభుత్వం గిరిజనులపట్ల సమ్మతింప చేసే విధానాన్ని అవలంబించి వాళ్ళను క్రమంగా స్థిర వ్యవసాయానికి మారేటట్లు చేయాలి. గిరిజనులు పోడు వ్యవసాయాన్ని వదిలి స్థిర వ్యవసాయానికి ఒక క్రమమైన ప్రణాళికాబద్ధంగా మారాలంటే ప్రభుత్వం ఆర్థిక, సాంకేతిక సహాయాన్ని వాళ్ళ సమిష్టి జీవనానికి భంగం కలిగించకుండా అందచేయాలి. అది ఒక్క పేదల పక్షం వహించే ప్రజల రాజ్యంలో తప్ప నిరంతరం ఆర్థిక సంక్షోభంలో కొట్టుకుపోయే పెట్టుబడిదారీ రాజ్యాలలో, అందులోనూ అర్థ-వలస, అర్థ-భూస్వామ్య రాజ్యాలలో సాధ్యంకాదు.

ఈ విధంగా గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రణాళికారహితంగా స్థిర వ్యవసాయాన్ని ప్రవేశపెట్టడం వల్ల అది తప్పనిసరిగా గిరిజనులపై నిర్బంధానికి దారి తీస్తుంది. ముఖ్యంగా అటవీశాఖాధికారులు జుర్మానాలు విధించి బెదిరించేవిధానం, ఫారెస్టు గుత్తేదార్ల దోపిడీ, పోలీసు నిర్బంధం ఇందుకు నిదర్శనాలు. భారత దేశంలోని గిరిజన ప్రాంతాలన్నీ, ఆదిలాబాద్ నుండి జార్ఖండ్ వరకున్న మధ్య భారత గిరిజన ప్రాంతాలన్నీ, ఈశాన్య భారత గిరిజన ప్రాంతాలన్నీ ఏదో విధంగా కల్లోలిత ప్రాంతాల రూపంలోనో. మిలటరీ పాలన క్రిందనో తీవ్రమైన నిర్బంధానికి గురవుతున్నవి. గిరిజనులు సంఘటితమై ప్రభుత్వాన్ని ఎదిరించినపుడు వారు నిర్దాక్షిణ్యంగా అణిచివేయబడుతున్నారు. ఇది ఒక ప్రక్క కనిపించే రాజ్యం అణిచివేత విధానం. మరో ప్రక్క వివిధ రకాలైన గిరిజన సంక్షేమ కార్యక్రమాల ద్వారా మధ్యపెట్టడం. ఇది రాజ్యం అనుసరించే గిరిజనులను అనునయించే విధానం (Adopting policy)

ఈ పరిస్థితిలో ప్రభుత్వం చేపట్టిన గిరిజనాభివృద్ధి కార్యక్రమాలన్నీ పూర్తిగా విఫలత నొందక తప్పదు. ఈ పరిస్థితుల్లో నీతి నిజాయితి గల ప్రభుత్వాధికారులు కూడా ఏం చేయలేరు. అంతిమంగా గిరిజనులు క్రూరమైన పేదరికంలోకి నెట్టబడి,వడ్డీ వ్యాపారస్తులచే, కాగితపు మిల్లు గుత్తేదార్లచే దోచుకోబడుతారు.

ఈ రెండు ప్రభుత్వ విధానాలు గిరిజన ప్రాంతాలలో "రాజ్యాధికారాని"కి చట్టబద్ధత కల్పిస్తాయే తప్ప గిరిజనాభివృద్ధి మాత్రం జరుగదు.

iii) ఈ సామాజిక దోపిడి పరిస్థితులలో ప్రభుత్వంచే గిరిజన సంక్షేమం సాధించబడడం అసాధ్యం. ఎందుకంటే "గిరిజన సంక్షేమం, గిరిజనాభివృద్ధి" అని ఎన్ని విషయాలు చెప్పినా ఒకేసారి, ఒకే కాలంలో ప్రభుత్వం ఒకప్రక్క పెట్టుబడిదారుల ప్రయోజనాలను, మరో ప్రక్క నిరుపేద గిరిజనుల ప్రయోజనాలను కాపాడలేదు. రెంటికున్న వైరుధ్యమే దీనికి కారణం. ఈ గిరిజన ప్రాంతాలలో కాగితపు మిల్లులు, కాఫీ తోటలు రావాలంటే గిరిజన జీవితం కల్లోలితం కాక తప్పదు. గిరిజనులు పేదలై దోచుకోబడక తప్పదు. కాబట్టి రెండుకత్తులు ఒకే ఒరలో ఇమడవు.

దీనికి పరిష్కారం, ఉదార స్వభావంతో, సంస్కరణవాద దృష్టితో ప్రభుత్వానికి సూచనలు ఇవ్వడంలోనో లేక గిరిజనుల హక్కుల రక్షణకై ప్రభుత్వానికి మహజర్లు సమర్పించడంలోనొ లేదు. గిరిజనులు దేశంలోని మిగిలిన పేదప్రజలను కలుపుకొని పోరాడి విప్లవం సాధించడం ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకొంటారు.

సంప్రదించిన వ్యాసాలు :

1) Dr Urmila Pingale, N.V. Raja Reddy, Christopoh Van Furerr Haimen dorf — Should shifting cultivation be banned, Science Today, April, 1982

2) Working paper on Political Economy of Tribal Development in India, submitted at the 'National Seminar on Political Economy of Tribal Development' held on April, 10 th and 11 th 1982 at Warangal.

3) Undeclared civil war : A critaque of the Forest policy, April, 1982, Peoples Union for Democratic Rights, New Delhi.

కథ

అల్లం రాజయ్య

భోజనంచేసి తట్టుకుర్చీల కూర్చుండి సిగరెట్టు ముట్టించాడు నారాయణరావు.... బయట ఎండ మాడిపోతోంది... ఎదురుంగ ఎడ్ల కొట్టంమీద బెంగుళూరు పెంకలు మండుతున్నాయి.. ఇల్లు ఎల్లిపోయిన దాని తీర్గున్నది. కలాపి జల్లినోడులేడు. ఊడ్సె టోల్లులేరు.... సిగరెట్టు పొగలాగే మనుసులో ఎన్నో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి.

"దండాలు దొరవారు" అన్నమాట వినిపించింది....ఈ మాట వినక సానొద్దులాయె-సిగరెట్టు పొగల మధ్యనుంచే కండ్లు చిన్నవిచేసి కనుబొమ్మలు ముడిచి అరుగు కిందికి చూసిండు.

ఇద్దరు మనుషులు చేతులు జోడించి నిలుచున్నారు. ఇద్దర్లో ఒకనిది అమ్మోరు మొఖం —ఎర్రగా బక్కగా ఉన్నాడు. పేడిమూతి- నెత్తికి గంపంత రుమాలు జుట్టున్నది-. జబ్బకు వీణ వేలాడుతోంది. రెండవవాడు పొట్టిగా నల్లగా కుదిమట్టంగా ఉన్నాడు. నల్లటి ముఖంమీద మీసాలున్నాయి. నడ్డిముక్కు ఇద్దరికి తిరుమని గౌర నామాలున్నాయి మెడకాయకు విబూది ఏలుతోటి రాసున్నది....నల్లవాని జబ్బకు బుర్ర వేలాడుతోంది.

"బుడుగు జంగ మోల్లముండి- నా పేరు ఈరయ్య-మావోని పేరు దమ్మడు" అన్నాడు ఎర్రటి పొడుగోడు....

"ఓహో గంగని మనమలా ?" అన్నాడు గుర్తుకు తెచ్చుకుంటూ....

"ఔ దొరా!" అన్నాడు దమ్మయ్య....

"ఏం పనిమీదొచ్చినట్టు ?". నారాయణరావు అటెటో చూస్తూ-

"బుడుగు జంగపోల్లకు పనులేముంటయి-తమరి పేరుమీద కథ చెప్పుతం...." వీరయ్య.

"కథలా ! జా-నాట కొడాడాటాడంగ మద్దెలగాన్ని తేలు కుట్టినట్టు గిప్పుడు కతలేందిర్ర- నేను సెక్కర్లున్న...."

"గట్లన కుండ్లి-రెండేండ్ల కింద తమరు పెద్దొర్సాని దినాలకు లేగ నిచ్చిండ్లు.

అన్నదానం వస్త్రదానం చేసిండ్లు- మీ అసొంటోల్లుగట్లంటే మేం ఏడబోవాలె ?''

"నను విసిగించకుండ్లి కతలు గితలు జాస్తనయి" అన్నాడు.

అన్నదమ్ములిద్దరు ఒకల మొఖాలొకరు చూసుకున్నారు.

ఏదో యాదికొచ్చి ఇంట్లకు లేచిపోయాడు. లోపల పందిరి మంచంమీద చిన దొర్సాని కృష్ణవేణి బోర్లాపడుకొని ఏదో పుస్తకం చదువుకుంటోంది....

"ఇగో గపుస్తకాలు చదువొద్దనే నేను చెప్పేది....'' చిర చిర లాడాడు.

కృష్ణవేణి అయిష్టంగానే లేచి నిలుచుండి పైట సర్దుకున్నది.

కృష్ణవేణి లేచిన పందిరి మంచంలో నారాయణరావు పండుకున్నాడు.

కృష్ణవేణికి తను చదువుకున్న రోజులు గుర్తొచ్చినయ్. నారాయణరావు అన్న కొడుకుతో తన పెండ్లి-ఆ తరువాత కాంతారావు చంపబడడం-నారాయణరావు తనను తెచ్చుకోవడం-ఇక్కడ ఉంచుకున్నదన్న పేరు....నారాయణరావుకు మాత్రం రైతులు-సంఘాలు గుర్తొచ్చినయ్.

"ఎట్లుండె బతుకు?యేటా అయ్యగార్లను బిలిపిచ్చిహరికథలు చెప్పిచ్చెటోడు... సిందోల్లతోని భాగోతాలాడిచ్చెటోడు- గోత్రాలోల్లతోని నాటకాలేపిచ్చేటోడు-మాల్లోల్ల తోని పాండవుల కత చెప్పిచ్చెటోడు....వీర ముష్టోనితోని బమ్మం గారి చెరిత్ర చెప్పిచ్చెటోడు మూడేండ్లాయె-ఆటలేదు పాటలేదు. ఏత మొసదీసుకోనిచ్చిండ్లు-ఏమంట భూలచ్చిమికాడ వాళ్లచ్చి మీటింగు బెట్టిండ్లో - అప్పటినుంచి పాటలు ఆటలన్నీ ఆళ్లయేఅయినయ్....ఇదివరకు తను ఆడిచ్చేటోడు...." ఇట్లా సాగుతున్నాయి.

"ఈ పాడుబడ్డ ఇంట్ల నేనుండలేను...." నాలెచూపులు చూస్తూ కృష్ణవేణి చెప్పింది....

ఐంగుళ గట్టియ్యి మంటవ్-నీదేంబోతంది....ఇప్పటికే ఆలం....కొడుకులు'' నారాయణరావు.

బుడుగు జంగాలిద్దరు ఇంటి ముంగట కొట్టంలకూసున్నరు........

"గోడలు గూలిపోతన్నయి. పైసలన్ని ఏంజేసిండో గోడలన్న కట్టిచ్చుకుంట లేడు-'' వీరయ్య.

అబ్బో వీడా! ఉసికెల పాపెరగాడు–మొన్న యాభయెకరాలు కొన్నడంట కొత్త పెళ్లిల కరంటు మోటర్ల పైరవిమీన్నే ఎయిలు సంపాయించుంటడు. అడివి కట్టె పరేసరి–పంచాతుల దండుగులు బందయినయ్‌గని లావోతెనా!'' దమ్మయ్య.

"మెల్లెగ మెల్లెగరా?''

"బాగని ఈడగూడ ఆఖరెత్తు పారెటట్టులేదు.''

"ఇంతే సంగతులు–గాన దండములు–బుర్రలు బలిగేసుడే–రైతులు మన కతలినేటట్టులేదు–సంఘపోల్ల పాటలుదప్ప–మనకా ఆ పాటలు పాడరాదు–దొరలుకతలు చెప్పియ్యరు....''

"నేసంట — ఎందుకు సెప్పరాదు?....''

"ఏమంట సెప్పుతవరా? మనకే మెరికని."

"ఏంది ఎరుకలేంది. నెల్లాల్లాయె తిరుగబట్టి–ఏవూళ్లె జూసిన అద్దం తీర్గ గస్పత్తనే ఉన్నది...."

"ఏందిర గస్పదేది? సాలుసాలు పోలీసోల్లచ్చి హాత్‌కడీలేసి పట్టుక పోతే దెలుత్తది....సాలుసాలు."

"పోతేబోతం–మన కతలినేటోల్లు–మనకు ఇన్నేండ్లు కూడుబెట్టి సాదుకచ్చి నోట్లో సెక్కర్లుంబె మనం....తినేది మొగనిసొమ్ము పాడేది బాలనాగమ్మ పాట–నామంచి గాదన్న–"

"నాలికెండుక పోతంది....గిన్నన్నినీల్లన్నబోసేదిక్కులేదుగదా!ఊరుకగ్గిదగ్గ.."

"ఈన్నేమొ ఊరు బహిష్కరించింది. ఈని పనులన్నీ బందు–కాంతారావును అన్నకొడుకనే గురుత్తంలేకుంట సంపించ్చిండు గాడ్డి కొడుకు – ఆమెమ బయటకి రానియ్యడు. .... పోదాంపా...."

"ఆగురా ! మల్లత్తదేమొ ఆఖరి పారడుగుదాం."

"అడిగినా–ఇగో నేను మరింకే కత జెప్ప...."దమ్మయ్య తెగేసి చెప్పిండు....

"పోనీ నువ్వనే కథే చెప్పుదామనుకో – ఏమంట చెప్పుతవు ? ఎట్ల చెప్పు తవు? కొసేడ మొదలేడ?"

"కొసేంది మొదలేంది. ఖిలావనపర్తిల సూశ్శేదా? దేవయ్య కథే చెప్పుదాం – బలుగురు కొండయ్య – ఏడుగురు మరాఠీలది – బాలవద్దిరాజుది – పసుల బాలరాజుది. కథలుచెప్పంగ – గిది చెప్పుడు సుతారమా?"

"కతలు సెప్పిచ్చేది దొరలు – నువ్వు సెప్పేది దేవయ్య కథంటే చెప్పొద్ద బీకుతరు. అచ్చే పైసలల్లిడిసి పెట్టి – నీ మాటంటె జేలుకాన తయారు"

"జనాలకు నచ్చుతె కడుపుల బెట్టుకుంటరు. మొదటి నుంచి నీ కతలిన్న దెవలు ?"

ఇంతలోకే నారాయణరావు బయటకొచ్చిండు.

"ఇంక బోలేదుర్ర ?"

"ఏడికి బోతముండ్లి ? తిరిగి తిరిగి యాస్టకొచ్చింది. మా కతలు ఇనే నాథుడే దొరుకుతలేడు.... పెద్దు లోకులేమో ?...."

"సరే గాడ్డి కొడుకులకు గమండి బెరిగింది బంచత్– మీకేమేమి కతలొస్తయిరా ?"

వీరయ్య ముందుకు జరిగి – "బాలనాగమ్మ, బబ్బిలికథ, బలుగురు కొండయ్య కథ, ఏడుగురు మరాఠీల కథ, పసులబాలరాజు కథ." ఇట్లా చెప్పుకొచ్చిండు.

చిన్నోడు అందుకని "దేవయ్య కథ–" అందిచ్చాడు.

"సరేగాకథలన్నీ ఇన్న కథలే – మీవోడు చెప్పిందేదో కొత్తగున్నది....వారీ మీరెప్పుడన్న సంగపోల్ల పాటలిన్నరా ? అగో వాటికన్న ఘాటు గుండాలె ఇన్నరా?"

పెద్దోడు ఏదో చెప్పబోయిండు....చిన్నోడు అడ్డొచ్చి "తమరు వింటరుగదా ? ఇంకేడ జెప్పలే – మీతోనే మొదలు...."

"సరె సరె – నేనే పరెషాన్‌లున్న – సూసిండ్లు గద – మందనుకుంటరు దొరకేందని – నా యిల్లు – కొట్టాలు సూస్తిరి గదా ! ముప్పయి రూపాయలిస్త"

"ఇద్దరం నాత్రంత జెప్పాలెగాదుండ్లి...."

"మీ యిష్టమురా ? అలిమా బలిమా ? చెప్పుతె మూడు పానాదులు కాడ...."

"కాసిన్ని మంచినీళ్ళు దొరా" చిన్నోడు.

"దొర్సాని నిదుర బోతంది."

అన్నదమ్ము లిద్దరు బయటకు నడిచిండ్లు.

"వారీ దమ్మ. నీకేమన్న పుర్రెల పురుగు మెసులు తందారా" వీరయ్య.

"లాపోతేంది. నెల రోజుల నుంచి తిరుగుతున్నం - ఎప్పుడన్న ఇసారం జేసినవా ? జనం మన కతలెందుకు చెప్పిత్త లేరొ ? నెల నుంచి తిరుగుతున్నవ్ ఊరూరికి - ఇగో గాలికి ఆకు నేనూగనంటె కలువది. అన్నింటితోపాటు తానూ ఊగాలె...." దమ్మయ్య....

"సావచ్చిందిరా ?" అన్నడు అన్న. అట్లా అన్నాడే కాని మనసులో దేవయ్య కథ మెదులుతోంది.... రాగం ఫోెట్టుతోంది.

ఇద్దరు బయటకు రాగానే పిల్లలు చుట్టు ముట్టారు.

దమ్మయ్య వాళ్ళతో కులాసాగా నవ్వుతున్నాడు....

అట్లా రాగ రాగనే కరంటు హెల్పర్ గుర్తుపట్టి -

"ఏమోయి బుడుగు జంగాలు జబ్బలు జారేసుకొని తిరుగుతండ్లు" అన్నాడు.

"ఏంజెయ్యమంటరు ? మమ్ముల కానినోడెవడు లేడు గదా !"

"మందేమొ కేసులు గీసులని తిరుగుతుంటె మీరేమో పసుల బాలరాజు కథలు చెప్పితిరి. ఆడోల్లు మొగోల్లు దెబ్బలుదింటాంటే మాయల పక్కిరోడంటిరి ...." అన్నాడు.....

"నాలికెండుకపోతంది కాసిన్ని నీళ్ళు బొయ్యరా" పెద్దోడు.

ఇద్దరిని తనింటికి తీసుకపోయాడు. బుర్ర, వీణ ప్రక్కకు బెట్టి గోడ నీడన కూర్చున్నారు....

నీల్లు దాగిండ్లు-దమ్మయ్య కథ చెప్పుతున్నట్లు చెప్పిండు. రాజయ్య దమ్మయ్య మాటల్లో పడిపోయారు.

వీరయ్య గోడపక్క కొరిగిండు-కండ్లు మూసుకున్నాడు. వసపర్తిలో తను మాదిగి సాయిలు ఇంటికి పెండ్లి గురువుగ పోవడం-దేవయ్యను చూడడం - ఆ మాటలు,...ఆ తరువాత సాయంత్రం పోలీసులు రావడం....కొట్టుకోల్లు మొత్తుకోల్లు

అమీన్ పిస్తోలు కాల్వడం – దేవయ్య నెత్తురుమడుగులో పడి పోవటం–శవాన్ని తీసుక పోవడం – మాదుగులు కంటికే ధార మింటికే ధారగా ఏడ్వడం – మరునాడు రాణాపురంలో ఇసుక జల్లుతే రాలని జనం–ఎన్నివేలో–శవాన్నెత్తుకుని ఊరేగింపు–ఊరేగింపుల అరుపులు–శవాన్ని ఆఖరిసారిగా చూడడంకోసం వచ్చిన జనం ఏడుపులు....అందులో పొట్టిగా ఉన్న పిర్రల గట్టయ్య లేచి "ఎందు కేడుత్తర్రా? ఇదేమన్నకొత్తా....కాదు–కాదురారే కాదు–ముమ్మాటికికాదు....నాకెన్నేండ్లు....నాకండ్ల ముంగట సానామంది సానాతీర్ల సావంగ సూసిన–కనిగిసావు గసొంటి సావుగాదు–ఎద్దు బతుకుతది–ఈగ బతుకుతది. పిల్లల గంటధి. కని పందోలె పదేండ్లు బతికేంభాగ్గెం.... నందోలె నాలిగేండ్లు బతుకు....మా అల్లుడు రాయరామడెందుకు సచ్చిండు–మాదిగోల్లను కుప్పేసినందుకు. గిది ఇప్పటి మాటకాదు–పీరడెందుకు సచ్చిండు – భూమెట్ల గుంజు కున్నవన్నందుకు–ఎగులాసపురంల జంజెర్ల రాయమల్లడెట్ల సచ్చిండు–తను నీల్లుమోసి పెంచిన అడివిల మోపెడు పుల్లలేరుకున్నందుకు ? కనుక నేను బతుకతనని నిలబడితె సంపుతరు. బాంచెనంటె–ఆని సేవలు సేత్తే నిన్నేమనరు. కని అట్ల నీనెత్తురు తాగుతరు.... నీ మాంసం తింటరు. అట్లాసత్తవు....ఇంకో సంగతున్నది–ఆడెవడో అమ్మగారు మీనున్నదని సెయ్యిగురుతు బెట్టుకచ్చి ఏమన్నడు–గీ సర్కారుమీది–మీకు భూములిప్పితం జాగలిప్పిత్తం–నాలంజెపియి ఇప్పిత్తమన్నారు–పరంపోగులు దున్ను కొమ్మన్న దేవన్నను తుపాకినేసి సంపిండ్లు–దున్నెటోనికి భూమిగావాలనోన్నిన్ని సంపిండ్లు...."

"ఓ దేవన్నో–నాదేవన్న–మమ్ముల నట్టనడిమిల ఇడిసిపోతివా దేవన్న–నీకు గటుకండి పెడుత రావుదేవన్న–నాపెద్దకొడుకు వనుకున్నగాదు దేవన్న–ముదుగాటి బుక్క–నీకు కొట్టిన గాదు దేవన్న–ఓ దేవన్న" ఒక స్త్రీరాగం తీసుకుంట ఏడుస్తోంది....

"సయిసె–సయిసు–ఏడుత్తె అత్తడా?ఆరుత్తే అత్తడా?" గట్టయ్య.

"నీకెరుక లేదుర గట్టు నాయినా? మన బతుకు తెల్లారి పోయిందిర గట్టునాయినా? ఆళ్ల సేతులకు జెట్టలు సరుప్పలు బుట్టగదురో దేవుడా? ఆళ్ల కొడుగాల గదురోదేవుడా! ఆని నాము సరుక గదురో దేవుడా? ఓ అయ్యలాలా సీరంత నాదేవన్నను సూసిండ్లు గదరా నాదేవుడా? ఆని తలపండు దెచ్చిత్తననుండ్లిరా అయ్యలాలా...."బొచ్చె సరుసు కుంట కనిపిచ్చిన వాళ్ళ మీదల్లా పడి ఏడుస్తోంది....

వీరయ్య ముఖం కమిలిపోయింది. గోడనీడ జారిపోయింది. చుట్టూ చూసిండు ఎవరులేరు....దమ్మయ్య, రాజయ్య కలసి ఎటో పోయారు.... మోకాళ్ల మీద తల పెట్టుకొని కూర్చున్నాడు.

"పిల్లోల్లారా! మాలసిమి పెనిమిటి సచ్చిండు-ఆగిందా?ఆగలేదు .... ఒరే-జాగర్త గినుండ్లి....ఇంటికి పెద్దోడే-మన ఊళ్లల్ల పెద్దోడే కాదన-కని ఇంటి పెద్దోడు సత్తె ఎవుసాయ మాగుద్దారా? దున్నాలే దోకాలె పంట బెట్టాలే-గిదిగంతే...."

ఇంటికి పెద్ద ఒరిగి పోయెనని

ఏడిసి ఫలమేమి-

అయ్యో ఏడిసి ఫలమేమి-తందానో-తానె తందానా, వీరయ్య గొంతులో నుండి రాగం బయటకు పెళ్లింది.

పడమటిదిక్కు సూర్యుడు కుంకాడు ....పక్షులురొద చేస్తున్నాయి.

★ ★ ★

నెల సింతల మీది కచ్చింది. సాకల్ది ఊరు దిరిగి పోయింది.మూడు పానాదుల కాడ సుంకరోల్లిద్దరు తెచ్చేసిన తక్త బల్లమీద వీరయ్య దమ్మయ్య కూచున్నారు.

దమ్మయ్య "తపతప" బుర్రగొట్టిండు. వీరయ్య వీణమీటిండు. ఎడమ చేతి పెద్దనేలు గజ్జెలూగినయ్....

ఆటలాడే పిల్లలు తొక్కిసలాడిండ్లు-వీరయ్య గొంతెత్తిండు.

"అగజానన పద్మార్కం...."రాగం తీగలాగా సాగుతోంది. ఇల్లిల్లు దిర్గింది....

జనాలు ఒక్కొక్కలే సంచి బొంతలు ఈతసాపలు బట్టుకొని మూడుపానాదుల కాడికి రాసాగిండ్లు-కాసేపటకి మూడు పానాదుల కాడ వీరయ్య, దమ్మయ్య సుట్టు జనం నిండిపోయిండ్లు....ఆఖరున సుంకరోడు కుర్చీమోసుకొచ్చిండు. నారాయణ రావొచ్చి కూర్చున్నాడు.

జనంలో గుసగుసలు....

"ఒరే అన్నా! కుంటి గులాపు-కాపులు, పెర్కలు,గొల్ల,సాకలి మంగలి సబ్బండ వర్నాలు వచ్చినట్టే-ఇగకథ మొదలు బెట్టు...." దమ్మయ్య....

"వోరే అందరచ్చిండ్లంటవు-అక్కలాలా సెల్లెండ్లాలా-తల్లులాలా తండ్రులారా! మాకు పిడికెడు బువ్వబెట్టి పాడుమన్నరు. పాడ్తన్నమ్....ఏంకథ చెప్పుమంటవ్....?"

"ఎల్లికి మల్లి బుట్టిందని మల్లికి ఎల్లిబుట్టిందని సెప్పేటిదే సెప్పరాదు...."

"వారీ! నేం జెప్పేకతలు అట్లుంటయనారా?"

"కోప్పడకు నేనంటలేను మందంటండ్లు—"

"ఊరికి దొరవారు దేవయ్యకత సెప్పుమన్నడు."

"సెప్పేదేదో నీవా సెప్పరాదు." మందిలనుంచి....

వీరయ్య గొంతు సవరించుకున్నాడు. వీణమీటిండు–గజ్జెలూపిండు....

"అరె పెద్ద పెల్లి లో ఉత్తరాదిన–

పేరెన్నిక గలపల్లె–నాయనా!"

ఇట్లా కథ మొదలయ్యింది. ఊరు ఎక్కడున్నదో–ఊరు ఎంత సుందరంగా ఉన్నదో చెప్పుకొచ్చిండు. ఊళ్లె బతికే వివిధ వృత్తులవారి గురించి చెప్పుకొచ్చిండు. అందులో రామయ్య, లక్ష్మమ్మ అనే దంపతులగురించి చెప్పుకొచ్చిండు– వారిద్దరికి పుట్టిన రెండవ కొడుకే దేవయ్య.దేవయ్య పసితనంలో ఆటలు–చెప్పుకొచ్చాడు.

కథ సాగుతోంది.మధ్యమధ్యలో దమ్మయ్య పిట్టకతలు చెప్పి జనాన్ని నవ్విస్తున్నాడు–రామయ్య రైతు–అతను భూమికోసం పడే తిప్పలు–దేవయ్య పెద్ద చదువుల కోసం తాలూకాకు బోవడం–అక్కడ చదువు–

ఇది ఇట్లా ఉంతంగ–జంజెర్ల రాయమల్లడనే మాదిగివాని జీవితం–అతనికికొడుకు పుడుతాడు–తలసవరులేదు–దగ్గర్లో ఉన్న అడివికి పోయి కట్టెలు తెచ్చి తాలూకాలో అమ్మి నూనె తెద్దామనుకుంటాడు. అడవిలోకి చౌకి దొరొస్తాడు....ఝాడిచ్చి పురుషాల మీద తంతాడు.

"అరె–గిలగిల తన్నుక తన్నుక

పానం ఒదిలిండా...." అంటూ అతిహృదయ విదారకంగా వర్ణించాడు.... చౌకిదారు అడివి కట్టె అమ్ముకొని జిల్లాల పెద్ద బంగుళ కట్టినట్టు చెప్పాడు....

అది తెలిసిన సదువుకునే పిల్లలు అన్యాయమన్నారు. సచ్చిన శవాన్ని పెట్టుకొని ఊరేగింపు తీశారు....అందులో దేవయ్య ఉన్నాడు....

ఆతరువాత దేవయ్య మీద కేసులు బెట్టడం–పోలీసులు కొట్టడం....దేవయ్య బేల్ (జామీను) మీద విడుదల కావడం....

"ఆపుండ్లిరా?" నారాయణరావు గర్జించాడు-దమ్మయ్య బుర్రాగింది-వీరయ్య వీణ ఆగింది. రాగ మాగింది....

"మీరు పాడేవి గిదా! నీతల్లి -పోలీసోల్ల పిలిపిచ్చి...."నారాయణరావు తిడుతున్నాడు....

నిశ్శబ్దం-నారాయణరావు చెప్పులు తొడుక్కున్నాడు....సుంకరోడు కుర్చీ మలిసిండు....ఇద్దరు సుంకరోల్లు తక్తు బల్ల ఎత్తుకున్నరు....

అంతలోనే జనంలో కలకలం...."ఈరయ్య,దమ్మయ్య ఆపకుండ్లి-చెప్పుండ్లి" అన్నారు....

ఎవరోపోయి పెద్ద బండి తెచ్చిపెట్టిండ్లు-

వీరయ్య,దమ్మయ్య బండిమీదకూర్చున్నారు. మళ్ళీ రాగం సాగింది.—

దేవయ్య సదువు విడిచిపెట్టి సంఘాలు బెట్టిండు. దేవయ్య గురించి దమ్మయ్య పిట్టకతలు చెప్పిండు....

తెల్లారే సుక్కపొడిచేదాక కథ సాగింది. జనం ఏడ్చిండ్లు నవ్విండ్లు, పండ్లు గొరికిండ్లు, పిడికిల్లు బిగించిండ్లు-

కథయి పోయింది....

కరంటు హెల్పర్ రాజయ్య వీరయ్యను కౌగలించుకున్నాడు....

అప్పటి కప్పుడు తోచినంత జమచేసిండ్లు-యాభయి రూపాయలైనాయి ....

"బిడ్డా! మంది కతసెప్పుండ్లి -మీకు బువ్వ కరువుండది-" అన్నాడో ముసలోడు....

నారాయణరావు పాడుబడిన ఇండ్లల్లో కాలుగాలినపిల్లోలె- నిప్పుతొక్కిన కోతోలె ఎగురుతూనే ఉన్నాడు....

సుంకరోల్లిద్దరు మల్లి కథకాడికచ్చిన సంగతి నారాయణరావుకు తెలియదు.

నీళ్ళ తగవు

- తుమ్మేటి రఘోత్తమరెడ్డి

తోక తెగిన కుక్క ఏడ్చినట్టు .. బాయిమీది సైరన్ కూసింది. సమ్మక్క అదిరిపడి మేల్కొంది. ప్రక్క మంచంపై నర్సయ్య నిద్రపోతున్నాడు. "ఆరు గంటల సీటే వున్నట్టున్నది.... నిద్రపొడుగాను...." అనుకుంటూ మంచం దిగింది. దిగి మంచంక్రిందకమ్మిన కోడిపుంజును రెండుచేతుల్తో దొరకపుచ్చుకుని "నీ ఇంట్లపీని గెల్ల.... 'రాను రాను రాజుగుర్రం గాడిద అయినట్టు' రోజూ అయిదింటికే గూసేది ఇన్నొద్దులు-ఆఁ నెరీ అద్వాన్నఁవై పూర తెల్లారిసంక గూత్తాందే....పుంజో....పుంజు" అని విసురుగా బయటకు తెచ్చి పారేసింది. పూర్తిగా తెల్లవారిందని కాబోలు ! పుంజుకాస్తా సిగ్గుపడి రెక్కలు 'టపటప' లాడిస్తూ కోళ్ళతో కల్సిపోయింది.

చుట్టు మట్టు గుడిశెల వారి పొయ్యిలు దాదాపు అయిపోవస్తున్నయ్. "బొగ్గు పొయ్యి అంటేత్తె ఏడ అందుద్ది?" అని అనుకుంటూ గుడిశెలోకి నడిచింది కట్టెల పొయ్యి అంటించింది. బియ్యం కడగడానికి నీళ్ళకోసం చూస్తె కుండల్లో నీళ్ళులేవు. "మాదిగోనికి సెప్పుకరువన్నట్టు బాయి పనోనికి నీళ్ళ కరువు." అని త్రాగే మంచినీరుంటె పోసి బియ్యం కడిగి పొయ్యి మీదుంచింది. "అయినాల్సెంగానే అయింది" అంటూ.... ఊడిన సిగముడివేసి....చీరను గోచీ బిగించి,రెండు చేతుల్లో రెండు కుండలు తీసుకుని గుడిశెలోంచి బయటకు వస్తోంటె దర్వాజ 'ఘట్కు' మని తలకు తగిలింది. "దర్వాజింట్ల మన్నువడ" తగిలి తగిలి పానం దీత్తాంది. అనుకుంటూ రోడ్డుకు ఆవల ప్రక్కగా వున్న సూపర్ వైజర్సు క్వార్టర్సుకు పరుగందుకుంది. గుడిశెల్లో ఆడవారంతా....నీళ్ళు మోసుకుంటూ....బొగ్గు పొయ్యిలు ఇళ్ళలోకి తీసుకు పెట్తూ,వున్నారు. పందులూ, కుక్కలూ అంతకంటె హడావిడిగా అటూ ఇటూ తిరుగుతున్నయ్. చీకట్లు పారిపోయినా పొగ చీకట్లు గుడిశెల వదిలిపోలేదు. వుక్కిరి బిక్కిరి చేసే పొగ వాతావరణం. మాణిక్యం కట్టిన మసిపాతలా తూర్పు ఆకాశం....

ప్రతి క్వార్టర్ గేటులోంచి నీళ్ళకోసం ఆడాళ్ళు వస్తూ పోతూ వున్నారు. కాస్త దూరపు క్వార్టర్‌కి వెళ్తే జనం వుండరని సమ్మక్కకి అనుభవం నేర్పింది. రోడ్డుకి మొదటి వరుస కాకుండా రెండో వరుసలో వున్న హెడ్ ఓవర్ మేన్ భగవాన్‌రావుగారి క్వార్టర్ కర్రగేటు తెరుచుకొని లోపలికి వెళ్ళింది. ఎవరూ లేరని తట

పటాయించింది. పొయ్యిమీది బియ్యం జ్ఞాపకం వచ్చేసరికి కుళాయికి కట్టివున్న రబ్బరు గొట్టం ఊడబెరికి కుండ కుళాయి క్రింద పెట్టింది. అంతే .... దాదాపు పన్నెండేళ్ళ కుర్రాడొకడు, గోడచాటుకు వున్న కూరగాయ మొక్కల్లోంచి బయటకు వచ్చి చేతులకు అంటిన బురదను రూపిస్తూ.... "ఏఁవన్న మనిషివేనా ? అడుగుడు లేదు. గిడుగుడు లేదు. పైపు పూడదీకి నీళ్ళు పడ్తాన్నవ్!.... తాత సొమ్మున్నట్టు!" అన్నాడు.

"ఆఁ.... అంత సొమ్ము.... కుండెడు నీళ్ళు పట్టుక పోతె ఏఁవైద్ది" పని తొందర కాస్త నోటిదురుసు మనిషి, పైగా అడిగింది పిల్లవాడు. పిల్లాడిలో తర తరాల దొరతనపు వారసత్వపు అహంకార వుంది. దానికి ఆ మాత్రపు మాటలు 'అగ్నికి ఆజ్యంపోసినట్టు' అయింది. ఎంతైనా....అప్పుడూ ఇప్పుడూ దొరబిడ్డే !

"ఏఁవైద్దా ?'' అంటూ పరుగున వచ్చి రెండు కుండల్ని ఒక్క తన్ను తన్నాడు. ఊహించని ఈ హఠాత్పరిణామానికి నిశ్చేష్ఠ అయింది సమ్మక్క. పగిలిన కుండ పెంకుల వంక చూసింది. శరీరంలోని రక్తం అంతా ముఖంలోకి వచ్చింది. కళ్ళు తూర్పు ఆకాశంలా ఎరుపెక్కాయి.

"నీ కాళ్ళు కాలిపోనుగదరా.... నీ ఇంట్ల మన్నువడ గదరా.... బంగారంవసోంటి కుండల నాశినం జేత్తివెగదరా.... బొమ్మంబెపోదును కదరా గాడ్డికొడకా !'' అంటూ తిట్లకి లంకించుకుంది. పిల్లాడు దవడలు కరుసుకుని నిలబడ్డాడు, పిల్లాడి తరఫున తల్లి వకాల్తా పుచ్చుకుని అంది. "అసలిక్కడికి రమ్మన్నదెవడే ?'' 'రమ్మన్న దెవడే ?' అనేసరికి సమ్మక్క తోక తొక్కిన త్రాచులా లేచింది.

"ఎవడా....? నీ మిండెడు'' అని విస విస నడవసాగింది సమ్మక్క. గేటు దగ్గరికి రాకముందే ఇంట్లోంచి.... "బద్మాష్‌ముండా....అగు:....'' అంటూ హెడ్ ఓవర్ మేన్ భగవాన్‌రావుగారు నాలుగు అంగల్లో వచ్చాడు.కొద్దిగా భయపడి నిర్లక్ష్యంగా అలాగే నిలబడింది.

"ఎవడే....? దానిమిండెడా....? మల్లోసారిఅంటె నాలికకోస్తా బాంచోత్" ఆయన హెడోవర్ మేన్ తీర్గనే అన్నాడు.

"మల్ల కోసేటోడు మూలత్తడు" గేటు తెరుచుకొని బయటకువస్తూ అంది సమ్మక్క. కోపం ఆగని భగవాన్‌రావు సమ్మక్కసిగ అందుకున్నాడు. సిగ అందుకొనే సరికి ఏడుస్తూ తిట్లు మొదలెట్టింది. అప్పటికే చుట్టు ప్రక్కల నీళ్ళకోసం వచ్చిన

ఆడాళ్ళు గుమికూడారు. డ్యూటీనుంచి ఇళ్ళకు వస్తున్న కార్మికులుకూడ కొందరు గుమికూడారు. మాటమాట పెరిగింది. సహజంగానే క్వార్టర్ల వారంతా ఒకవైపు, గుడిశెల వారంతా ఒకవైపు విడిపోయారు.

"రేపట్నించి ఎవతన్నా నీళ్ళకు ఇటు మొఖాన అత్తెకాళ్ళిరగ్గొడతమ్"

"కుండలు పలగ్గొడుతమ్."

"తన్ని తలెంటికలు కొరిగిత్తం"

గుడిశెలవారికి ఇంకా వూరుకుంటె లాభం లేదనిపించింది.

"సరే! అచ్చినప్పుడు అవన్ని సేత్తురుగాని" అన్నారు.

పట్టి పట్టిగ మాట్లాడితె తల్కాయలెగుర్తాయ్. ఆఁ...." అన్నారు. అలా వార్నింగు ఇచ్చేసి గుడిశెలవైపు వచ్చారు. కొందరు "సన్మక్కదేతప్పు" అన్నారు. పాపం! వాళ్ళకి నీళ్ళు అత్యవసరం.

"అసలు మనగుడిసెల్ల నాలుగు పంపులుంటె-గ వాడు మనల్ని ముట్టుకునె టోడా....?" అన్నదిక్కడ సారక్క.

"గవి లేకనే కద! వాల్లిట్టం అచ్చినట్టు సేత్తాంద్రు సేపుతాంద్రు" అంది మరో ఆవిడ...."గింత మందివున్నా ఏంలాభం??నాలుగు పంపులు పెట్టియ్యక పెయిరి." అన్నది ఒకామె మగవాళ్ళనుద్దేశించి.

"ఆఁ....గవాల్లే జెట్టి తరు....ఈడికి నాలుగుసార్ల ఎజెంటాఫీసుకు దరుకాత్తులు పట్టుక పెయింద్రు" అన్నారు, "వాడుతీసి గంగల పారేసిండు" అన్నారు నిరసనగా.

ఆలాఅనుకుంటూనే... ఆపూటకు సరిపడా నీళ్ళకోసం దూరంగావున్న బొగ్గు బాయిలమీదికి వెళ్ళారు. వెళ్ళినీళ్ళు తెచ్చుకుంటుంటె.... సూపర్‌వైజర్స్ క్వార్టర్సు లోంచి సూపర్‌వైజర్సు.... సూపర్‌వైజమ్మలు చూస్తే 'పుట్టచెదిరిన చీమల్లా' లేబరు భార్యలు నీళ్ళు మోసుకుంటున్నారు. వాళ్ళకి కసితీరుతున్నట్టు అన్పించింది.

"లంగముండలు అచ్చినోళ్ళచ్చినట్టు కుక్కోన పేన్లొగె నీళ్ళు పట్టుక పోవద్దూ"

"కూలికిఅచ్చి! పాలుగ్గుదిరినట్లు చేస్తే ఏమైద్ది"

"ఇప్పుడుచూడు! సీతమ్మ సెరలు" అన్నారు.

"నాల్రోజులు గట్లమోసుకుంటె మదం వంగుద్ది" అనికూడ అన్నారు.

"గప్పుడుగని ....ఇవ్రోజులు మన పంపులకు పట్టుకపెయిన సుఖం తెల్వాది"

"రేపు గియాలను కుక్కలోల్లె వురికి రాకపోతేసూడు" ఒకామె జోస్యంకూడ చెప్పింది. అలా వాళ్ళు తలోరకంగ అనుకుంటూనేవున్నారు....

వీళ్ళు— పిల్లా .... పీచూ .... ముసలీ ముతకా అనకుండా తలోచెంబో,తలోకుండో ఏదిబడితే అది అందుకొని ఆరోజుకుసరిపడా నీళ్ళు మోసుక వస్తున్నారు. "అన్నం కాలేదేం....?"అని గర్‌గుర్‌లాడితే పున్నపళంగ కుండలు తమ గుండ్లపై పగలడం ఖాయం అనుకొని కొంతమంది కార్మికులు తమతమ బాయిలమీది 'కేంటిన్ల' కేసి డొక్కపై కిల్లేసుకొని పరిగెత్తుతున్నారు.

కొంతమంది ఆడాళ్ళు నీళ్ళుమోస్తూ.... మోస్తూనే ఓనిర్ణయానికి వచ్చారు-వచ్చిందే తడవు మిగతవారికి చెప్పేశారు కష్టంలో వున్నారు గనుక వెంటనే ఒప్పేసుకున్నారు. అలా .... నీళ్ళు మోసేవారు మోస్తూనే... వంటలు చేసేవారు చేస్తూనే.... నిర్ణయాన్ని బలపరచారు. ఇందు అందు అనక, సందుగొందులనక ....ఎక్కడ ఏ ఇద్దరు ఆడాళ్ళుకల్సినా మాట్లాడే విషయం ఒకటే అయింది. సూపర్‌వైజర్సు క్వార్టర్సుకేసి కోపంగా చూస్తూనే 'ఆను' కొయ్యల్లా తిరిగారు ఒకరింటికి ఒకరు. ముప్పయ్యారు జుట్లు కల్సివున్నా.... మూడుసిగలు కల్సివుండవని ఏ 'మనువు' మనవడు అన్నాడో గాని.... ఇప్పుడు వీళ్ళ ఒక్కటయే తీరుచూస్తే 'కటుక్కున' నాలిగ్గొరుక్కునేవాడు. వెంటనే పార్టీమార్చిన రాజకీయ పక్షిలా రాగంమార్చేవాడు. చీకటి పడేసరిగ్గాని దాధాపు మూడువందల మంది ఆడాళ్ళు సర్వ సన్నాహాలు పూర్తి చేసుకొని యుద్ధంచేసే తీరు, సమయం ప్రకటించిపారేశారు. అప్పుడు ఎవరిళ్లకు వారు ఆరాత్రి ఎంత తొందరగ గడుస్తుందా అని ఆదుర్దపడుతూ వెళ్ళారు.

ఆ రాత్రి బురద గుంటల్లో తగినన్ని నీళ్ళులేకపోవడం చూసి విచారించిన పందులు....'ఏదో ప్రళయం రాబోతుంది' అని అనుకున్నాయి.

అనుకున్నట్టు ఆరోజు కాస్తా ఆలశ్యంగా తెల్లవారినట్లు అన్పించింది. అప్పటికే—గుడిశెలకి, క్వార్టర్సుకి మధ్యనగల తారురోడ్డుపై నిరంతరం కిరకిరలాడ్తూ వెళ్ళే బొగ్గులారీల శబ్దాలు గుడిశెల దగ్గరకు రాగానే ఆగిపోతున్నాయి. రోడ్డుపై .... ఎదురుగా దృశ్యాన్ని చూస్తూ వెళ్తున్న కార్మికులు 'వారేవా' అనుకుంటున్నారు. రోడ్డుకి అటూఇటూ కిలోమీటరు పొడుగున బొగ్గులారీలు ఆగిపోయినయ్. రావాల్సిన ఎంబాసిడర్‌లు, ఫియట్లు ఒక్కొక్కటి లారీలప్రక్కనుంచి వచ్చి జనసమూహం

దగ్గరికి వచ్చి ఆగిపోతున్నాయ్.ఎదురుగా రోడ్డుపై దృశ్యాన్నిచూసి కనుబొమలు ముడి వేస్తున్నాయి. రాగిచెంబు గుండ్లు వినాయకుడి బొజ్జలు. ఆ విధంగా బావుల మేనేజర్లు, డివిజనల్ సూపరింటెండెంట్లు కార్లుదిగి యింకారావాల్సిన ఎజెంటునళ్ళద్దాల కారుకోసం ఎదురు చూస్తున్నారు. ఆ వుదయపు ఎండ వారికి బాధగానే వుంది.

రావాల్సిన దొర రానేవచ్చాడు. అందరి కార్లకంటె ముందుకి వురికించి ఆపాడు డ్రైవరు. మేనేజర్లు, డి. ఎస్‌లు అటు పరుగెత్తిసంత పన్చేశారు. ఏజెంటు కారు ఆగటానికిగల కారణంబేంవిటాయని చూడగా...వందలసంఖ్యలో కుండలూ...బిందెలూ రోడ్డుపై అనంతకోటి లింగాల్లా అగుపించాయి. అపరకాళికల్లా అంతకురెట్టింపు సంఖ్యలో ఆడవాళ్ళువున్నారు. కింది అధికారులని (క్రింది అంటె రోడ్డుపైకాదు) చూసి కారు దిగాడు. దిగి ఆడవాళ్ళవంక చూశాడు. వాళ్ళంతా కలిసి కోపంతో చూసేసరికి కాస్త జడుసుకున్నాడు. జడుసుకోవడానికి కారణం కూడావుంది. ఏంవంటె? ఆయనకు మరాఠీ, ఇంగ్లీష్ తప్ప మరోభాష మాట్లాడినా, తిట్టినా అర్థంకాదు. కనుక, ప్రక్కనున్న డి. యస్ రామారావ్ వంక'విషయం ఏంవిటో' కనుక్కోమన్నాడు. వచ్చిన ఆడాళ్ళని (మూగివున్న) చూస్తూ "ఏంవిటి మీకు? ఏంకావాలి?" అని ప్రశ్నించాడు. అందుమీదట "నీళ్ళుకావాలి! కన్పించటంలేదూ?..." అని అన్నారు ఆడాళ్ళు.

"నీళ్ళుకావల్సివస్తే...ఇదేంపని...? ఎజెంటాఫీసుకు రావాలి. వచ్చి అప్లికేషన్ పెట్టాలిగాని" అన్నాడు మరో డి.ఎస్.

"అప్లికేషనా...? నాలుగు సార్లు పెట్టింద్రయ్యా...? నాలుగు సార్దుపెట్టింద్రు ఈడికి నాలుగు ఎండ్లాయె...గట్ల అప్లికేసన్లుపెడ్తానేవున్నారు. మేంజూస్తనేవున్నం. పంపులు అచ్చిందిలేదు," అంది ఒకామె.

"ఎట్లనమ్మా నాల్రోజులు ఓపిక పట్టాలి తొందరపడితె ఎట్ల"..అని ఓడి.యస్ అన్నాడోలేదో... ఒకామె 'గంయ్'.. మంటు ముందుకు వస్తూ ఎజెంటును చూస్తూ.. ఓపికేపట్టావన్నా...బాంచెన్,ఓపిక...ఆం...అదే..?మీరచ్చి నాల్రోజులు గాక ముందే వుండటానికి కోటర్సులు..." అంటె

"పంటెమీద గాలిపంఖలు" అన్నారు.

"పాయకాండ్లు " అంటె "తానాల అర్రలు" అన్నారు.

"కార్లు...." అంటే- "మోటారుసైకిళ్ళు" అన్నారు.

మరోకామె మరింత కోపంతో ముందుకు వచ్చి...."గట్ల మన్ను, మశానం, దుబ్బ, దూలి అనకుంట ఏదివడితే అది మీకు ఇయ్యొచ్చు గని....అరువమోటుకట్టం సేసినందుకు మాకు బిందెడు నీళ్ళ సౌలత్ సూడరు. ఆఁ" అంది.

"మా మొగలేమొ, తల్లి కడుపులకు పెయినట్టు పుట్టెడు బండ కిందికి పోయి సచ్చిన సావెరుగక, బతికిన బతికెరుగక, నెత్తురు సెఁవుటజేసి, లారీలకు లారీలు, వాగిన్లకు వాగిన్లు బొగ్గు తవ్వి తీత్తంటె గింత నెనరు లేదు?"

"నీళ్ళ మోసి.... మోసి మా రైకలు బుజాలమీద సినిగి కాయలు గాసినయ్"

"అదె....? మీ ఇంట్ల పీనుగులెల్ల! మీరే సేత్తాంఁడ్రా బాయిల పని మీ పెండ్లాలె సుఖపడన్నా?" అంటూ ఒకామె కుండతో డి.ఎన్‌ను కొట్టబోయినంత పన్చేసింది.

"వెయిలకు వెయిలు పెట్టి మీకు.... మీ పెండ్లాలకు ఆటలాడుకోను, ఈతకొట్టు కోను కట్టించుకోవచ్చుగని మా గుడిసెల్ల గీనాలుగు మంచిళ్ళ పంపులు వెట్టిత్తె మీ సొమ్మంత ఒడుత్తానుర్ల....?" అంది ఒకామె.

"ఏమిటి....? వీళ్ళంత చెప్పేది" అన్నట్టు ఏజెంటు డి. ఎన్. వంక చూశాడు. 'నీళ్ళకోసం అంటె పంపులకోసం కోప్పడుతున్నారని, ఎడాపెడా తిడుతున్నారని చెప్పే సరికి....'అసలే ఉప్పు చింతపండు పెట్టి తోమిన రాగి చెంబులాంటి ముఖం మరింత ఎరుపెక్కింది.

"వీళ్ళకిప్పుడు పంపులు పెట్టిస్తమని మాటిస్తె....రేపు క్వార్టర్సు కావా లంటారు...." అన్నాడు ఏజెంటు.

"మరిప్పుడు ఇక్కడనుంచి ముందురేమోగాని వెనక్కికూడ వెళ్ళనిచ్చేట్టులేరు" అన్నాడు ఓ మేనేజరు.

మేనేజర్లు, డి.యస్.లు, ఏజెంటు కలిసి అటుబడి, ఇటుబడి తర్జన బర్జనల్ గావించి చివరికి గత్యంతరం లేక "పెట్టిస్తాం" అని ఒప్పేసుకున్నారు.

"అట్లంటె కలువది....రేపుగీయాల్లకల్ల పంపులుపొయ్యాలె" అన్నారు కొందరు. "అవును పొయ్యాలె" అన్నారు అందరు.

"ఇప్పుడంటె ఇప్పుడెట్ల అయితది....? దప్పి అయినప్పుడే బావి తవ్వ కుంటామా....? ఓ నాల్రోజులు ఓపిక పట్టండి. సర్వేవాళ్ళు రావాలె. కొలతలు

తీసుకపోవాలె. షైపులు పంపిస్తే అప్పుడు ఫిట్టర్సు వచ్చి ఫిట్ చేస్తేగాని నీళ్ళురావు. ఎట్ల తొందరపడితే! ఉడికేంతవరకు ఆగినోళ్ళు చల్లారేంతదాక ఆగలేరా....?" అంటు ఓ మేనేజరు లౌక్యంగా మాట్లాడాడు. ఆడవాళ్ళంత ఒకరినొకరు చూసుకున్నారు."సరె"నంటె"సరె"అనుకున్నారు."మాటతప్పితెమాత్రం మర్యాదదక్కదు" అని ఆఖరుసారిగా చెప్పేశారు."ఓకే. అమ్మా ఒప్పుకుంటున్నాం కద" అంటు కార్లెక్కారు.

అప్పుడు రోడ్డుమీది కుండలు 'గుసగుస' నడిచాయి. కార్లు నీరసంగా కదిలాయి....అలా మూడొందలమంది ఆడాళ్ళు కలిసి నీళ్ళు సాధించుకున్న వైనం వేలాది కార్మికులకి కార్మికుల భార్యలకి గొప్ప ఉత్తేజం ఇచ్చింది.

రెండో రోజు తెల తెల వారుతోంది....'బుడ....బుడ' చప్పుడు చేస్తూ పంపుల్లోంచి నీరు పడ్తుంటె....ఆడాళ్ళ కళ్ళల్లో విజయగర్వం....పరుచుకుంటున్న వెలుగులాగ.....

★

సవరణ

గత సంచికలో అనివార్యమైన సాంకేతిక ఇబ్బందులవల్ల ఎన్నో తప్పులు దొర్లాయి. ముఖ్యంగా చివరి అట్టమీద 'సృజన వద్ద దొరికే పుస్తకాలు' అని ప్రచురించబడడానికి బదులు 'సృజన ప్రచురణలో కొత్తపుస్తకాలు' అని ప్రచురించబడింది. ఆ జాబితాలో సృజన ప్రచురణలు మాత్రమే కాక క్రాంతి ప్రచురణలు, ఏ. బి. సి. ప్రచురణలు కూడా ఉన్నాయి. ఈ పొరపాటుకు క్షమించవలసిందిగా ఆయా ప్రచురణ కర్తలకు, పాఠకులకు విజ్ఞప్తి చేస్తున్నాం.

—'సాహితీమిత్రులు'

దృక్పథం :

రగులుకొనే రాక్షసి బొగ్గు - జాతుల సమస్య

---కె. ప్రసాదరావు

(గత సంచిక తరువాయి)

ప్రస్తుత చర్చలో ప్రధానాంశం కాకపోయినప్పటికీ, "ఉపజాతి" అనే విషయాన్ని గూర్చి ఇచ్చటనే ముచ్చటించడం మంచిదనుకుంటున్నాను. ఇంగ్లీషులోని "నేషన్" "నేషనాలిటీ" అనే పదాలు రెంటికీ తెలుగులో "జాతి" అనే రాస్తున్నాం. ఒక జాతి తన ప్రభుత్వాన్ని కూడ కల్గియున్నప్పుడే ఇంగ్లీషులో "నేషన్" అనే పదానికి సరి అయిన అర్థమొస్తుందనీ, అలా ప్రభుత్వాన్ని ఇప్పటికీ ఏర్పరచుకోలేని జాతులను ఇంగ్లీషులో "నేషనాలిటీ" అంటారనీ, ఇంతవరకు "నేషనాలిటీ" అనే పదానికి తెలుగులో సరి అయిన పదం వాడుకలోకి రాలేదు గనుక "ఉపజాతి" అనే పదం అందుకు సరితూగుతుందనే ఉద్దేశ్యంతోనే ఇటీవలి రాజకీయ సాహిత్యంలోకి తీసుకొని రాబడిందని ఓ మిత్రుడు చెప్పగా విన్నాను. ఉపజాతి అనేపదం ఇటీవలనే, అదికూడ విప్లవ సాహిత్యంలోనే వాడుకలోకి వచ్చిన మాట నిజం. ఇంతకు ముందు కూడ అది వాడుకలో ఉందేమో నాకు తెలియదు.

తెలుగు సంప్రదాయంలో "ఉప" అనే పదాన్ని ఏదో ఒక దానిలో విలీనం కాగా తన అస్తిత్వాన్ని కోల్పోయే సందర్భాలలో వాడుతున్నాం. ఉదాహరణకు నది- ఉపనది. గోదావరికి ఎన్నో ఉపనదు లున్నాయి. అవన్నీ ఆ నదిలో కలిసిన తరువాత అంతకుపూర్వపు అస్తిత్వాన్ని కోల్పోయి గోదావరిలో లీనమయిపోతాయి. అలానే గుణాలలో ఒకటిగానూ, పరిమాణంలో స్వల్పంగానూ, ఉంటి ఒకే అవసరాన్ని తీర్చేవాటికి కూడ "ఉప" జోడించడం ఉంది. ఆహారం- ఉపాహారంలాగ,

కాని నేషన్‌కు, నేషనాలిటీకీ మధ్య అలాంటి తేడాను సృష్టించగలమా ? 1929 లో కామ్రేడ్స్ మెషకోవ్, కోవల్‌చుక్ ఐగ్గై రాలకు జవాబురాస్తూ కామ్రేడ్ స్టాలిన్ రాసిన ఈ దిగువ విషయాన్ని గమనిస్తే ఆ రెండు శబ్దాలకూ మధ్య అలాంటి తేడాను ఊహించడం ఎంత అపహాస్యమో బోధ పడుతుంది.

"రష్యన్ మార్కిస్టులకు ఎంతో కాలంగా జాతులకు సంబంధించిన

సిద్ధాంతం వుంది. ఆ సిద్ధాంతాన్ననుసరించి జాతి అంటే, ఒకే భాష, ఒకే భూభాగం ఒకే ఆర్థిక జీవితం, జాతీయ సంస్కృతికి చెందిన విశేషమయిన రూపాలను వ్యక్తపరిచే ఒకే మానసిక ప్రవృత్తి అనే నాలుగు ప్రధాన లక్షణాలను సంతరించుకొని, చారిత్రకంగా పరిణామం చెందిన, స్థిరమయిన మానవ సముదాయము. మనకు తెలిసిన మేరలో ఈ సిద్ధాంతానికి మన పార్టీ అంతటా సర్వ సమ్మతమైన ఆమోదం వుంది."

"ఈ సిద్ధాంతాన్ని లోపభూయిష్టంగా మీరు భావిస్తున్నారనడానికి మీ ఉత్తరాలే నిదర్శనం. అందుకే జాతి కుండాల్సిన నాలుగు ప్రధాన లక్షణాలకు తోడుగా, దానికి మాత్రమే చెందిన ప్రత్యేక రాజ్యాంగ యంత్రం కూడ వుండాలి అనే ఇతర లక్షణాన్ని జోడించాలని మీరు ప్రతిపాదించారు. ఆ అయిదవ లక్షణం లేకుండా జాతి అనేది లేదు, వుండదని మీ భావం."

"జాతి" అనే దానికి, నూతనమయిన అయిదవ లక్షణాన్ని జోడించాలనే భావం యిమిడివున్న ప్రతిపాదనకు చెందిన మీ యోచన చాల తప్పనీ, ఆచరణరీత్యా గాని, రాజకీయరీత్యాగాని, సిద్ధాంతరీత్యా గాని అది సమర్థనీయం కాదనీ నేను భావిస్తున్నాను."

"మీ యోచన ప్రకారం మిగిలిన వాటితో పొత్తు లేకుండా స్వంత రాజ్యాంగ యంత్రాన్ని కల్గియున్న వాటినే జాతులుగా గుర్తించగలం. అలాంటి స్వతంత్రమయిన రాజ్యాంగయంత్రం లేక అణచబడియున్న వాటిని జాతులుగా పరిగణించరాదు. అంతేకాదు దౌర్జన్యాలకు దుర్మార్గాలకు వ్యతిరేకంగా అణచబడుతున్న జాతులు కొనసాగించే పోరాటాలను, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వలస దేశం ప్రజలు చేసే పోరాటాలను, జాతీయ ఉద్యమం, జాతీయ విముక్తి ఉద్యమం వగైరాలకు భిన్నమయినదిగా పరిగణించాలి."

"అలాంటి అసందర్భపు నిర్ణయాలకు దారితీసే యోచనను శాస్త్రీయమయిన యోచనగా పరిగణించజాలమనేది స్పష్టము." 1

కాబట్టి నేషన్, నేషనాలిటీ అనే ఇంగ్లీషు పదాలకు తెలుగులో వేరువేరు పదాలు ఎలా రాయాలి అనే ప్రయత్నంలో లేనిపోని గందరగోళం లోకి దిగడం మంచిది కాదు. అభివృద్ధి చెందిన జాతులు, అభివృద్ధి చెందే క్రమంలో

బాగా వెనుకబడివున్న జాతులు ఎన్నోదేశాలలో ఉన్నట్టే మన దేశంలోనూ ఉన్నాయి. ఇప్పటికీ ట్రైబల్ జీవితపరిధిలోనే జీవిస్తున్నవారు మన దేశంలో అనేకులున్నారు. అలాంటివారు నివసిస్తున్న కొన్ని ప్రాంతాలలోని అడవులలో బొగ్గు, ఇనుము వగైరా గనులు ఆరంభంకావడంమూలంగా పెంపొందసాగిన పెట్టుబడిదారీ ఆర్థిక విధాన ప్రాబల్యానికి అచ్చటి ట్రైబల్ జీవితవిధానపు పునాదులన్నీ పటాపంచలై పోతూ ఇంత వరకు అనేక తెగలకు నిలయంగా ఉన్న ఆప్రాంతపు రాజకీయ భవిష్యత్తు ఏమవు తుంది? ఆ తెగలసమ్మేళనం ఏరూపుతీసుకుంటుంది? అనేప్రశ్నలు కొన్ని ప్రాంతా లలో ఇప్పటికీ తీవ్రంగా ఎదురవుతున్నాయి.

తగినన్ని పుస్తకాలు దగ్గిర ఉంచుకోగల స్థితిలోనూ, మంచి లైబ్రరీల సదు పాయాన్ని పొందగలిగిన స్థితిలోనూ ప్రస్తుతం నేనులేను గనుక పుస్తకంపేరు, రచయితపేరు స్పష్టంగా ఉదాహరించలేక పోతున్నానుగాని, భారతదేశంలోని జాతుల సమస్యపై మార్క్సిస్టు దృష్టిలో విపులీకరించి రాసిన ఒక రష్యన్ రచయిత అలా ఇంకనూ అభివృద్ధి చెందని చాల వెనకబడి ఇప్పటికీ ట్రైబల్ పరిధిలోనే జీవిస్తున్న వాటిని సహితము నేషనల్ గ్రూప్స్ అని రాసినట్లు గుర్తు అలాంటి దానికి ఏదో తగిన తెలుగు పదాన్ని వెతుక్కోవడం మంచిదిగాని, ఈ"ఉపజాతి" పదం లేని పోని అపార్థాలకు దారి తీస్తుందని నాఅభిప్రాయం.

చారిత్రక క్రమంలో అలాంటి గ్రూప్స్ అన్నిటికీ, పరిస్థితులు పరిపక్వమై నప్పుడు ఆధునిక జాతులుగా రూపొందగల (పొటెన్షియాలిటీస్) శక్తిసమర్థతలు ఉంటాయి. ఏదోఒకనాడు అవన్నీ పరిపక్వమైన జాతులుగా రూపొందడంఅనివార్యం. ఆక్రమంలో అవి ఎన్ని మార్పులకు గురిఅవుతాయి అనే ప్రశ్న వేరు. ఇచ్చట గమనించాల్సిందల్లా, ఒకే భాషమాట్లాడుతూ ఒకే భూభాగంలో నివసిస్తూ ఒకే సంస్కృతి కలిగిన ప్రతి జన సమూహమూ ఈనాడు అది ఎంత వెనకబడిఉన్నప్పటికి పెట్టుబడి దారీ ఆర్థిక సంబంధాలు బలపడేక్రమంలో అది ఆధునిక జాతిగా రూపొం దక తప్పదు అని మాత్రమే. ఈసందర్భంగా కామ్రేడ్ స్టాలిన్ చెప్పిన ఈక్రింది విషయాలను జ్ఞప్తిలో ఉంచుకోవడం అవసరం.

అయితే, జాతీయతకు మూలఅంశాలయినభాష, భూభాగము, ఒకే సంస్కృతి వగైరాలు ఆకస్మికంగా రాలిపడలేదు. పెట్టుబడిదారీ విధానపు పూర్వకాలంలోనే

అవి ఒక పరిణామక్రమంలో అస్థిత్వాన్ని పొందాయి. కాని అప్పట్లో ఆమూల అంశాలు అతిప్రాథమికావస్థలోనే వున్నాయి. మహాఅయితే అప్పటికి అవి పరిస్థితులు అనుకూలించినప్పుడు, భవిష్యత్తులో ఒకజాతిగా రూపొందడాన్ని సుసాధ్యం చేయగల శక్తి మాత్రమే. జాతీయ మార్కెటును, ఆర్థిక, సాంస్కృతిక కేంద్రాలను కల్గి పెంపొందుతున్న పెట్టుబడిదారీ విధానపు కాలంలో మాత్రమే అలాజాతిగా రూపొందించడాన్ని సుసాధ్యం చేయగల శక్తి వాస్తవిక రూపంతీసుకుంది." 2

ఇక సురాగారి పుస్తకం పై శ్రీబాల గోపాల్‌గారి విమర్శకు సంబంధించిన వివరాలను పరిశీలించుదాం. ఈశాన్య భారతంలోని జాతుల పోరాటాలన్నిటినీ సురాగారి పుస్తకం సమర్థిస్తుంది. ఒక్క అస్సాం ప్రజలపోరాటాన్ని మినహాయించి మిగిలిన పోరాటాలన్నిటినీ బాలగోపాల్‌గారు కూడ సమర్ధిస్తునే ఉన్నారు. వారికున్న వ్యతిరేకత కేవలం అస్సాం ప్రజల పోరాటం పట్లనే. ఆపోరాటాన్ని సమర్థించినందుకే వారు సురాగారికి జాతి ఉధ్యమాల పట్ల 'వీక్‌నెస్' ఉందంటున్నారు. అంటే విచక్షణ లేకుండా అన్ని జాతులు ఉద్యమాలను సురాగారు సమర్థిస్తున్నారనీ, అది మార్క్సిజానికి విరుద్ధమనీ బాలగోపాల్‌గారి భావం. అంతేకాదు జాతుల ఉధ్యమాల పట్ల మార్క్సిస్టులకుండాల్సిన వైఖరి అనే పేరుతో వారభిప్రాయం ఇలారాశారు.

"........అయితే మర్క్సిస్టు దృక్పథంలో జాతి ఉద్యమాలకు ఒక విశిష్ట స్తానం లేదు. అన్ని జాతి ఉద్యమాలు సమర్ధనీయంకావు? అన్నీ వ్యతిరేకించవలసినవి కావు ప్రతి జాతి ఉద్యమానికి ఒకప్రధానమైన వర్గ స్వభావం ఉంటుంది అదే ఆ జాతి ఉధ్యమం పట్ల మార్క్సిస్టుల వైఖరిని నిర్దేశిస్తోంది."

(1981 అగస్టు సృజన 5వ పేజీ - 2వ పేరా 3వ పంక్తినుండి)

అదే సృజన 15వ పేజీ రెండవపేరాలో శ్రీ బాలగోపాల్‌గారు ఇలారాశారు.

"నాగా, మిజో, త్రిపురజాతులప్రజలు తమశత్రువును గుర్తించారు.పోరాటం చేస్తున్నారు."

"ఈ రెండు ఉద్యమాల (త్రిపుర, అస్సాం) విభిన్న వర్గ స్వరూపం సురాగమనలోకి రాలేదు."

వారు మరొకచోట ఇలా రాశారు.

"అస్సాం బూర్జువా వర్గం చిన్నదే. కాని ప్రభుత్వ పెట్టుబడి (బురాక్రటిక్

కాపిటల్) మీద ఆధారపడి పెరగడం అలవరుచుకున్న ఈదేశపు బూర్జువా వర్గాలకు పెరగడం ఎంతోకాలం పట్టదు. ఈ అస్సామీ బూర్జువా వర్గం తమరాష్ట్రంలోని వనరులపై ఆధిక్యతను సంపాదించిన భారత బడా బూర్జువా వర్గాన్ని నిరసిస్తోంది. స్థానిక వనరులపై తన అధికారం పెంచజూస్తోంది."

(1981 ఆగస్టు సృజన_16వ పేజీ 2వ పేరా)

వారింకా ఇలా అన్నారు.

"....అయితే మనదేశం బూర్జువా వర్గం గట్టిగా పోరాటం చేయడానికి ఇష్టపడదు (ఒక్క ప్రజలతో తప్ప) గతంలో సామ్రాజ్య వాదులతోనూ చేయలేదు. తరువాత భూస్వాములతోనూ చేయలేదు. అందుకే అస్సాం ప్రాంతీయ బూర్జువా వర్గం బడా బూర్జువాలను పూర్తిగా ఎదిరించే స్వాతంత్ర్యం కోరడంలేదు. సి. పి. యమ్. వారి "వేర్పాటు" ఆరోపణ అసత్యమని అస్సాం ఉద్యమకారులు ఘోష పెడుతున్నారు. ఈ ఘోష అబద్ధపు ఘోషకాదు. పచ్చినిజం. అంతటి తెగింపు ఈదేశ పాలక వర్గాలకు లేదు. తమది సాయుధ పోరాటం కాదనీ, తాము అహింసా వాదులమనీ, గాంధేయులమనికూడా ఘోష పెడుతున్నారు. ఏనాడో ఆలోచించటం మానేసిన సి. పి. యమ్. మేధావులు ఈ మాటలవి నమ్మకపోవచ్చు గానీ, ఇదికూడ పచ్చినిజం. ఎంత పచ్చి నిజమంటే గాంధీ నడిపిన "స్వాతంత్ర్య పోరాటం" నిజస్వభావం తెలిసినవారికి అస్సాం ఉద్యమం స్వరూపం గురించి మరేమీ చెప్పనక్కరలేదు. అస్సాం బూర్జువా వర్గానికి కావలసింది : తమప్రాంతపు వనరుల మీద తమ అధికారం పెరగడం. అస్సాంలో పండించే తేయాకు మీద అమ్మకంపన్ను తమకే దక్కాలనీ, అక్కడి బావులలోని నూనె మీద 'రాయల్టీ' పెరగాలనీ, అస్సాం జనపనార తమ మిల్లులకే దక్కాలనీ ఇవేవారి కోరికలు."

(1981 ఆగస్టు సృజన-17వ పేజీ_3వ పేరా 5వ పంక్తి నుండి)

సురాగారి పుస్తకాన్ని విమర్శిస్తూ రాసిన బాలగోపాల్‌గారి వ్యాసంనుంచి పైన పేర్కొన్న భాగాలన్నీ అస్సాం పోరాటాన్ని వారు వ్యతిరేకించటానికి గల ప్రధాన కారణాలను సూచిస్తాయి. పై కారణాలనే ఆసరాజేసుకొని అస్సాం ప్రజల పోరాటాన్ని వ్యతిరేకించడానికి వ్యక్తిగతంగా సిద్ధంకా వచ్చునేమోగాని ఆభాగాలన్నీ జాతుల ఉద్యమాలపట్ల మార్క్సిస్టు వైఖరిని నిర్దేశిస్తాయని చెప్పడం మాత్రం దుస్సాహసం.

పైన పేర్కొన్న వాటిలో ఎక్కువ భాగాలను మార్క్సిజం నిరసిస్తుందనికూడా నా భావం ఒక్కొక్క దానినే తీసుకుందాం.

"మార్క్సిస్టు దృక్పథంలో జాతి ఉద్యమాలకు విశిష్టస్థానం లేదు" అనే విషయాన్ని మార్క్సిజం ఎంతమాత్రమూ అంగీకరించదు. అది ఎలాగో 1981 డిసెంబరు సృజనలో శ్రీయుతులు పృథ్వీగారు చక్కగానే విపులీకరించారు. అంతేకాదు, మార్క్సిస్టు మహోపాధ్యాయులు స్టాలిన్, లెనిన్‌లు రాసిన ఈ క్రింది విషయాలు సామాజిక పరిణామక్రమంలో నిర్దిష్టమయిన ఆర్థికపరిస్థితిలో మానవులు విభిన్న జాతులుగా సంఘటితపడడమూ, తిరిగి మరో నిర్ధిష్టమయిన ఆర్థికపరి స్తితిలో ఆ జాతులన్నీ సమీకృతమై విశ్వమానవ జాతిగా రూపొందడమూ అనివార్యమనీ, ఆ పరిణామక్రమాన్ని తప్పించడం అసాధ్యమనీ తెలియజేస్తున్నాయి. కామ్రేడ్ స్టాలిన్ ఇలా అన్నారు.

"జాతి అనేది కేవలం చరిత్రకు సంబంధించిన వర్గీకృతాంశమే (కేటగిరీ) కాదు. అది చరిత్రకు సంబంధించి నిర్దిష్టమయిన శకానికి చెందిన వర్గీకృతాంశము. ఫ్యూడలిజాన్ని తీసివేసి, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందేక్రమమే ప్రజలంతా జాతులుగా సమీకృతమయిన క్రమంకూడ. ఉదాహరణకు పశ్చిమ యూరపు పరిస్థితి అలాంటిదే. ఫ్యూడల్ అనైక్యతపై విజయం సాధించి, పెట్టుబడిదారీ విధానం దిగ్విజయంగా పురోగమిస్తున్న కాలంలోనే బ్రిటిషువారు, ఫ్రెంచ్‌వారు, జర్మన్లు, ఇటాలియన్లు తదితరులు జాతులుగారూపొందారు." 3

లెనిన్ ఇలా రాశారు ;

జాతులసమస్యకుసంబంధించి అభివృద్ధిచెందుతున్న పెట్టుబడిదారీ, విధానంలో రెండుధోరణులు ద్యోతక మవుతాయి. ఒకటి: జాతీయజీవితము, జాతీయ వుద్యమాల జాగృతి, పలువిధాల దౌర్జన్యాలకు వ్యతిరేక పోరాటాలు, జాతిప్రభుత్వాల అవతరణ. రెండవది : విభిన్న జాతులమధ్య సర్వ విధాల సంపర్కము లేర్పడుటలో తీవ్రతరాభివృద్ధి, జాతీయ అవరోధాల నిర్మూలన, ఆర్థిక జీవిత మంతటిలో రాజకీయాలు— సైన్సు వగైరాలలో అంతర్జాతీయ సమైక్యత లేర్పడుట."

"ఆ రెండు ధోరణులు పెట్టుబడిదారీ విధానం యొక్క ప్రపంచ వ్యాపిత సూత్రాలు. మొదటిది పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధికి చెందిన ఆరంభదశలో అధి

పత్యం వహిస్తుంది. రెండవది పెట్టుబడిదారీ విధానం పరిపక్వమయి, అది సోషలిస్టు సమాజంలోకి పరిణామం చెందే దిక్కుగా పయనిస్తున్న దశకు సంబంధించిన లక్షణాలను విశదీకరిస్తుంది." 4

కాబట్టి ఏమరపాటున కూడ మార్క్సిస్టు దృక్పథంలో విశిష్టస్థానం లేదన లేము. డిసెంబరు, 1981 సృజనలో శ్రీ పృథ్వీగారికి జవాబురాస్తూ ఈ పొరపాటును సర్దుకో ప్రయత్నించి బాలగోపాల్‌గారు ఇలా రాశారు.

"శ్రామికపోరాటం మార్క్సిస్టు దృక్పథంలో ఎప్పుడూ సమర్థనీయమే. దాని ఎత్తుగడలతోగాని - ఆమాటకొస్తే వ్యూహంలోగాని పొరపాట్లున్నా దాన్ని మార్క్సిస్టులు వ్యతిరేకించరు మిత్రభావంతో విమర్శిస్తారు. ప్యారిస్ కమ్యూన్ పట్ల మార్క్స్ అవలంబించిన వైఖరి దీనికొక ఉదాహరణ. ఈ విశిష్టస్థానం మరే ఇతర ఉద్యమాలకు లేదు. ఇతర ఉద్యమాలను, వాటివర్గ స్వభావాన్నిబట్టి, సమర్థించడం లేక మిత్రభావంతో విమర్శించడం, లేక వ్యతిరేకించడం జరుగుతుంది. నా ఉద్దేశ్యం ఇంత మాత్రమే ఈ అవగాహనే సురా పుస్తకంలో లోపించింది "అవి జాతి ఉద్యమాలు కాబట్టి సమర్థించాలి అని సురా ఎక్కడా అనకపోయినా ఆ అభిప్రాయం పుస్తకంలో అడుగడుగునా కన్పిస్తుంది. అందుకే ప్రత్యేకించి జాతి ఉద్యమాలకు మార్క్సిజంలో విశిష్టస్థానం లేదని గుర్తు చేయవలసి వచ్చింది."

శ్రీయుతులు పృధ్వీబాలవిపులంగా రాసిన విషయాలు చూసిన తరువాత కూడ ప్రతి అంశాన్ని శాస్త్రీయంగా పరిశీలించాలనే బాలగోపాల్ లాంటివారికి పైసమర్థన శోభించదు. అని చెప్పవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను.

"అన్ని జాతి ఉద్యమాలు సమర్థనీయంకావు" అని చెప్పడమే వారి ఉద్దేశ్యమన్నారు. బాగానేఉంది. "ఇతర ఉద్యమాలను వాటి వర్గస్వభావాన్నిబట్టి సమర్థించడం లేక వ్యతిరేకించడం జరుగుతుంది" - అని అన్నారు. అదీ ఒప్పుకుందాం. అయితే ఇచ్చటచర్చనీయాంశం జాతులపోరాటాలు. జాతులపోరాటాలను వర్గస్వభావం నుండిచూడటమంటే వారుచెప్పే అర్థమేమిటి? వారివ్యాసము నుండి పైననేనుపేర్కొన్న భాగాలలో ఈ సందర్భంగా వారు చెప్పే అర్థం స్పష్టమవుతుంది. అస్సాం ఉద్యమం బూర్జువా ఉద్యమం అనీ, భారత బడా బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా అస్సాం వనరులపై అస్సాం బూర్జువా వర్గం తన ఆధిపత్యాన్ని నెలకొల్పుకోడానికి జరుగుతున్న

పోరాటమనీ, అదే ఆ పోరాటాన్ని వ్యతిరేకించడానికి కారణ మన్నట్టుగా వారు రాశారు. వారి వాదనను నూటికి నూరుపాళ్ళు సరిఅయినదేనని ఒప్పుకున్నప్పటికీ, మార్క్సిజం ప్రకారం ఆ పోరాటాన్ని వ్యతిరేకించాలని ఎలా రుజువు చేయగలరు? మార్క్సిస్టు సాహిత్యంలో అలాంటి దాఖలాలు కనిపించవే. ఫలానాజాతి ఉద్యమానికి బూర్జువావర్గ స్వభావముంది అనేపేరుతోగాని ఫలానాజాతి ఉద్యమం బూర్జువాఉద్యమం అనే పేరుతోగాని వ్యతిరేకించవలసివస్తే ఆచరణలో ఏజాతిఉద్యమాన్నీ సమర్థించలేం. ప్రజాస్వామిక విప్లవాలకు రష్యా విప్లవానంతరం నాయకత్వం వహించే పాత్రను బూర్జువా వర్గం వదులుకుంది. గనుక ఇకముందుజరిగే జాతుల పోరాటాలకు కార్మిక వర్గమే నాయకత్వం వహించవలసి ఉంటుందేమో. అది వేరు సంగతి గాని లెనిన్, స్టాలిన్‌ల కాలంలో జరిగిన జాతి ఉద్యమాలన్నిటికీ నాయకత్వం పెట్టుబడుదారులదే. ఆ ఉద్యమాలన్నీ ఫ్యూడలిజానికీ సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా జరిగిన బూర్జువా ఉద్యమాలే. సామ్రాజ్య వాదయుగానికి మార్క్సిజాన్ని అన్వయించి జాతుల ఉద్యమం పట్ల స్పష్టమయిన వైఖరిని రూపొందించుకున్నది కూడా వారి కాలంలోనే. వారు రూపొందించిన జాతుల సిద్ధాంతంలో, బూర్జువా ఉద్యమం అనే పేరుతోగాని, బూర్జువా నాయకత్వమనే పేరుతోగాని, బాలగోపాల్‌గారు అస్సాంనాయకత్వ పోరాటరూపాలను పరిహసించిన రీతిలోనే సాధారణంగావుండే బూర్జువా పోరాటరూపాల పట్లగల భిన్నాభిప్రాయంతోగాని, ఏజాతి ఉద్యమాన్నీ నిరసించిన దాఖలాలు కనిపించవు. పైపెచ్చు బూర్జువా ఉద్యమాలయినప్పటికీ, బూర్జువా నాయకత్వం కిందనే అవి కొనసాగుతున్నప్పటికీ ఆ పోరాటాలను సమర్థించాలని చెప్పిన ఉదాహరణలు కొల్లలు.

"వెనుకబడ్డ దేశాలకు చెందిన సాధారణ ప్రజానీకంలోని అత్యధికభాగం, పెట్టుబడిదారీ ఆర్థిక సంబంధాలకు ప్రతినిధులుగావున్న రైతాంగమే. అందువల్ల ప్రతిజాతి ఉద్యమమూ బూర్జువాజాతి ఉద్యమంగానే వుంటుంది అనడంలో అణుమాత్రంకూడ సందేహించాల్సిన పనిలేదు." 5

కామ్రేడ్ స్టాలిన్ ఇలా రాశారు

"........కార్మిక వర్గ విప్లవంపై ఆధారపడి యుండటం ద్వారానూ, దానితో సంబంధం కలి యుండడం ద్వారానూమాత్రమే జాతులసమస్య పరిష్కరించబడగలదనీ, పశ్చిమదేశాల విప్లవ విజయానికి బాట సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగేవలస, ఆధీన దేశాలలోని విముక్తి వుద్యమాలతో విప్లవాత్మక సంబంధాన్నేర్పరచు

కోవడంతో కూడి ఉందని లెనినిజం రుజువుచేసింది. సామ్రాజ్యవాద యుద్ధం, రష్యా విప్లవం దాన్ని ధృవీకరించాయి." 6

ఆయన ఇంకా ఇలారాశారు.

"సామ్రాజ్య వాదపు నిర్బంధం అమలులో వున్న పరిస్థితులలో జాతుల ఉద్యమపు విప్లవలక్షణాల వ్యక్తీకరణకు కార్మికవర్గపుమూల లక్షణాలు(ఎలిమెంట్స్), విప్లవకరమయిన లేదా రిపబ్లిక్ కార్యక్రమము, ప్రజాస్వామిక పునాది వగైరాలు ఆ వుద్యమాలలో తప్పనిసరిగా వుండితీరాలని భావించరేము. ఆఫ్ఘనిస్తాన్ స్వాతంత్ర్యంకొరకు ఆఫ్ఘనిస్థాన్ అమీర్ సాగిస్తున్న పోరాటం, అమీర్, అతని అనుచరులు రాచరిక వాదభావాలతో ఉన్న వారైనప్పటికీ, ఆ పోరాటం సామ్రాజ్య వాదాన్ని దుర్బలపరచి, చిన్నా భిన్నంచేయ తోడ్పడుతుంది గనుక ఖచ్చితంగా విప్లవకర పోరాటమే."

"ఆ విధంగానే కెరిన్స్కీ, సెంతెలీ, రెనాడెల్, షిడిమాన్, చెర్నోవ్, దాన్, హెండర్సన్, క్లైనెస్ వగైరా "డెస్పరేటు" ప్రజాస్వామిక వాములు, "సోషలిస్టులు" "రివల్యూషనరీలు", రిపబ్లికన్లు" సామ్రాజ్యవాద యుద్ధకాలంలో కొనసాగించిన పోరాటాలు అభివృద్ధి నిరోధకమయినవి. ఆ పోరాటాలు సామ్రాజ్యవాద విజయానికి నగిషీలు చెక్కి తోడ్పడేవి కావడమే అందుకు కారణం. ఆ కారణంగానే ఈజిప్ట్ వర్తకులు, బూర్జువా మేధావులు, ఈజిప్ట్ స్వాతంత్ర్యం కొరకు సాగిస్తున్న దానికెంత బూర్జువా పునాది ఉన్నప్పటికీ, దాని జాతీయ ఉద్యమ నాయకత్వానికి ఎంతగా బూర్జువా టైటిల్స్ వున్నప్పటికీ, వారు వాస్తవంగా సోషలిజానికి విరుద్ధంగా వున్నప్పటికీ-ఖచ్చితంగా విప్లవకర పోరాటాలే........" 7

పైస్టేటుమెంట్సు చూసిన తరువాత అస్సాం పోరాటాన్ని బాలగోపాల్‌గారు పేర్కొన్నట్టుగా దానివర్గ స్వభావం రీత్యాను, లేదా "వర్గ దృక్పధం" దృష్ట్యానూ వ్యతిరేకిస్తున్నా మనడానికి అర్థమేమిటి ? ఆ పదాలను కేవలం ఊత పదాలుగా వాడుతున్నట్టుగాదా ఆలోచించ వలసిందిగా బాలగోపాల్‌గారికి నావిజ్ఞప్తి.

"నేను అస్సాం ఉద్యమాన్నిగూర్చి మాట్లాడుతూ ఉంటే జాతీయస్వాతంత్ర్య

ఉద్యమాలగూర్చి లెనిన్, స్టాలిన్‌ల కొటేషన్‌లు గుప్పించడం వ్యర్థము" అనివారు నిరసన తెలుపవచ్చు.

జాతీయ విముక్తి ఉద్యమాలు (నేషనల్ లిబరేషన్ మూవ్‌మెంట్సు) జాతి ఉద్యమాల ఉన్నతస్థాయికి చెందిన రూపాలేగాని వేరుగాదు. జాతిఉద్యమాల స్వభావాన్ని వివరిస్తూ కామ్రేడ్ స్టాలిన్ ఇలారాశారు.

"ప్రతిచోట జాతి ఉద్యమం యొక్క స్వభావం ఒకేరీతిలో వుండదు. ఆయా ఉద్యమాల వేర్వేరు నినాదాలు వాటిస్వభావాన్ని నిర్దేశిస్తాయి. ఐర్లండు ఉద్యమానికి ప్రధానలక్షణం వ్యవసాయ సమస్య అయితే, బొహీమియాలో దానిలక్షణం భాషా సమస్య అయింది ఒకచోట ఆఉద్యమ నినాదం మతస్వాతంత్ర్యము, పౌరులందరికి సమానత్వము అయితే మరోచోట పుద్యోగాలన్నీ ఆజాతివారికే, స్వంత పార్లమెంటు వుండాలి అనేవి ప్రధాన వాదంకావచ్చు."

"బూర్జువా వర్గం నాయకత్వ పాత్రవహిస్తుంది."

"ప్రారంభ దశలో పెట్టుబడిదారీ వర్గానికి మార్కెటు సమస్య ప్రధాన సమస్యగా ఎదురవుతుంది. దానిసరుకులను అమ్ముకోవడము, మరోజాతికి చెందిన పెట్టుబడిదారీ వర్గంతో జరిగేపోటీలో దిగ్విజయంగా బయల్పడడము దాని ప్రధానోద్దేశ్యం. కాబట్టి అది స్వంత మార్కెటును భద్రపరచుకో కాంక్షిస్తుంది జాతీయతను నేర్చుకోడానికి పెట్టుబడిదారీ వర్గానికి మార్కెటు మొదటి పాఠశాలలాంటిది"

"అయితే సాధారణంగా ఈవిషయాలన్నీ మార్కెటుకే పరిమితంకావు. ఆధిపత్యంలో ఉన్నజాతికి చెందిన అర్థభూస్వామ్య, అర్ధపెట్టుబడి దారీ, నిరంకుశాధికార వర్గం జోక్యం కల్పించుకొని జాతికిచెందిన పెట్టుబడిదారీ వర్గాన్ని అదుపులో ఉంచడానికీ, అణచివేయడానికీ పూనుకుంటుంది. పెత్తనం వహించగల జాతికిచెందిన బూర్జువా వర్గం, అది చిన్నదికావచ్చు, పెద్దదికావచ్చు, దానిపోరాట దారులకు వ్యతిరేకంగా అతిచురుకుగానూ నిర్ణయాత్మకంగానూ వ్యవహరించగలదు. "సర్వశక్తులు" సమైక్యమవుతాయి. ప్రత్యర్థి బూర్జువా వర్గాన్ని అదుపులో ఉంచేచర్యల పరంపర ఆరంభమవుతుంది. క్రమంగా అది తీవ్రనిర్బంధ చర్యలకు దారితీస్తుంది. అంతటితో పోరాటం ఆర్థికరంగాన్నుండి రాజకీయ రంగానికి వ్యాపిస్తుంది. ఎచటికిపడితే అచటికి పోయి స్థిరపడే స్వేచ్ఛ (Locomotion)ను అరికట్టడం, భాషపై నిర్బంధప్రయోగం

వోటింగు అధికారాలను అరికట్టడం, పాఠశాలలు మూసివేయడం, మతాన్ని అదుపు పెట్టే చర్యలు మొదలయిన నిర్బంధ చర్యలన్నా ప్రత్యర్థి బూర్జువా వర్గంపై ప్రయోగింపబడతాయి. అలాంటి చర్యలన్నిటి వెనుక కేవలం పెత్తనం చలాయిస్తున్న జాతికి చెందిన బూర్జువా వర్గపు ప్రయోజనాలేకాదు, ప్రత్యేకించి ఆజాతికి చెందిన నిరంకుశ అధికారవర్గపు (బ్యురాక్రసీ) ప్రయోజనాలుకూడ వుంటాయి. అయితే ఆచరణలో లభించే ఫలితాల దృష్ట్యా దానికంత ప్రాధాన్యతలేదు. ఆస్ట్రియా-హంగరీలలో కానీయండి, రష్యాలో కానీయండి, ఈవిషయంలో బూర్జువా వర్గాలు, నిరంకుశాధికార బృందము కలిసిమెలిసే వుంటాయి."

"అణచివేయ బడుతున్న జాతికిచెందిన బూర్జువా వర్గం, అన్నివిధాలా నిర్బంధాలకు గురికాగా సహజంగానే ఒక ఉద్యమాని కుపక్రమిస్తుంది. అది తన గోడు "జాతిజన సముదాయానికి" విన్నవిస్తుంది. తనప్రయోజనమే జాతిమొత్తం ప్రయోజనం అనేరీతిలో "పితృభూమి" "పితృభూమి" అంటూ గగ్గోలు పెడుతుంది. "పితృభూమి" శ్రేయస్సుకొరకు తన "జాతిప్రజలనుండి" సైన్యాన్ని తయారు చేస్తుంది. "జనం"కూడ అన్నివేళలా దానిగోడు పట్టించుకొనకుండా వుండలేరు. దాని జండా చుట్టూ సమీకృతమవుతారు. పైనుండివచ్చే నిర్బంధపు తాకిడి వారికే తగులుతుంది. అదివారిలో కూడ అసంతృప్తిని రెచ్చగొడుతుంది."

"ఆవిధంగా జాతి ఉద్యమం ఆరంభమవుతుంది." 8

పెట్టుబడిదారీ విధానం ఆరంభం కావడంతోనే జాతుల సమస్యకూడా ఆరంభం అవుతుంది.

"........వర్తకము, రహదారి సౌకర్యాలు విస్తరిస్తున్నాయి. పెద్దపట్టణాలు తలఎత్తుతున్నాయి. ఆర్థికంగా జాతులు సంఘటితపడుతున్నాయి. వెనక్కి నెట్టబడి స్తబ్ద జీవితానికి గురిఅయివున్న జాతులలో పెట్టుబడిదారీ విధానం మొలకెత్తి, వాటిని ఉత్తేజపరుస్తోంది. పార్లమెంటు కార్యకలాపాల అభివృద్ధి వగైరాలు (ఆస్ట్రియాలో రీచ్‌స్ట్రాట్, రష్యాలో డ్యూమాలలాగ) "జాతుల భావాన్ని" సంతరించుకొని ఆమార్గంలోనే కార్యాచరణను పూనుకొంటోంది." 9

పెట్టుబడిదారీ విధానం ఉన్నంతవరకు జాతులసమస్య ఏదోరూపంలో తల ఎత్తుతూనే ఉంటుంది. కామ్రేడ్ స్టాలిన్ అన్నట్టు

"పాశ్చాత్యంలో జాతులఉద్యమం బూర్జువాఉద్యమంగనుక ఆ వుద్యమంయొక్క పర్యవసానం బూర్జువా వర్గపు అంతిమ పర్యవసానంతోనే సహజంగా ముడిపడి

వుంటుంది. బూర్జువా వర్గం అంతరించడంతోపాటే జాతుల ఉద్యమం కూడ అంతరించడం సాధ్యం. కేవలం సోషలిస్టు పాలనలోనే, శాంతిస్థాపన పూర్తిగా సాధ్యమవుతుంది. 10

"అయితే అన్ని జాతి ఉద్యమాలు సమర్థనీయం కాదు" అనే బాలగోపాల్ గారి వాదం సంగతేమిటి ? జాతుల ఉద్యమానికి ఎంతో విశిష్టస్థాన మున్నప్పటికీ మార్క్సిజం అన్ని జాతుల పోరాటాలను సమర్థించదు. కాని అలా సమర్థించక పోవడానికి శ్రీ బాలగోపాల్‌గారు అస్సాం సందర్భంలో రాసినట్లు బూర్జువాజీ నాయకత్వం వహించడం గాని, ఆ ఉద్యమానికి గల బూర్జువా స్వభావం కాని ఎంత మాత్రమూ కారణం కాదు. అస్సాం ఉద్యమాన్ని నిరసించే సందర్భంగా శ్రీ బాల గోపాల్‌గారు లేవనెత్తిన ఈ దిగువ వాదం కూడ అన్ని జాతుల పోరాటాలను మార్క్సిస్టులు సమర్థించరు అనే సిద్ధాంతం చాటున ఎంతమాత్రమూ సమర్థనీయము కాదు. వారు ఇలా రాశారు.

"అయితే మన దేశపు బూర్జువావర్గం గట్టిగా పోరాటం చేయడానికి ఇష్ట పడదు. (ఒక్క ప్రజలలో తప్ప) గతంలో సామ్రాజ్యవాదులతోనూ చేయలేదు. తరువాత భూస్వాములతోనూ చేయలేదు. అందుకే అస్సాం ప్రాంతీయ బూర్జువావర్గం బడా బూర్జువాలను పూర్తిగా ఎదిరించే స్వాతంత్ర్యం కోరడంలేదు. సి. పి. యమ్. వేర్పాటు ఆరోపణ అసత్యమని ఘోష పెడుతున్నారు. ఈ గోష అబద్ధపు గోష కాదు, పచ్చి నిజం. అంతటి తెగింపు ఈ దేశ పాలక వర్గాలకు లేదు. తమది సాయుధ పోరాటం కాదని, తాము అహింసావాదులమని, గాంధేయులమని కూడ ఘోష పెడుతున్నారు. ఏనాడో ఆలోచించడం మానేసిన సి. పి. యమ్. మేధావులు ఈ మాటల్ని నమ్మక పోవచ్చు. కాని ఇది కూడ పచ్చి నిజం. ఎంత పచ్చి నిజమంటే గాంధీ నడిపిన స్వాతంత్ర్య పోరాటం నిజ స్వభావం తెలిసినవారికి అస్సాం ఉద్యమం స్వరూపం గురించి మరేమీ చెప్పనక్కర లేదు."

[1981 ఆగస్టు సృజన పేజీ 17, పేరా 3]

అలాంటి పోరాట రూపాలను పూనుకోవడం నాయకత్వం యొక్క బలహీన తలకు చిహ్నం కావచ్చు. ఆ రూపాలు నాయకత్వపు వర్గ పరిమితినికూడ సూచించ

వచ్చు. కార్మికవర్గాన్ని, రైతాంగాన్నీ, ఆ ఉద్యమం యొక్క ప్రధాన నినాదం అంతగా కదిలించలేక పోవచ్చు. కాని బాలగోపాల్ గారి పై వాదం బూర్జువావర్గపు పోరాట రూపాలను అపహాస్యం చేయటానికి పనికిరావచ్చు కాని ఆ ఉద్యమాన్ని మార్క్సిస్టులు వ్యతిరేకించటానికి మాత్రం అది కారణం కాజాలదు. కామ్రేడ్ స్టాలిన్ రాసినట్లు "ఆ విషయాలపై ఆధారపడితే జాతి ఉద్యమం చిన్నచిన్న ఘర్షణల పరంపరగా మారి అంతిమంగా కేవలం సైన్‌బోర్డులపై పోరాటాలుగా దిగజారవచ్చు. [బొహిమియాలోని కొన్ని పట్టణాల పోరాటాల మాదిరిగా]"

పోరాటం నీరసించి పోడానికి అది కారణం కావచ్చు. అంతమాత్రంచేత ఆ ఉద్యమం అభివృద్ధి నిరోధకం అనిగాని, మార్క్సిస్టులు సమర్థించ వీలుగాదని చెప్పడానికి గాని అవి కారణాలు కాజాలవు. ఆ కారణాలపై ఆధారపడి ఆ పోరాటాన్ని వ్యతిరేకించడం తప్పని చెప్పడానికి ఇంతకుపైన పేర్కొన్న అంశాలే చాలు.

అయితే ఎలాంటి జాతుల పోరాటాలను మార్క్సిస్టులు వ్యతిరేకిస్తారు? ఇది తేల్చుకోడానికి ముందు సామాజిక పరిణామ క్రమంలో జాతుల పోరాటం పట్ల మార్క్సిస్టులకున్న జనరల్ అవగాహనను దృష్టిలో ఉంచుకోవడం అవసరం.

ఆధునిక జాతుల ఉద్యమం అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ విధానం తోనే ఆరంభమయిందని చూసాం. ఆనాడు ఆ ఉద్యమానికి నశించిపోతున్న ఫ్యూడలిజమే ప్రధాన శత్రువు. రాజరికాన్ని నిర్మూలించి ప్రజాస్వామికాన్ని నెలకొల్పడమే ఆనాటి పెట్టుబడిదారీ విధానపు ప్రయత్నం. పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి క్రమంలోనే ప్రపంచ మార్కెటు అవతరిస్తుంది. అందువల్ల ఫ్యూడలిజాన్ని నిర్మూలించే ఉద్యమం ప్రపంచ వ్యాపిత ఉద్యమంగానే అభివృద్ధి చెందక తప్పదు. అదే ప్రపంచ ప్రజాస్వామిక విప్లవోద్యమం. సామాజిక పరిణామ క్రమంలో పెట్టుబడిదారీ విధానం అంతవరకు విప్లవకర పాత్రనే వహించింది. అందువల్ల ఫ్యూడలిజాన్ని నిర్మూలించి, జాతి నంతటినీ సమైక్యపరచి, ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నెలకొల్పటానికి సాగించిన ప్రతి జాతిపోరాటమూ ప్రపంచ ప్రజాస్వామిక విప్లవంలో విడదీయ రాని భాగ మయింది.

ఆ పిమ్మట 20 వ శతాబ్దం ఆరంభంనుండి పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్య

వాదంగా మారింది. అంతటితో బహు కొద్ది దేశాలు [జాతులు] అత్యధిక దేశాలను [జాతులను] దోచుకోవడంపైననే జీవించడం పెట్టుబడిదారీ విధానపు ప్రధాన లక్షణమయింది. తద్వారా అణచబడుతున్న జాతుల అభివృద్ధికి సామ్రాజ్యవాదమే ప్రధాన శత్రువయింది. ఏ జాతి అయినా తన స్వాతంత్ర్యాన్ని సాధించాలనుకొంటే సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించక తప్పదు. అన్యధామార్గంలేదు. అలాగే సామ్రాజ్య వాద దేశాలలోని పీడిత ప్రజలు తమ విష్టార్జితం తమకు దక్కాలంటే కూడ ఆ దేశాలలోని సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించాలి. ఆ విధంగా అటు సామ్రాజ్య వాద దేశాలలో జరిగే సోషలిస్టు విప్లవానికీ, ఇటు వెనుకబడ్డ దేశాలలో [జాతులలో] జరిగే జాతీయ విముక్తి విప్లవాలకు కూడ సామ్రాజ్యవాదమే ఉమ్మడి శత్రువయింది. ఆ ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా అటు సామ్రాజ్యవాద దేశాలలోని సోషలిస్టు విప్లవ శక్తులు, ఇటు వెనుకబడ్డ దేశాలలోని జాతీయ విముక్తి పోరాట శక్తులు సమైక్యమయి పోరాడాల్సిన అవసరం ఏర్పడింది. ఆ అవసరాన్ని గుర్తించి, అందుకు అనువయిన పథకాన్ని రచించడమే లెనిన్ మహాశయుని ప్రత్యేకత.

రష్యా విప్లవ విజయంతో ప్రపంచ సోషలిస్టు విప్లవం ఆరంభమయింది. అది అటు సామ్రాజ్యవాదానికి ఎంతటి అనర్థదాయకమో, ఇటు సోషలిస్టు విప్లవ శక్తులకు, వెనుకబడ్డ దేశాల జాతీయ విప్లవ శక్తులకు అంతటి ఘన విజయం. అప్పటినుండి ప్రపంచంలోని అన్ని వెనుకబడ్డ జాతుల ఉద్యమాలు ప్రపంచ సోషలిస్టు విప్లవంలో విడదీయ వీలుగాని భాగాలయినాయి. ఈ విషయాన్నే కామ్రేడ్ స్టాలిన్ ఇలా చెప్పారు.

"..................జాతి సమస్య కార్మిక విప్లవం యొక్క జనరల్ సమస్యలోనూ, కార్మికవర్గ నియంతృత్వ సమస్యలోనూ ఒక భాగమే." 11

కార్మికవర్గ జనరల్ సమస్యలో భాగం అంటే ప్రపంచ కార్మిక విప్లవంలో భాగమనే అర్థం.

పై అవగాహన ననుసరించి మార్క్సుకాలంలో జరిగిన జాతుల పోరాటాలన్నీ ఫ్యూడలిజానికి వ్యతిరేకంగా జరిగిన ప్రపంచ ప్రజాస్వామిక విప్లవంలో భాగాలయితే ఆపిమ్మట ప్రధానంగా 1917లో జరిగిన సోషలిస్టు విప్లవానంతరం జరిగిన, జరుగు

తున్న జాతుల పోరాటాలన్నీ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా కొనసాగుతున్న ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగాలు.

పై విషయాన్ని లెనిన్ మహాశయుడు ఈ క్రింది మాటల్లో స్పష్టీకరించాడు.

"స్వయం నిర్ణయాధికారం అనే దానితోసహా ప్రజాస్వామిక విప్లవప్రధాన సమస్యలలో ఏఒక్కటీ కూడ స్వయం సంపూర్ణమయినదికాదు. అందులోని ప్రతి ఒక్కటీ ప్రపంచ ప్రజాస్వామిక (ఇప్పుడు అయితే ప్రపంచసోషలిస్టు) ఉద్యమంలో ఒక చిన్నభాగం మాత్రమే."

(లెనిన్ కలెక్టెడ్ వర్క్స్, వాల్యూం-19- పేజి 257_58)

అందువల్లనే ఫలానాజాతి పోరాటాన్ని సమర్థించాలా? లేక వ్యతిరేకించాలా? అనే విషయాన్ని తేల్చుకోవడానికి మార్క్స్ కాలంలో ఆవుద్యమం ప్యూడలిజాన్ని నిర్మూలించడానికి తోడ్పడుతోందా? లేక దాన్ని బలపర్చడానికి తోడ్పడుతుందా? అనేదే విప్లవ కారులకు గీటురాయి అయింది.

ఆగీటురాయిని అనుసరించే 19వ శతాబ్దపు, 4వ దశాబ్దంలో పోలిష్ హంగేరియన్ జాతుల పోరాటాలని బలపరిచారనీ: చెక్‌ల, సౌత్ స్లావ్‌లజాతిపోరాటాలని వ్యతిరేకించారనీ: కామ్రేడ్ స్టాలిన్ ప్రాబ్లమ్స్ఆఫ్ లెనినిజం అను పుస్తకంలో విపులీకరించారు.

అలానే జాతుల పోరాటం ప్రపంచ సోషలిస్టువిప్లవంలో భాగమయిన ఈనాడు ఏజాతి పోరాటాన్నయినా బలపర్చడమా లేక వ్యతిరేకించడమా అనే విషయాన్ని తేల్చుకోడానికి అపోరాటం సామ్రాజ్య వాదాన్ని బలహీన పరుస్తోందా? లేక బల పరుస్తోందా? అనేదే మార్క్సిస్టులు ఉపయోగించాల్సిన గీటురాయి.

ఈ విషయాన్నే వివరిస్తూ కామ్రేడ్ స్టాలిన్ ఇలారాశారు.

"సామ్రాజ్యవాదాన్ని దుర్బలపర్చడానికీ, ఓడించడానికీ,తోడ్పడే పోరాటాలను బలపర్చాలి. అంతేగాని దాన్ని బలపర్చడానికి దానిఅస్థిత్వాన్ని కాపాడడానికీ తోడ్పడే వాటిని మాత్రం కాదు అని దానర్థం."

"జాతుల హక్కుల సమస్య అనేది మరిదేనితోను సంబంధంలేని స్వయం సంపూర్ణ సమస్యగాదు. అది కార్మిక వర్గపు మొత్తం సమస్యలో ఒకభాగంమాత్రమే

మొత్తం సమస్య ప్రయోజనాలకు అందులోని భాగపు ప్రయోజనాలు లోబడి ఉండాలి. మొత్తం ప్రయోజనాల దృష్ట్యానే భాగం ప్రయోజనాలను పరిశీలించాలి."

(ప్రాబ్లమ్స్ ఆఫ్ లెనినిజం - స్టాలిన్ పేజి 71)

లెనిన్ మహనీయుడు మరింత స్పష్టంగా ఇలాచెప్పారు.

"........ నిర్దిష్టమయిన సమస్యలలో, ఒక భాగపు ప్రయోజనాలకు మొత్తపు ప్రయోజనాలు విరుద్ధంగా ఉండవచ్చు. అలాంటి సందర్భాలలో మొత్తపు ప్రయోజనాలను కాపాడడానికి భాగపు ప్రయోజనాలను వ్యతిరేకించాలి."

(లెనిన్ కలెక్టడ్ వర్క్స్ 19వ వాల్యూం - పేజీ 257 - 58)

కాబట్టి ఏజాతి ఉద్యమన్నయినా సమర్థించడానికయినా వ్యతిరేకించడానికైనా మార్క్సిస్టులు పై కొలబద్దనే గీటురాయిగా భావించాలి అంతేగాని సాధారణ నైతిక సూత్రాలనుండిగాని, నామమాత్రమయిన ప్రజాస్వామిక సూత్రాలనుండిగాని, కేవలం న్యాయశాస్త్రం విశదీకరించే అస్పష్టమయిన హక్కులభూమికనుండి గాని అందుకు పూనుకోరాదు. నిర్దిష్టంగా ఆపోరాటం ఈనాడు ప్రపంచ సోషలిస్టు విప్లవానికి తోడ్పడేది గానూ, ప్రపంచసామ్రాజ్యవాదాన్ని దుర్బలపర్చేదిగానూ, ఉందా, లేదా? అనేకోణం నుండి మాత్రమే చూడాలి. అదే జాతుల పోరాటం పట్ల సారాంశంలో మార్క్సిస్టుల వైఖరి.

పై మార్క్సిస్టు అవగాహన దృష్ట్యా అస్సాం పోరాటాన్ని శ్రీ బాలగోపాల్ గారు కంటగించుకోడానికి ఆధారం కనిపించదు.

అయితే జాతుల పోరాటం కొనసాగుతున్నప్పుడు ఆపోరాటంలో పాల్గొంటూనే కార్మికవర్గం తన ప్రత్యేకతను నిలబెట్టుకోవాలి. లేకుంటే బూర్జువా జాతీయ వున్మాదానికి పీడిత ప్రజానీకానీకంలోనూ ప్రత్యేకించి కార్మిక వర్గంలోనూ అంతర్జాతీయ చైతన్యాన్ని పెంపొందించడంలో అది విఫలమవుతుంది. ఆ సందర్భంగా కామ్రేడ్ స్టాలిన్ ఇలా హెచ్చరించారు.

"జాతి ఉద్యమపుబలం ఆజాతికి చెందిన విశాల ప్రజానీకం- కార్మికులు, రైతులు అందులో పాల్గొంటున్నారా? లేదా? అనేదాన్నిబట్టి నిర్ధారణ అవుతుంది."

"అయితే కార్మిక వర్గం బూర్జువా జాతీయతా పతాకం క్రింద సమీకృతమవుతుందా లేదాఅనేది అచ్చటివర్గవైరుధ్యాలస్థాయి, కార్మికులవర్గ చైతన్యస్థాయి నిర్మాణ

శక్తి - వీటిపై ఆధారపడి వుంటుంది. వర్గచైతన్యంగల కార్మికులకు విస్వసనీయమయిన స్వంతపతాకనుండి బూర్జువా పతాకక్రింద సమీకృతం కావల్సిన అవసరం వారికిలేదు ."

అలా కార్మిక వర్గం వర్గ చైతన్యం, నిర్మాణ పటుత్వము కలిగియున్నచోట సమర్థించ దగ్గ జాతుల పోరాటాలలో పాల్గొంటూనే, సాధారణ ప్రజానీకం బూర్జువా సంకుచిత జాతీయతకు బలిగాకుండా తన స్వంతపతాకక్రింద పీడిత ప్రజానీకాన్ని అంతర్జాతీయ విప్లవసైన్యంలో అంతర్భాగంగా పురోగమింప చేయగలదు. చేయాలి. జాతుల పోరాటం సందర్భంగా ఆదిశలో పురోగమించడం కార్మిక వర్గపు కర్తవ్యం.

జాతుల పోరాటం పట్ల మార్క్సిస్టుల కుండవలసిన పై వైఖరికి భిన్నంగా శ్రీబాలగోపాల్‌గారు అస్సాం ఉద్యమానికి ఉన్న బూర్జువాస్వభావాన్నీ బూర్జువా లేదా పెటీ బూర్జువా నాయకత్వాన్నీ వారు అవలంబిస్తున్న పోరాటరూపాలనూ, మాత్రమే చూసి ఆ పోరాటాన్ని ఏవగించుకున్నారు. అందువల్లనే వారు అస్సాం పోరాటం పట్ల గల వ్యతిరేకత అంతా తీవ్రంగా వెళ్ళగక్కి కూడ చివరిలో చాలా పేలవంగా తమ వ్యాసాన్ని ముగించక తప్పిందికాదు.

"ఇదంతా అన్యాయం కాదు. అస్సాం అభివృద్ధి చెందితే ఎవరికీ బాధలేదు. అంతే కాకుండా బడాబూర్జువా వర్గానికి వ్యతిరేకంగా ప్రాంతీయ బూర్జువావర్గం పోరాడితే కమ్యూనిస్టులు సామాన్య ప్రజలకు ఏహానీ జరుగనంత కాలం ఆపోరాటాన్ని సమర్థించ వలసిందే. అయితే పాలక వర్గాల ఈఅంతః కలహంలో లక్షలమంది సామాన్య ప్రజలుపావులయితే ఆ కలహాన్ని కమ్యూనిస్టులు ఏవిధంగా సమర్థిస్తారు? వీరిని అస్సాంనుండి గెంటివేస్తే వారిగతి ఎంత దుర్భరంగా వుంటుందో వూహించ లేని విషయమా?"

(1981 ఆగస్టు సృజన - పేజీ18)

ముగింపుకు వచ్చేసరికి ఆ ఉద్యమాన్ని వ్యతిరేకించడానికి గల బూర్జువా వర్గ స్వభావమూ, నాయకత్వమూ, బూర్జువా వర్గ ప్రయోజనాలు అనే విషయాన్ని గాలికి వదలి శ్రీ బాలగోపాల్‌గారు సామాన్య ప్రజలు ఆపోరాటంలో పావులయితే దాన్ని ఎలా సమర్థించాలి? అనే దగ్గరకు వచ్చారు.

బంగ్లాదేశ్ నుంచి వచ్చిన నిర్వాసులే బాలగోపాల్‌గారి దృష్టిలోనున్న సామాన్య ప్రజలు. ఈపోరాటంద్వారా వారికి ఇబ్బందిఉంది అనే విషయాన్ని ఎవరూ కాదనలేరు. వారి ఇబ్బందిని ఎలా పరిష్కరించాలనేదే సమస్య. వారికెంతఇబ్బంది ఉందో అంతకు మించిన ఇబ్బంది అస్సామీయులకూ ఉంది. లేకుంటే ఇంత సుదీర్ఘపోరాటానికి వారు ఎందుక తెగించి సిద్ధపడుతున్నట్టు? అయితే వారిఇబ్బందిని బాలగోపాల్‌గారు శాస్త్రీయ దృష్టితో చూడటంలేదు. కేవలం బంగ్లాదేశీయుల పట్లగల మానవతా దృష్టితోమాత్రమే వారు మొత్తం సమస్యను పరిశీలిస్తున్నారు. బంగ్లాదేశీయుల బాధపట్ల గలజాలి దృష్ట్యా (ఎవరికైనా ఇది ఉండవలిసిందే.) వారి రక్షణ కొరకు కూడ కమ్యూనిస్టులు పోరాడాల్సిందే (పోరాడుతారుకూడా) అస్సామీయుల సమస్యను శ్రీబాలగోపాల్‌గారు ఎంత చులకనజేసి తృణీకరిస్తున్నారో చూడండి. వారిలా రాశారు.

"అస్సాంలో ఒకప్పుడు బెంగాలీల సాంస్కృతిక పీడన ఉన్నమాట నిజమే. అయితే అది పాతకథ. ముఖ్యంగా 1961లో అస్సామీ భాషను రాష్ట్రభాషగా ప్రకటించిన తరువాత, విజాతీసాంస్కృతిక పీడన, ఎక్కడనుండివచ్చిందో అర్థం కావటం లేదు.

1961లో ఎంతతీవ్ర పోరాటం జరిగిన తరువాత అస్సామీ భాష రాష్ట్రభాష కాగలిగింది? అందుకొరకు అస్సామీయులు ఎంతరక్తాన్నర్పించవలసి వచ్చింది? అసలు అస్సాంలో బెంగాలీభాషను రాష్ట్రభాష చేయాలనే దురాలోచన అప్పటి ప్రభుత్వానికి ఎందుకు వచ్చినట్టు? బ్రిటిష్ సామ్రాజ్యవాదుల కుట్రతోపాటు గ్రేటర్ బెంగాల్ (అమ్రొ బెంగాలి) జాతీయ దురహంకారుల కుట్ర కూడ అందులో భాగం కాదా? ఆనాడు అస్సామీయులు తెగించి పోరాడకుండా వుంటే ఈనాటికీ వారిగతి ఏమయి ఉండేది? అలానే ఈశరణార్థుల వెల్లువ ఇలానే పెరిగితే త్రిపురకు పట్టిన గతే అస్సాంకు పట్టదనే హామీ ఎవరివ్వగలరు? బెంగాలీ జనాభా క్రమంగా ఈశాన్య భారతమంతటిలోనూ భయాందోళనలను కలిగించడం కేవలం నిర్హేతుకమనే భావించడం సబబయినదా? తమిళ బ్రాహ్మణ వర్గం ఒకప్పుడు లేవనెత్తిన "ద్రవిడస్థాన్" నినాదం దక్షిణాదిజాతులను ఎలాకలవరపర్చిందో, ఈనాడు ఈశాన్యభారత్‌లో పెంపొందుతున్న బెంగాలీ జనాభా సమస్యను మొదటినుండీ గ్రేటర్ బెంగాలీ జాతీయ దురహంకారులు చేస్తున్న కుట్రలో భాగంగా పోల్చుకొని పరిశీలిస్తే, ఆ ప్రాంతపు ప్రజలను కలవర పెట్టడంలో ఆశ్చర్యమేముంది? వారి మనుగడకు వారుతప్ప

మరెవ్వరు బాధ్యత వహించగలరు ? నిజానికి ఈనాడున్న అస్సాం సమస్య మొత్తంలో అచ్చటి శరణార్థులసమస్య ఎంతటి జటిలమయినదో అస్సామీయుల సమస్య అంత కంటే జటిలమయినదనీ జాతుల అభివృద్ధినీ, పరిణామక్రమాన్నీ మార్క్సిస్టు అవగాహనలో పరిశీలించేవారి కెవరికయినా అర్థంకాక తప్పదు.

అస్సామీయులు ఎప్పటినుండో ఉంటున్న బెంగాలీయులను పొమ్మనడంలేదే. దేశవిభజన తరువాత, నెహ్రూ, లియాకత్ అలీఖాన్ ఒడంబడికలకు కట్టుబడి, 1951 పిమ్మట వచ్చిన వారినిమాత్రమే వారు పొమ్మంటున్నారు. ఆ తరువాత అంతమంది వెల్లువలా అస్సాంచేరడానికి ఈప్రభుత్వం అవలంబించిన తప్పు విధానాలే కారణమయితే ఆ బరువును దేశపు మొత్తం సమస్యగా స్వీకరించి భరించడానికి సిద్ధపడారే గాని ఒక్క అస్సాంపై నెట్టడం భావ్యమా ? "జాతీయసమస్యగా స్వీకరించి దేశ వ్యాపితంగా వారిని సర్దేబాధ్యత కేంద్రప్రభుత్వం తీసుకుంటే మావంతు మేముకూడా భరిస్తాము" అనికూడా అస్సామీయులంటున్నారు కదా. అంతకుమించి వారేమి చేయగలరు?

"కేంద్రప్రభుత్వ బ్యూరాక్రేటులకు, కలకత్తా వామపక్ష ప్రభువులకూ మధ్య ఫుటబంతులుగా మారిన దండకారణ్య కాందిశీకుల చరిత్ర మరిచిపోయామా ?" అని అంటున్నారు బాలగోపాల్‌గారు. నిజమే, వారిరక్షణకు తగినంతగా పోరాడలేక పోవడానికి దేశవ్యాపితంగావున్న విప్లవశక్తుల బలహీనత కారణం కావచ్చు. అయితే అందుకు శిక్షించాల్సింది అస్సాం జాతినా ?

అస్సాం జాతియొక్క న్యాయమయిన డిమాండ్‌ను మిగిలిన భారతీయులు ఎంతసవ్యంగా అర్థం చేసుకుంటారో శరణార్థులకు వారంత ఇతోధికంగా తోడ్పడగలరు. బడా బూర్జువా, భూస్వామ్య వర్గాల ఆధ్వర్యంలోని భారతప్రభుత్వానికి వ్యతిరేకంగా అస్సాం ప్రాంతీయ బూర్జువా, పెటి బూర్జువా నాయకత్వంలో అశేష ప్రజానీకం చేస్తున్న పోరాటంపట్ల పాజిటివ్ వైఖరి తీసుకోవడంద్వారానే కార్మిక వర్గం అస్సాం పీడిత ప్రజానీకాన్ని యావత్‌భారత ప్రజాస్వామిక విప్లవంలో తగు పాత్రవహించేలా సమీకరించగలదు. అలానే శరణార్థుల రక్షణ సమస్యను దేశవ్యాపిత సమస్యగా స్వీకరించి పరిష్కరించడానికి అప్పుడే శక్తివంచనలేని కృషిచేయగలం.

అలాగాక శ్రీబాలగోపాల్‌గారు తీసుకున్న నెగెటివ్ వైఖరే తీసుకుంటే అస్సాం జాతిని తక్కిన భారతప్రజాస్వామిక విప్లవంలో సమీకరించాల్సిన చారిత్రక బాధ్యతను

నిర్వహించడంలో భారత కార్మికవర్గం విఫలమవుతుంది. అసలే నిర్మాణరీత్యా చాలా బలహీనంగా వున్న అస్సామీ కార్మిక వర్గం భారత ప్రజాస్వామిక విప్లవంలో అస్సామీ పీడిత ప్రజానీకాన్ని సమీకరించడంలో విఫలమయ్యేదుస్థితికి నెట్టబడుతుంది.

అందువల్ల అస్సాం సమస్యను కామ్రేడ్స్ లెనిన్, స్టాలిన్లు ప్రబోధించినట్లు ప్రపంచ సోషలిస్టు విప్లవంలోనూ, భారతప్రజాతంత్ర విప్లవంలో కార్మికవర్గ నాయకత్వంక్రింద దేశంలోని అన్ని జాతుల పీడిత ప్రజలను సమీకరించాలనే బృహత్ కర్తవ్యంలోనూ భాగంగా పునరాలోచించాలని శ్రీబాలగోపాల్‌గారికి నావిజ్ఞప్తి. అదే మార్క్సిస్టులు ఆలోచించాల్సిన పద్ధతికూడ.

ఈ వాగ్వివాదానికి మూలమయిన "రగులుకునే రాక్షసిబొగ్గు" గ్రంథకర్త సురాగారు, విమర్శకులు బాలగోపాల్‌గారు, పృధ్వీగార్లతో పాటు నేనుకూడా మార్క్సిజం లెనినిజంను మార్గదర్శకంగా భావించిన వారికోవకుచెందినవాడినే. అందువల్ల భారతదేశంలో జాతుల పోరాటాలపట్ల ఉండవలసిన జనరల్ వైఖరిలోనూ, నిర్దిష్టంగా అస్సాం వగైరా పోరాటాలపట్లను తలయెత్తిన భిన్నాభిప్రాయాలను అలాంటివారు మార్క్సిజం-లెనినిజంలపై ఆధారపడిమాత్రమే పరిష్కరించుకోగలరు. అకారణంగానే ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపడానికిగాని ఎవరు చెప్పదలుచుకున్నది వారు సోదాహరణంగా చెప్పడానికిగానీ మార్క్సిస్టు సిద్ధాంత వేత్తలను విస్తృతంగా ఉదహరంచడం అనివార్యమవుతుంది. అలా ఉదహరించే భాగాలు ఎక్కువగానూ, కొన్నిచోట్ల సుదీర్ఘంగానూ కూడ ఉండడం పాఠకులను నిజంగానే ఇబ్బంది పెడుతుంది. అయినా విషయానికిగల ప్రాముఖ్యత దృష్ట్యా వారు మన్నించగలరని ఆశిస్తున్నాను.

అలానే ఇందులో పేర్కొన్న "రగులుకునే రాక్షసిబొగ్గు" పుస్తకంలోగల లోపాలనుగూర్చి పునరాలోచించి, ఈశాన్య భారతజాతుల పోరాటాలను భారత ప్రజాతంత్ర విప్లవంలో సంలీనంచేసి, ప్రపంచసోషలిస్టు విప్లవంలో భాగంగా పురోగమింపచేసే పవిత్రలక్ష్యాన్ని మరింత పట్టుదలతో సురాగారు కొనసాగిస్తారనికూడ ఆశిద్దాం.

Reference :

1. "The National Question and Leninism" - Stalin P. P 5-6
2. " " P. P 7-8
3. "Marxism and the National Question" — Stalin P. 18

4 Lenin Collected Works, Volume 17, P. P 139-40

5. Lenin "On the National and colonial Question" P-32

6. "Problems of Leninism" - Stalin P. 70-1976
Peking Edition.

7. " " P 72 "

8. "Marxism and National Question" - Stalin P - 20, 21

9. " " " P. 19

10. " " " P. 25

11. "Problems of Leninism" Stalin P. 70

12. "Marxism and the National Question" - Stalin P. 21

కవిత్వం నలుగురు తిరిగే రాస్తా

కవిత్వం ఆకలిని తీర్చదు. దేహాన్ని కప్పదు. కోరికను పంచుకోదు. మరెందుకీ కవిత్వం? కవిత్వం జీవితాని కవసరమా? ఈ ప్రశ్నకు ఏ విప్లవకవి రాసిన కవిత్వమైనా సమాధానం చెబుతుంది.

కవిత ఒకఅగ్నిశిఖ. అది చీకట్లో పడిమూల్గే ఆకలిబతుకుల్నీ, చలితో వణికే దేహాల్నీ, తమ ప్రస్తుత దుస్థితికి కారణాలు తెలీని అమాయక జనాల్నీ వెలుగులోకి తెస్తుంది. రక్తాన్ని వెచ్చబరుస్తుంది. చైతన్యవంతుల్ని చేస్తుంది. మనిషికి మానవస్పృహ కలిగించే వాటిల్లో కవిత్వమొకటి. అది కవిత్వవిధి. ఏకవి తన కవిత్వానికి అబాధ్యతను ఆపాదించుకోడో వాడట్టి కీర్తికాంక్షతో ఎగిరెగిరిపడే పదాల దురదగాడు.

కవిత్వం అనేకరూపాల్లో వ్యక్తమవుతుంది. పాటలోనూ, పద్యంలోనూ, వచనంలోనూ కవిత్వం వ్యక్తంకావచ్చు. ఆధునిక కాలంలో ప్రాచుర్యం పొందిన రూపం వచనరూపం. ఇవన్నీ కవిత్వం వ్యక్తమయ్యే భిన్నరూపాలు మాత్రమేనని గుర్తుంచుకోవాలి. కవిత్వం యొక్క తొలిరూపం పాట. అభివృద్ధి క్రమంలో పెట్టుబడిదారీ వ్యవస్థ సాధించిన రూపం వచనకవిత. అచ్చుయంత్రం దాని ప్రాచుర్యానికి తోడ్పడింది. పద్యరూపం అనేక ఇతర విషయాలతోపాటు జ్ఞాపకముంచుకోవటమనే విషయంతోకూడా ముడిపెట్టబడి ఉంది. అచ్చుయంత్రం వచ్చిన తర్వాత జ్ఞాపకముంచుకోవటం పెద్ద అవసరంకాదు. ఎన్నిసార్లయినా మనం పుస్తకం తెరచి చదువుకోవచ్చు. తక్కువ ప్రయాసతో,తక్కువఖరీదుతో పుస్తకం కొనుక్కోవచ్చు. వచన కవిత్వంలో పాఠకుడి శ్రద్ధ ఆలోచన పైనే ఉండటానికి ఇది ఒక కారణం.

తెలుగులో వచనకవిత్వం మొదట్నుంచీ అనేక సమస్యల్ని ఎదుర్కొంటూ వస్తూంది. ఇందులో కథ ఉండదు. దీన్ని పాడలేం. కథలతోనూ, నవలలతోనూ, సినిమాలతోనూ సులభంగా తమ Aesthetic Sense ని తృప్తిపరుచుకోవటానికి అలవాటుపడ్డ సామాన్య జనం దీన్ని ప్రత్యేకంగా పట్టించుకోరు. గాఢమైన సాహిత్యానుభవాన్ని, చైతన్యాన్ని కోరుకునే వాళ్ళుమాత్రమే కవిత్వం చదువుతారు. అలాంటి పాఠకులు చాలాతక్కువ. నగరజీవితంలో మనిషి Alienationకు

గురై మానవ సారాన్ని సృజనాత్మక శక్తిని కోల్పోతూ ఉండడంవల్ల ఏర్పడ్డ పరిస్థితి ఇది. అయినా ఈకవిత్వం రాసేవాళ్ళ సంఖ్యగానీ, వచ్చే కవితాసంకలనాల సంఖ్య గానీ తగ్గలేదు. పై పెచ్చు పెరుగుతూ ఉంది. అపకారం లేంది ఏదీ ఉండదుకదా! ఈ విషయం వేరుగా పరిశీలించాల్సి ఉంటుంది.

మన వచన కవిత్వం ఎదుర్కొంటున్న మరోసమస్య అస్పష్టత.

సంక్లిష్టతకీ, అస్పష్టతకీ తేడాతెలీని కవులు తమ కవిత్వంలోని అస్పష్టతని ఏదో ఒకరకంగా సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తున్నారు. అమెరికాలాంటి దేశాల్లో ప్రజాజీవనం సంక్లిష్టంగా ఉంటుందని మనందరికీ తెలిసిన విషయమే. ఆ దేశపు కవిత్వంలో కూడా ఆసంక్లిష్టత ప్రతిబింబించింది. ఇక్కడ గమనించాల్సిందేమి టంటే ఆ కవిత్వంలో సంక్లిష్టత ఉందికానీ అస్పష్టతలేదు. బీట్నిక్కుల్లో ప్రముఖుడు ఎలెన్ గిన్స్‌బర్గ్ రాసిన కవిత్వం ఇందుకొక ఉదాహరణ. విషయంలోనూ, దృక్పథం లోనూ అస్పష్టత ఉన్నందువల్లే కొంతమంది కవుల రచనల్లో అస్పష్టత చోటుచేసు కుంది. దృక్పథమూ, ఎంచుకున్నవస్తువూ స్పష్టంగా ఉంటే అలంకారాలూ, శిల్పం, రూపం అన్నీ వస్తువుకు విధేయులై ఉంటాయి. ఆ కవి ఆ వస్తువును ఎంత తీవ్రంగా అనుభూతం చేసుకున్నాడన్నదాన్ని బట్టి ఆకవిత్వం తీవ్రంగానో, బలహీనంగానో రూపొందుతుంది.

వచన కవిత్వానికున్న ఈసమస్యల మధ్య హనుమంతరెడ్డి 'రస్తా' ఒక పరి ష్కారం కోసం ప్రయత్నించినట్లు కనబడుతుంది. ప్రజాజీవితాన్ని సరిగ్గా అవగాహన చేసుకోవటంద్వారానే, దాన్నికవిత్వంలో ప్రతిబింబించటానికి ప్రయత్నించటంద్వారానే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే విషయాన్ని హనుమంతరెడ్డి గ్రహించారు.

ప్రస్తుత సంక్షోభ సమాజంలో కవి నిర్వహించాల్సిన బాధ్యత గొప్పది. విప్లవ కవి రస్తాసుగమమైంది కాదు. ఆశయబలం, ప్రజాశక్తి ఇవే ఈకవికి చోదకశక్తులు. ఒక విప్లవకవికీ, మామూలుకవికీ ఉన్న ప్రధానమైన తేడా ఈ బాధ్యత. విప్లవకవి ప్రజల పట్ల, ప్రజల ఆకాంక్షల పట్ల, సంఘపురోగమనానికి తోడ్పడే ఉద్యమాల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తాడు.

ఆ బాధ్యతలేని కవులు, అందాన్ని ఆనందాన్ని పరమావధిగా పెట్టుకొన్న

కవులు చాలామంది, వ్యాపార పత్రికల ఆశీర్వాదాల్తో తమ ఉనికిని బలపరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒకవేపు ప్రపంచం తగులబడిపోతూంటేగులాబీ అందాన్ని చూస్తూ ఎలాకూచోగలం? భీభత్సంగా ఉన్న సమాజాన్ని అందమైన పదచిత్రాల్తో ఎలా చిత్రించగలం? అందాన్ని చిత్రించాల్సివస్తే, అందం చుట్టూ అలుముకున్న దోపిడీ విధానాన్ని సూచించాల్సి ఉంటుంది. పూలను గురించి రాస్తే, మానవతాపుష్పాన్ని నలిపేస్తున్న వ్యవస్థను గురించి రాయాల్సి ఉంటుంది. ఈకవి చేసిందిదే. అంతే కాకుండా ఈ వ్యవస్థని మార్చే విప్లవరాస్తాని కూడా చూపించారు హనుమంతరెడ్డి. ఈ వ్యవస్థ మనిషి మానవసారాన్ని కోల్పోయేట్టు చేస్తుంది. అందరూ ఆస్వాదించాల్సిన ప్రపంచ సౌందర్యాన్ని కొందరే దక్కించుకొనే అవకాశాన్నిస్తుంది. మనిషి మనిషి కాకుండా పోయే స్థితిని కలిగిస్తుంది. ఈ విషయం తెలిసిన కవి రచనల్లో అందం విడిగా కనిపించదు. ఈ వాస్తవాన్ని మరచి ఎవరైనా ఆ ప్రయత్నం చేసినా అది కృత్రిమంగానూ, పేలవంగానూ ఉంటుంది. అందం, ఆనందం పరమావధిగా పెట్టుకున్న వాళ్ళ దృక్పథం (ఈవ్యవస్థలో) వాడివర్గదృక్పథాన్ని బయటపెడుతుంది. ఈ రకమైన దృక్పథం, ఆలోచన చరిత్రలో పాతవే.

"The philosophy of enjoyment was never anything but the clever language of certain social circles who had the previlege of enjoyment. (The Germay Ideology)

అందుకే సామాజిక బాధ్యత గలవాడి రచనలో సమాజం అందంగా కనిపించదు. దోస్తవయేస్కీని సమీక్షిస్తూ ఆంద్రెగైడ్, Beautiful feelings make bad art అనటంలో తాత్పర్యమిదే, వ్యవస్థ మారేదాకా ఇదేస్థితి.

అందుకే హనుమంతరెడ్డి అక్షరాలు "ఆకాశ పారిజాతాలు కవు." అవి పూలను గురించి తెలుపుతాయి. పూలను నలిపేసిన పాపిష్టి చేతుల గురించి, తెలపటం మాత్రం మరచిపోవు. అవి ప్రజల అమాయకత్వాన్ని గురించి తెలుపుతాయి. అంతతో ఆగితే అవి కేవలం ప్రకృతి అందాల గురించి రాసే కవి అక్షరాలౌతాయి. కానీ ఈ అక్షరాలు ఆ అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని పాలకవర్గాలు చేసే మోసాల్ని గురించి, దోపిడీని గురించి తెలుపుతాయి. దాంతో ఆగక ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయటానికి ప్రయత్నిస్తాయి. అందుకే ఆ అక్షరాలు హనుమంతరెడ్డి లాంటి విప్లవకవులవౌతాయి. ఇవి "జీవితంతో కలగలిసి" ప్రాణవంతాలవుతాయ్.

మానవ "జీవన పోరాటంలో అడుగులు కలిపి" మనిషికి ప్రతి రూపాలవుతాయ్. 'సూర్యశక్తిని జీర్ణించుకు'న్న 'జీవాణు'వు లవుతాయ్. అవి చల్లగా ఉండవ్. పాత కుల్లి చల్లగానూ, చలనరహితంగానూ ఉండవ్. అవి కదిలేవీ, కదిలించేవీ.

ఇదినిశ్శబ్దయుగంకాదు. అణిగిపడిఉండే సమాజమూ కాదు. అనుక్షణం ఆర్త నాదమో, వినాదమో ఏదో ఒకటి పీడిత జన హృదయాల్లోంచి వినవస్తూనే ఉంటుంది. సమాజస్థితి కవి మనస్థితిలో, కవిమనస్థితి కవి ఊహించే ప్రకృతిలోకూడా కనబడు తుంది. అందుకే

"గాలి। ఏదోచెప్పాలని। ప్రయత్నిస్తుంది
తాటిచెట్ల తోపులో। రివ్వున దూసుకుపోతూ
ఆకుల నాలికలు। గలగల లాడిస్తూ" (ప్రసవ వేదన)

పువ్వు తెల్లని తల నాడిస్తూ, మబ్బులు మెలికలు తిరుగుతూ ఏదో చెప్పా లను కుంటాయి. అవి చెప్పేది సౌందర్యాన్ని గురించికాదు. ఆర్తనాదాల్ని గురించీ, వినాదాలగురించీ, నెత్తురు మరకల్ని గురించీ, వేదనల్ని, విప్లవ సూచనల్ని గురించీ పుడమితల్లి పురిటినొప్పుల్ని ప్రకృతికూడా సూచిస్తుందన్నమాట.

సమాజంలో ఇంత జరుగుతున్నా అవేవీ పట్టించుకోకుండా కొంతమంది వైయక్తిక గొడవల్ని గురించే రాస్తుంటారు. పాశ్చాత్యసాహిత్యం వేసే కొన్ని వెర్రి తలల్ని చదివి, అజీర్ణమై అవన్నీ ఇక్కడ వదిలిపెడుతుంటారు. "వాళ్ళ ముఖాలన్నీ పాతవే" వాళ్ళు "పెంటడబ్బలు". అవన్నీ ఉద్యమ వరదలో కొట్టుకుపోతాయి.

త్వరలో "ఒక అగ్ని పర్వతం బద్దలు కానున్నదనీ", "ఒక ఝ ఝా నిలం తూర్పుకొండల్లో వాయుగుండంగా పేరుకుంటుందని" కవికి తెలుసు. విప్లవ శక్తులదే తుదివిజయమని తెలుసు. ఈ జ్ఞానానికి ఏ బోధివృక్షమూ అక్కర్లేదు. ప్రజల్నీ, ప్రజలకు సంబంధించిన సిద్ధాంతాల్నీ అవగాహన చేసుకుంటే చాలు. హను మంతరెడ్డి గారికి ఆ అవగాహన ఉంది. అందుకే "గోడలు అంచులుగా కత్తిరించిన ఆకాశంతునకకింద" ఉన్నా, గదిలో ఉన్నా, అధివాస్తవిక మనస్థితిలో ఉన్నా సమాజ దృష్టిని వదల్లేదు.

హనుమంతరెడ్డి మంచి కవి అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'రస్తా'లో అనేక ఖండికలు ఈ వాస్తవానికి సాక్ష్యాలు. 'మా అక్షరాలు', 'పదును దేరిన పాట', 'అక్షర సూర్యుడు', 'నారస్తా' వాటిల్లోంచి కొన్ని ఉదాహరణలు మాత్రమే.

అయినా అక్కడక్కడ అనాలోచితంగానో ఏమో "తీగప్రిదలటం", ప్రపంచం "మేల్కాంచటం" లాంటి పద ప్రయోగాలు కనబడతాయి. సాంప్రదాయికులు ఉపయోగించాల్సినపదాలవి. ఇంకొక లోటేమిటంటే ఇందులోని ఒకటెండ్రు కవితలు ఎక్కడ ముగియాలో అక్కడ ముగియక పోవటం. ఉదాహరణకి 'ఉదయం' అనే కవితని తీసుకుందాం. అది "అందుకే నాకు ఉదయమన్నా ఉదయిస్తున్న సూర్యుడన్నా అంత ఇష్టం" అనే పంక్తులోనే ముగిస్తే బాగుండుననిపిస్తుంది. తర్వాతి పంక్తులు సూర్యుడెలాంటివాడో తెలిపే వివరణగా ఉన్నాయి. కవిత్వంలో (చాలా అవసరమైతే తప్ప) వివరణలు అనవసరం. "నా సూర్యుడు రాత్రి రాజ్యం కూలేదాకా చీకటితో పోరాడి, పోరాడి ఉదయం తానే ఎర్రజెండాగా ఎగురుతాడు" అనే పంక్తుల్లో సూర్యుడు ఎర్రజెండా అని చెప్పటం మినహాయించి మిగిలిందంతా మామూలే. సూర్యుడి ప్రతీకకి ఈ వరకే కవి చెప్పదలచుకున్న అర్థం రూఢ్యమైపోయింది.

ఇందులో కొన్ని పాటలు కూడా ఉన్నాయి. పాటల రచనలో హనుమంత రెడ్డిగారు ఇంకా కృషి చేయాల్సి ఉంది.

'రస్తా'ని పరిచయం చేస్తూ వరవరరావు, శివారెడ్డి పీఠికలు విపులంగా రాసారు, కవిత్వం రాస్తున్న వాళ్ళకి అవి ఉపయోగకరంగా ఉంటాయి.

కవిత్వమొక రహస్యస్థావరం కాదు. అదిప్పుడు నలుగురు తిరిగేరాస్తా. భవనాల్లోనో, బారుల్లోనో, సీసాలోనో, సింబల్ వెనకో కవి ఎక్కువసేపు దాక్కోలేడు. కవి జనం మధ్య నిలబడాలి. లేకుంటే వాడు కుళ్ళి దుర్గంధం వీస్తాడు. ఈ విషయాన్ని బాగా గ్రహించగలిగినకవి హనుమంత రెడ్డి. అందుకే ఆయన రాస్తాజనం తిరిగే రాస్తా అయింది.

"గుండె మండి రాసిన గీతం
మళ్ళీ గుండెను మండిస్తుంది
మండే పొయ్యిలోంచి తీసిన కట్టె
మంచు గడ్డలా ఎందుకుంటుంది ?"

—ఆర్. ఎస్. జీ.

కత్తులు నూరండిరో

—గద్దర్

కత్తులు నూరండిరో
కమ్మరోల్ల శీరన్న
బరిసెలు ఎత్తండిరో
బయిండ్లోల్ల బాగన్న ॥కత్తులు॥

చెమటమ్మక బతికెటోల్లు
చెలకి దున్ని బతికెటోల్లు
పిడికెడు మెతుకుల కొరకు
కడుపు నమ్ము కుంటోల్లు ॥కత్తులు॥

కామందుల సేతుల్లో
చెరచబడ్డ చెల్లెండ్లూ
దొరవారి గడులల్ల
దోచబడ్డ చెల్లెండ్లూ
పసుపు కుంకుమలు పోయి
ప్రాణమొకటి మిగిలినోల్లు ॥కత్తులు॥

గుండె పీల్చి కొండ తొలచి
పారుతున్న ఏరునాపి
ప్రాణాలను రాళ్ళుచేసి
ప్రాజెక్టులు గట్టినోల్లు
కాల్వ కింద సెంటు లేక
కంటనీల్లు బెట్టెటోల్లు ॥కత్తుల॥

నెత్తురులో పత్తినద్ది
పట్టు బట్ట నేసినోల్లు
రక్తాన్ని మరిగించి
ఇనుమును కరిగించినోల్లు
గనుల నుంచి బొగ్గు తొవ్వి
భగ్గు భగ్గు మండెటోల్లు
సంపదకు పునాదులై
సమాధులై పోయెటోల్లు ॥కత్తుల॥

సంపదపై సర్వహక్కు
శ్రమ జీవికి దక్కేదాక
సెలక, సేను, దుక్కి, మొక్క
రైతు హక్కు పొందె దాక
రైతు రాజ్య మొచ్చె దాక
కూలి రాజ్య మొచ్చె దాక ॥కత్తులు॥

---

10. మరో కెరటం - ఆధునిక సాహిత్య బులెటిన్ - 3, విజయ నగరం సాహితీ మిత్రులు ప్రచురణ, పేజీలు: 12, 1/8 డెమ్మీ, వెల: లేదు, ప్రతులకు: ఎ. రాం బాబు, C/o పాన్‌షాప్, న్యూ పూర్ణావద్ద, విజయ నగరం-531202
11. వెల్లువ - కథా కవితా సంచిక నెం3, నూతన సాహితి, సిరిసిల్ల నిర్వహణ (మే 1982). పేజీలు: 12, 1/8 డెమ్మీ, వెల: 30 పైసలు, ప్రతులకు: నూతన సాహితి, సిరిసిల్ల-505 301
12. సైబవద చిత్రాలు - ఇందూరు భారతి ప్రచురణ (మార్చి 1982), పేజీలు: 60, వెల రు. 8-00, ప్రతులకు:ఇందూరు భారతి, 'ఆకృతి' ఆర్ట్ స్టూడియో, జవహర్ రోడ్, నిజామాబాద్-503001

పుస్తక స్వీకారం

1. శరత్ పూర్ణిమ- జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి కథలు- నవోదయ పబ్లిషర్స్ (జనవరి 1981) పేజీలు: 282+4, 1/8 క్రౌన్, వెల. రు 14.00, ప్రతులకు: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-520002

2. ఎక్స్‌రే లోగిలి-ఆధునిక కవితావేదిక_మార్చి, ఏప్రిల్, మే. సంచికలు పేజీలు: ఒక్కొక్కటి 16, 1/8 క్రౌన్. సాలుచందా 6 రు. ప్రతులకు: ఎక్స్-రే, కొల్లూరిహౌస్, అమలాపురం-533202

3. రాబందులు – స్త్రీ పాత్రలేని నాటిక - పర్వెల్లి మురళి - పేజీలు: 44+8, 1/8 క్రౌన్, వెల. రు 3-00

4. సరస వినోదిని - పది వినోద కార్యక్రమాలు - నాసర్ - పేజీలు: 44,1/8 క్రౌన్, వెల. రు. 3-00

5. అల్లూరి సీతారామరాజు - గొల్ల సుద్దులు - టి. రామాంజనేయులు- పేజీలు: 40, 1/8 క్రౌన్, వెల. రు 3-00

ఈ మూడు పుస్తకాలూ అరుణారుణ ప్రచురణలు, సూర్యాపేట ప్రచురణ (జనవరి 1982) ప్రతులకు: స్టార్ బుక్ హౌస్, సూర్యాపేట, నల్లగొండజిల్లా

6. వెల్లువ - కథా కవితా సంచిక - నిర్వహణ: నూతన సాహితి, సిరిసిల్ల, (ఏప్రిల్ 1982), పేజీలు: 6, 1/8 డెమ్మీ, వెల. లేదు. ప్రతులకు: నూతన సాహితి, సిరిసిల్ల_505 301

7. ఇలా ఎంతకాలం? - కవితా సంపుటి - తేజస్విత - సాంస్కృతీ సమాఖ్య, కడపజిల్లా ప్రచురణ(డిసెంబర్ 81) పేజీలు: 34+vi+4, 1/8 డెమ్మీ, వెల: రు. 5-00, ప్రతులకు: డి. లక్ష్మీ నారాయణ,B.A., B.L, 10/139, బెల్లం మండీ వీధి, కడప-516001

8. కౌగిలం పువ్వు - వచన కావ్యం - ఏ. సూర్యప్రకాశ్, రచన పబ్లిషర్స్ ఆర్మూర్ (డిసెంబర్ 1981) పేజీలు: 36+VI, 1/8 డెమ్మీ, వెల: రు 4-00, ప్రతులకు: రచన పబ్లిషర్స్, 1-7_87, పంత్ రోడ్, ఆర్మూర్ - 503224

9. కథ, కథా సాహితి సంపుటి 1,(మే, 1982), పేజీలు: 42, 1/8 డెమ్మీ, వెల. రూపాయి. ప్రతులకు: లిపారియా, ట్రెజరర్,41/ఇ, బ్రహ్మానందనగర్, మలక్ పేట, హైదరాబాదు-500 036

(తరువాయి 95వ పేజీలో)

క్రొత్తగా వెలువడిన "క్రాంతి" ప్రచురణలు

1)	దున్నేవానికి భూమి లభించనిదే రైతాంగానికి విముక్తిలేదు	0—75
2)	మలయా కమ్యూనిస్టుపార్టీ - రెండు చారిత్రక పత్రాలు	1—50
3)	రగల్ జెండా (గిరిజన నృత్యరూపకం) (ఒగ్గుకథ)	1—25
4)	రగల్ జెండా-గొల్లలీర్న కథ (హిందీ-తెలుగులిపిలో గోండుభాషతో)	1—50
5)	ఏం చేయాలి? - లెనిన్	4—50
6)	పోలెండు కార్మికోద్యమం : ఒక పరిశీలన	0—75
7)	కరీంనగర్-అదిలాబాద్ రైతాంగపోరాటాలు వర్ధిల్లాలి!	1—00
8)	ప్రజాయుద్ధం వర్ధిల్లాలి! [చైనీస్‌వ్యాసాలు]	1—50

అచ్చులో

1) మెడికల్ గైడు

పీస్ బుక్ సెంటర్ ప్రచురణలు

1)	"ఊరు" నవల-అల్లం రాజయ్య	4—00

ప్రతులకు :

పీస్ బుక్ సెంటర్
4—5—421,
సుల్తాన్ బజార్
హైద్రాబాదు—500 001

సృజన
హనుమకొండ
వరంగల్ — 506 001

SRJANA is commended for use in Public Libraries in the State by the Director of Public Libraries. Andhra Pradesh, Hyd. Vide Ref, No. 182/A4/67, dated 22-9-1967.

Edited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu' Printed at Parthasaradhi Press, Viiayawada-1. for Venkataramana Mudranalayam, Warangal.
Working Editor : Varavara Rao.

SRJANA Telugu Monthly May / June '82 **H/WL-10**
Regd. No. with Registrar of Newspapers 10953/67.

విరసం మహాసభలకు కొత్త పుస్తకాలు

సృజన ప్రచురణలు :

1) నా కుటుంబం (నవల) 4—00

2) ఉప్పెన (నవల) 6—00

3) ఉద్యమ నెలబాలుడు—శివసాగర్

పీపుల్స్ పబ్లిషర్స్ ప్రచురణ :

చెరబండరాజు కవితలు—పాటలు 6—00

స్టడీ సర్కిల్ ప్రచురణ :

భారత కార్మికోద్యమ చరిత్ర—కె. బాలగోపాల్ 0—50

ప్రతులకు :

పీస్ బుక్ సెంటర్
4—5—421,
సుల్తాన్ బజార్
హైదరాబాదు - 500 001

సృజన
హన్మకొండ
వరంగల్ - 506 001

SRJANA
Hanamkonda-506 001

Single Copy Rs.3-00
Yearly Subscription Rs. 20-00